ఆంధ్ర సచిత్ర వారపత్రిక

9-2-79
75 పైసలు



కళ్ళు కథలు చెప్తాయా..?

అవును! వాటి లోతుల్లో దాగే భావాలు అనంతం. కథల్నేగాదు, నవలల్ని సైతం ఆశ్చర్యకరంగా విరచిస్తాయవి అటువంటి అపురూప భావపరంపరను ఇముడ్చుకున్న విశిష్ట నవలలకు వేదిక 'చతుర'. నెలనెలా ఒక సర్వసమగ్ర నవలను సచిత్రంగా అతి తక్కువ ధరకు అందించటం 'చతుర' ప్రత్యేకత.

ఈ కళ్లు ఓ అమ్మాయివి. ఆ అమ్మాయి అందగత్తె కాకపోవచ్చు, కాని ఆమె చూపులు కడిగిన ముత్యాల్లాంటివి. ఆమె మనసు విరిసిన గులాబిలాంటిది..ఆ మాత్రమే గమనించారు ఆమెకు అయిన వారందరూ... భవిష్యత్ అయోమయంగా ఉన్న తనవారి కుటుంబాన్నా కళ్లు కాపాడాయి వారి జీవితాల్లో సౌరభాన్ని నింపిందా గులాబి .. అయినా ఆమెను మాత్రం వారంతా విస్మరించటానికి కారణం ఏమిటి? అందుకు ప్రతిగా ఆమె గులాబికి ముళ్లు కూడా ఉంటాయని ఎలా నిరూపించింది?

ఈ కథనంతా హృద్యంగా మలచిన 'శ్రీ విరించి' నవల 'చతుర' ఫిబ్రవరి సంచికలో సమర్పిస్తున్న సమగ్ర నవల 'సామగానం'. మధురగాన స్రవంతిలా మిమ్మల్ని అలరిస్తుంది ఈ నవల.

*నవలతోపాటు, మినీ కతలు, చతుర ప్రపంచం, ఫొటో కథనం, రెండు రంగుల చిత్రాలు... ఆకర్షణీయమైన ఆఫ్‌సెట్ ముద్రణ...అన్నీ కలిపి కేవలం **125** పైసలకే అందజేస్తోంది నవనవలా మాసపత్రిక 'చతుర'.*



ముద్దు బిడ్డ మొదటి ఘన ఆహారం. ఇందులో సులభంగా జీర్ణమయ్యే బియ్యం, పుష్టికరమైన 11 విటమినులు, మరియు యినుము కలసివున్నాయి

నెస్టమ్

బిడ్డలకై తయారు చేయబడిన బియ్యపు సారం.

మీ ముద్దు బిడ్డకు ఘన రూపమైన ఆహారం పెట్టడం ప్రారంభించారంటే, ఆ బిడ్డకు మంచి పుష్టినిచ్చే ఆహారం యివ్వండి అంతేకాదు, ఆ ఆహారం అతి సున్నితమైన ఆ బిడ్డ జీర్ణావయవముల మీద తేలికగా పనిచేసేదిగా కూడా వుండాలి సులభంగా జీర్ణమయ్యే ధాన్య ఆహారం బియ్యమేనని డాక్టర్లు అంగీకరించారు అందుచేతనే మేము బియ్యంతో నెస్టమ్ క్రీమ్ తయారు చేశాము ఇందులో మీ బిడ్డ ఆరోగ్యంగా పెరుగుటకు ముఖ్యంగా అవసరమైన విటమినులు, ఇనుము తగినంత పాళ్లలో చేరియున్నది

మీ ముద్దు బిడ్డకు 3 నెలలు నిండగానే యీ ఆహారం యివ్వడం ప్రారంభింపవచ్చు బిడ్డ పెరిగే కొద్దీ యీ ఆహారానికి పండ్లు, కాయగూరలు, పప్పు, కలిపి, క్రొత్త క్రొత్త రుచులు చవి చూపించవచ్చు మెల్ల మెల్లగా




బిడ్డల జీర్ణ
విధానమునకు యెంతో
అనువైనది బిడ్డల
పెరుగుదలకు
చాలా చక్కనిది



గరిష్ఠ ధర
రు. 7-00
స్థానిక పన్నులు
అదనం.

పూర్తి పోషక పదార్థములతో సులభంగా జీర్ణమగు నిండు ఆహారాన్ని తయారు చేయుటకై దీనిని పాలతో కలపండి.



ముందుగా
కాచియుంచిన
పాలను వంచుకోండి.



దానికి నెస్టమ్
కలపండి.




వెంటనే యిచ్చుటకు
తయారు

NESTLÉ

SAA/FSL/N/1134

— లోకంపోకడ * ఊమెన్ —



ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :

దేశోద్ధారక కాశీనాధుని

నాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితం : 1908

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు :

|1938 – 1972|

శుక్రవారం · 9-2-'79

కాళయుక్తినామ సం. మాఘ శు. త్రయోదశి

సంపుటము 72 : సంచిక 22

సంపాదకుడు :

శివలెంక రాధాకృష్ణ

*

పోస్టులో ఏడాది చందా రు. 41-60

ఆరు మాసాల చందా రు. 20-80

విడి ప్రతి వెల 75 పైసలు

ఆంధ్రపత్రిక కార్యాలయము

గాంధీనగరం, విజయవాడ-520 003

విషయానుక్రమణిక

హైదరాబాదు నోట్‌బుక్

ఉపఎన్నికలో ఇం కాం విజయం.

లోక్‌సభ సికిందరాబాద్ నియోజక వర్గంలో జనవరి 7వ తేదీన జరిగిన ఉపఎన్నికలో ఇందిరా కాంగ్రెస్ అభ్యర్థి శ్రీ పి శివశంకరం ఎన్నికయ్యారు ఈయనతో పోటీ చేసిన వారిలో జనతా అభ్యర్థిని శ్రీమతి టి లక్ష్మీకాంతమ్మ మున్నగు పలువురికి పరాజయం కలిగింది. శ్రీ పి శివశంకరంకు 153,037 వోట్లురాగా, శ్రీమతి లక్ష్మీ కాంతమ్మకు 133,092 వోట్లు వచ్చాయి కమ్యూనిస్టు అభ్యర్థి డాక్టర్ రాజబహదూర్ గౌడ్ మున్నగు పలువురికి ధరావత్తు దక్కలేదు శ్రీమతి లక్ష్మీకాంతమ్మ 1977 లో జరిగిన లోక్‌సభ ఎన్నికలలోను జనతా అభ్యర్థినిగా పోటీచేసి వోడిపోయారు వోటర్ల జాబితాలో వేలకొలది పేర్లు తొలగించడం, తారుమారు చేయడం మున్నగు అక్రమాలు జరిగాయి అందువల్లనే ఇందిరా కాంగ్రెస్ అభ్యర్థి గెలిచారని జనతాపార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షులు శ్రీ ఎం వి సుబ్బరాజు మున్నగు జనతా నాయకులు ఆరోపణలు చేశారు సికిందరాబాద్ నియోజక వర్గం నుంచి పోటీ చేసిన 14 మంది ఇండిపెండెంట్లలో ఎక్కువ వోట్లు వచ్చింది శ్రీ మిర్జాముసావర్ అలీబేగ్ ఈయనకు 1757 వోట్లు వచ్చాయి చాల తక్కువ వోట్లు వచ్చిన వారు శ్రీ ఇ వి. ఎస్ పద్మనాభన్ ఈయనకు 244 వోట్లు వచ్చాయి ఈయన ప్రత్యేక తెలంగాణా వాదులలో ప్రముఖులు కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థి డాక్టర్ రాజబహదూర్ గౌడ్‌కు 15వేల వోట్లు వచ్చాయి. ఈ 15 మందికీ ధరావత్తు పోయింది. మొత్తం వోటర్ల సంఖ్య 6,94,742

సైన్స్ కాంగ్రెస్ మహాసభ :

ప్రధాని శ్రీ మొరార్జీదేశాయి జనవరి 3వ తేదీన సైన్స్‌కాంగ్రెస్ 66వ వార్షిక సమావేశాన్ని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రారంభిస్తూ, శాస్త్ర సాంకేతిక ప్రగతి సమాజంలోని అట్టడుగు వర్గాలకు వినియోగపడేట్టుగా శాస్త్రజ్ఞులు ప్రయత్నించాలని సూచించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ శ్రీ జి రామ్‌రెడ్డి స్వాగతం చెప్పారు మహాసభకు 350 మంది విదేశీయులతో సహా 3250 మంది శాస్త్రవేత్తలు హాజరయ్యారు వివిధ విషయాలపై చర్చలు జరిగాయి.

బ్యాంకులు - వర్తకులు ·

బ్యాంకు ఉద్యోగుల సమ్మెలు, జాప్యాలుమూలంగా విసిగెత్తిపోయిన జంటనగరాల వర్తకులు బ్యాంకి ఉద్యోగుల ఉద్యమానికి వ్యతిరేకంగా ఉద్యమం జరుపదలచారు బ్యాంకులలో వున్న తమ సొమ్మును తీసివేసుకొంటారు బ్యాంకులతో నిమిత్తం లేకుండా తమ పనులు కొనసాగించుకోదలచారు బ్యాంకులు క్లియరింగు పనులు నిలిపివేయడం వల్ల ఇప్పటి వరకు 250 కోట్ల రూపాయల చెక్కులు మూలుగుతున్నవి. బ్యాంకి ఉద్యోగుల వైఖరి వల్ల ప్రజలకు కలుగుతున్న చిక్కులను ప్రజలకు వివరించడానికి, కొందరు ఉద్యోగులు తమ కోర్కెల కోసం జాతిని యావత్తు స్తంభింప జేయడం ఉచితంగా లేదని, వ్యాపారులు భావించారు జంటనగరాలలోని 400 పైచిలుకు శాఖలలో జనవరి రెండవవారం నుంచి నిల్వలు తీసివేసుకొనే వారి రద్దీ పెరిగిపోతున్నది. వాపసు తీసుకొంటున్న సొమ్ము రోజుకు సరాసరి 25 కోట్ల దాకా వుందని ఒక వాణిజ్య ప్రముఖుడు తెలిపారు

గులాబీల ప్రదర్శన

ఎప్పటిలాగే ఈసారి కూడ (జనవరి ఒకటి, రెండు వారాల్లో) గులాబీపూల ప్రదర్శనం జరిగింది దాదాపు 300 రకాల గులాబీలు ప్రదర్శించారు ప్రదర్శనానికి పర్యాటక శాఖామంత్రిణి శ్రీమతి రోడామిస్త్రి ప్రారంభోత్సవం జరిపారు ఈ ప్రదర్శనాన్ని హైదరాబాద్ రోజ్ సొసైటీవారు ఏర్పాటు చేశారు శ్రీమతి లక్ష్మీచంద్‌షా ప్రదర్శించిన 'వయొలిన్' జాతి గులాబీని, గులాబీరాజుగాను, శ్రీమతి టి సుబ్బరామిరెడ్డి ప్రదర్శించిన వైట్ క్రిస్టమస్' జాతి గులాబీని గులాబీ రాణిగాను ఎంపిక చేశారు

పార్ట్‌నర్‌కు జోహార్లు

ప్రముఖ ఆంగ్లనవలాకారుడు, వ్యాసకర్త శ్రీ ఇ ఎం పార్ట్‌నర్ శతజయంతి సందర్భంగా ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆంగ్లశాఖ ఏర్పాటు చేసిన గోష్ఠికి ప్రముఖ రచయిత ముల్క్‌రాజ ఆనంద్ జనవరి 4వ తేదీన ప్రారంభోత్సవం జరుపుతూ, పార్ట్‌నర్ మహామనీషి, మానవతావాది అని కీర్తించారు కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కాన్‌బీర్, ప్రొఫెసర్ జి రామ్‌రెడ్డి ప్రసంగించిన మీదట విద్యామంత్రి శ్రీ భవనం వెంకట్రామ్ ప్రసంగిస్తూ, పార్ట్‌నర్ నైతిక మూల్యాలపై విశ్వాసమున్న రచయిత అన్నారు ప్రత్యేక ప్రదర్శనకు ప్రారంభోత్సవం జరిపారు ఉస్మానియా ఆంగ్లశాఖ ప్రొఫెసర్ డాక్టర్ అడపా రామకృష్ణరావు వందనసమర్పణ చేశారు మూడురోజులు జరిగిన ఈ గోష్ఠికి అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, సింగపూర్‌ల నుండి ప్రతినిధులు వచ్చారు


శ్రీమతి సాధలేకు సన్మానం .

ఉస్మానియా విశ్వవిద్యాలయం సంస్కృత శాఖలో రీడరు శ్రీమతి పరిలీసాధలే (పరాడ్కర్) ను జగద్గురు శృంగేరీ పీఠాధిపతులు శ్రీ అభినవ విద్యాతీర్థస్వామి వారు శ్రీ శారదాదేవి ప్రసాద వస్త్రమైన పట్టుపీతాంబరంతో సన్మానించారు శ్రీమతి సాధలే రామచరితమానస్‌ను తులసీమానస నళినం అనేపేరుతో సంస్కృతంలో అనువదించారు జగద్గురువులు తులసీమానస నళినంలోని కొన్ని ఘట్టాలను గంటసేపు శ్రద్ధతో ఆలకించి ఆనందించారు తులసీ మానసనళినం మూడు భాగాలో, 1500 పుటలలో వుంటుంది శ్రీమతి సాధలే బాలకాండం పూర్తి చేశారు ఇది శారదా అనే సంస్కృత పత్రికలో ధారావాహికంగా ప్రచురితమయింది తక్కినవీ ప్రచురితమవుతాయి శ్రీమతి సాధలే సంస్కృతాంగ్ల హిందీ మరాటీభాషలలో గొప్ప విదుషి, వక్త్రి

ఉపశ్రుతి :

"ఏం సార్, తమ అభ్యర్థిపోయినా, ముందు కన్నా హెచ్చు వోట్లు వచ్చాయంటున్నారే ఆపార్టీ నాయకులు, విన్నారా?" అన్నాడొక ప్రత్యర్థి పక్షాభిమాని "అలా అనక ఇంకేమంటాడు ? కింద పడ్డా నాదే పైచేయి అన్నాడట వెనకటికి "ఒక పహిల్వాను" అని సమాధానమిచ్చాడు ఆ ప్రశ్నవిన్న ఒక పెద్దమనిషి

- తిరుమల రామచంద్ర



సీరియల్

గవర్నెస్ కరుణ

గంటి వెంకటరమణ

(గత సంచిక తరువాయి)

కాళికి కళ్ళల్లో నీళ్ళు ఒక్కక్షణం దోబూచులాడాయి. ఈ ప్రేమలు ఒకరు చెబితే రావు ఆత్మలోంచి పుట్టుకుని అయినా రావాలి లేదా రక్త సంబంధంవల్ల కలిగేది అయినా కావాలి

జరిగినకథ 9 డాక్టర్ భార్గవ, మేనకల ఏకైక పుత్రిక కరుణ. తన తల్లి, మూర్తితో చనువుగ ఉండటాన్ని చూచి సహించలేక పోతుంది ఊరి నుండి తిరిగి వచ్చిన భార్గవకు, మేనక మూర్తితో లేచిపోయిందని దర్శన్ చెప్తుంది మేనకా వియోగంతో భార్గవ ఆత్మహత్య చేసుకోగా, అప్పులవాళ్ళు ఆస్తినంతా కాజేయగా దర్శన్‌తో మేనత్త 'కాళి' యింటికి వెళ్తుంది కరుణ బొంబాయిలో తల్లిలేని పిల్ల 'డాలీ'ని సంరక్షించే ఉద్యోగంలో కరుణ చేరుతుంది గణేశ్ ద్వారా డాలీ పుట్టుక గురించి తెలుసుకుంటుంది కరుణ తన కుటుంబవిషయాలను సుధాకర్ ఎక్కడ బయట పెడతాడోనని కరుణ భయపడుతుంటుంది సుధాకర్ తనని వెంటాడుతున్నందువల్ల కరుణ, దర్శన్ ప్రోత్సాహంతో ఢిల్లీ వెళ్ళటానికి నిశ్చయించుకొంటుంది ఇంతలో జాన్‌తో అర్ధరాత్రి లేచిపోతున్న డాలీని డగ్లస్‌కి చూపిస్తుంది కరుణ "నా బిడ్డను లేచిపోయే దానిలా చేశావన్నమాట" అని డగ్లస్ ఆమెను నిందిస్తాడు మేనత్త వూరు తీసుకువెళ్ళి డాలీ మనసును మార్చుతానని హామీ ఇచ్చిన కరుణను వివాహమాడి వీడ్కోలు చెప్తాడు డగ్లస్.

బస్సు దిగగానే బిల బిల మంటూ కాళి పిల్లలు వచ్చేశారు. కాళి కళ్ళద్దాలు పెట్టుకుంది మేనకోడలు కూతురితో వస్తోందంటే ఆమెకు చాలా సంతోషంగా వుంది అప్పుడెప్పుడో ఎన్నో మాటలు అన్న లోకం యిప్పుడు నోరు మూసుకుంటుంది అనుకుంటోంది బస్సు ఆగింది. రెండు ట్రంకులతో బెడ్డింగ్‌తో కరుణ ముందూ, డాలీ వెనకా దిగారు

'అందరూ కరుణచుట్టూ మూగి వదినా బాగున్నావా' అని పలకరిస్తున్నారు

అన్ని సంవత్సరాల తరువాత ఎవరో వీళ్ళంతా అర్థం కావడంలేదు పెద్దపిల్ల దుర్గ ఎక్కువ యిద్దరుపిల్లలున్నారు. దుర్గ కడుపుతోంది. బహుశా పురుడు పోసుకోవడానికి వచ్చినట్లుంది కరుణ దృష్టి ఒక్కొక్కరినే పరికిస్తోంది చాలామటుకు పెళ్ళి అయిన వాళ్ళేవున్నారు.

'హలో కరుణా' రవి పందుంపుల్ల నోట్లో పెట్టుకుని నవ్వుతూ పలకరించాడు. అప్పటి కంటే బాగా లావయ్యాడు. పచ్చగా కూడా వున్నాడు. చీకూ చింతా ఏమీలేనట్లు అతని శరీరమే చెబుతోంది కరుణకి నవ్వు వచ్చింది. బేలగా తనని అర్థించిన ఆ రవికీ ఈ రవికీ ఎంత తేడా!

'లోపలికి రానివ్వవే అందరూ అక్కడే నిలుచో బెడ్తేస్తే ఎలాగ?' ప్రసాద్ భార్యని కేక పెట్టాడు. కాళికి అప్పుడుగానీ తోచలేదు: 'అరె నీ కూతురికి తెలుగు రాదేమిటి కరుణా!'

'ఆఁ' అంది కరుణ

అరుగు మీదే కరుణ ట్రంకు తెరిచింది! అత్తయ్యా యిది నీకు. 'పుల్‌వాయిల్ చీర కట్టుకుని రేపులమలాపురంలో మావయ్యతో నువ్వు మాట్నీకి వెళ్ళాలి' అంది చీర అందిస్తూ

'ఈ చీరలు ఫారిన్ నైలెక్సువి. మీరందరూ తీసుకోండి మావయ్యా ఈ టెరికాట్ షర్టుపీస్ నీకు' కరుణ అందరికీ యిచ్చేసింది ఆ పిల్లకు యిలా మనుష్యుల్లో ఎలా చొచ్చుకు పోవాలో తెలుసు

'మరి నాకు' రవి అడిగాడు.

కరుణ అతని వైపు చూసి నవ్వి 'నీకు లోనావాలా చిక్కీలు తీసుకువచ్చాను.' అంటూ పాకెట్లు యిచ్చింది

జీళ పట్టీ, పల్లీల పట్టీ, నువ్వుల పట్టీ పిల్లలు వాటిని అందుకున్నారు.

డాలీకి ఈ భాష కొద్దిగా తెలిసినా యింత గబగబా మాట్లాడంతో గజిబిజిగా వుంది అందరూ పరికిణీ వోణీలు వేసుకున్నారు

వాళ్ళు కనిపిస్తూ ఈ ప్రాంత యువాళ కొత్తగా వుంది సిగ్గుగా వుంది: డాలీ ఓమూల స్తంభానికి ఆనుకుని నిలుచుంది

'షి యిజ్ మై ఆంటీ ..' అందర్నీ యింగ్లీషులో పేరు పేరునా పరిచయం చేసింది కరుణ డాలీ చిత్రంగా చూస్తోంది.

కరుణ ఆపిల్ల వైపు ఓ క్షణం చూసి కాళివైపు తిరిగింది: 'అత్తయ్యా అప్పుడు నా కోసం కట్టించిన బాత్రూమ్, లెట్రిన్ వున్నాయా?'

కాళి నవ్వింది: 'యిప్పుడు సిమెంట్‌తో చేయించాను'

ఈలోగా కాళి పిల్లలు కాఫీ తయారు చేసి తీసుకు వచ్చి యిచ్చారు కరుణ డాలీని పది కళ్ళతో చూస్తోంది. కాళికి వింతగా వుంది. పెళ్ళి ఎప్పుడైందీ, భర్త ఏం చేస్తున్నాడూ, కులం గోత్రం అన్నీ అడిగి తెలుసుకొని తృప్తి పడింది ఆస్తి వివరాలు తెలుసుకున్నాక గుండె ఆగినంత పనైంది కాళికి అతనికి వున్న షేర్ల వివరాలూ చెప్పింది కరుణ డాలీకి అన్నీ సమస్యలే. తెల్లవారింది మొదలు రాత్రి అయేవరకూ వరుగు లేని వాతావరణం, అర్థం తెలియని భాష. రెండు రోజుల్లో విసుగు వచ్చేసింది మనం' వెళ్ళిపోదాం' అంది చిరాకు పడుతూ

కాళి సైగ చేస్తుంటే నవ్వు వచ్చేది డాలీకి ఎన్ని విధాల ప్రయత్నం చేసినా కరుణ అక్కడినుంచి కదలదని తెలిసిపోయింది డాలీకి రాత్రిళ్ళు ఎంత ప్రయత్నం చేసినా నిద్రపట్టక పోయేది కరుణ అద

మరిచి ఎప్పుడు నిద్రపోతుందా అని ఆలోచించేది. ఆ తరువాత తనూ నిద్రపోయేది.

'ఇక్కడ్ రా. అక్కడ్ పో,' మాటలు నేర్చుకునే సరికి బ్రహ్మప్రళయం అయింది డాలీకి ఎప్పుడెప్పుడు జాన్‌ని కలుసుకోవాలా అనే వుండేది

కరుణకి ఆ రాత్రి హఠాత్తుగా తెలివి వచ్చింది డాలీ ట్రంకు దగ్గరకి వెళ్ళి ఏదో చేస్తోంది. వెనుకగా వెళ్ళిన కరుణని డాలీ చూడలేదు డాలీని చూసి కరుణ, హఠాత్తుగా వచ్చిన కరుణని చూసి డాలీ నిర్ఘాంతపోయారు. చప్పుడు చేయకుండా కరుణ ఆ పిల్లని బయటికి తీసుకు వచ్చేసింది.

అందరూ హాయిగా నిద్రలో వున్నారు. కరుణ అరుగు మీద కూర్చుని మరాఠీలో అడిగింది: 'నీకీ అలవాటు ఎలా అయింది?'

డాలీ జవాబు చెప్ప లేదు.

'చెప్పు డాలీ'

'... ... ...'

'నిన్ను కొట్టనా?'

'నీ యిష్టం.'

'ఎందుకిలా మానర్స్ లేకుండా తయారయావు'

డాలీ జవాబు చెప్పలేదు

'ఈ త్రాగుడు కూడా నీకు జాన్ నేర్పించాడా?'

'మిస్' డాలీకి అతని పేరు వినగానే దుఃఖం ఆగింది కాదు.

'డాలీ ... త్రాగడం హెల్త్‌కి మంచిది కాదు అయినా ఆడపిల్లలు త్రాగడం మన ఇళ్ళల్లో చేసే పనికాదు.

'మనం హైసొసైటీకి చెందిన వాళ్ళం కదా!'

కరుణకి అప్రయత్నంగా నిట్టూర్పు వచ్చింది 'హైసొసైటీ దీని గురించే నేను నా పద్నాలుగో ఏట రిసెర్చ్ ప్రారంభించాను నా రిసెర్చి ఈ జీవితకాలం అంతా చేసినా పూర్తి కాదేమో?

డాలీ ఆమెవైపు చూస్తూండిపోయింది

'అప్పుడప్పుడు అందరూ త్రాగి ఎవరి మొగుడు ఎవరో తెలియని స్థితిలో పడిపోయినప్పుడు వాళ్ళని చూస్తే జాలి వేసేది. ఈ మైకం వదిలి తాము ఎక్కడున్నదీ తెలుసుకుని వుంటే వీళ్ళ పరువు ఏంకాను? అనుకునేదాన్ని!'

'మా అమ్మ మూర్తి ఆకర్షణలో నన్నూ డాడీని నిర్దాక్షిణ్యంగా వదిలిపెట్టేసింది'

'మన హిందువులకే కాదు ప్రతి వ్యక్తికీ వివాహం పవిత్రమైనది రెండు ఆత్మలని ఏకంచేసే ఆ బంధం రెండు జీవితాల్ని కట్టి పడేస్తుంది. ఒకరికొకరు మనసా వాచా కర్మణేనా ఐక్యం అయిపోయే ఆ బంధం త్రెంచుకుని మా అమ్మ అతనితో లేచి పోయింది'

'పెళ్లి లేదు, ప్రేమ లేదు. ప్రేమించిన



ప్రతివాడూ పెళ్ళి చేసుకోడు పెళ్ళాడిన ప్రతివ్యక్తీ సంతోషంగా మాత్రం వుండాడు.'

'వింటున్నావా?'

డాలీ కళ్ళార్పకుండా వెన్నెల్లో కరుణ మొహంలోకి చూస్తోంది

"ఆమె ఏమైందీ ఈ క్షణం వరకూ మాకు తెలీదు నాన్న ప్రెస్టేజ్ భగ్నం అయిందని సూసైడ్ చేసుకున్నారు చివరికి అందరిచేతా అఖరికి మా యింటి వాళ్ళ చేత కూడా నేను 'లేచిపోయిన దాని కూతురన్న' ముద్రతో పిలవబడ్డాను డాలీ నువ్వు చేసేది మంచిపని కాదమ్మా!"

డాలీ అప్పటికే కరుణ వొళ్ళో తల పెట్టుకుని నిద్రపోయింది డాలీ గౌనులో దాచుకున్న సీసాలో ద్రవం అరటి చెంచా మొదట్లో పారపోసి డాలీని లేపి నడిపించు కుంటూ తీసుకువచ్చింది మెట్లు ఎక్కబోతూ సీసాని నాలిలో గిరవాటు వేసింది.

రోజూ రాత్రిళ్ళు డాలీకి నిద్రరావడం లేదు రెండు మూడు సార్లు బయటికి రాగానే కరుణ వచ్చేసేది.

జీవితం అంటే ఏమిటో అర్థం కావడం లేదు. ఆ మర్నాడు పోస్టాఫీసుకు వెళ్ళి జాన్ పేర వుత్తరం రాసి పడేసింది

*　　　*　　　*

రోజులూ వారాలూ గడిచి పోయాయి. డాలీకి జవాబు రాలేదు. మరో వుత్తరం మరో వుత్తరం వన్ వే ట్రాఫిక్‌లా జాన్ వైపు చేరుకుంటున్నాయి.

డాలీ పోస్ట్‌మాన్ కోసం ఎదురు చూసి ఎదురు చూసి విసిగి పోతోంది పోస్ట్‌మాన్ రావడం లేదు వుత్తరం యివ్వడం లేదు. కరుణకే రోజుకో వుత్తరం తండ్రిదగ్గర్నుంచి వస్తోంది ప్లాటానిక్ లౌ అంటే డాలీకి స్పష్టంగా తెలుస్తోంది

ఇన్నేళ్ళల్లో కరుణా, తండ్రి ఎప్పుడూ మాట్లాడు కోలేదు కరుణ చెప్పినట్లు ఆ సంబంధం వల్లే తండ్రి అన్నివుత్తరాలు రాస్తున్నాడు కాబోలు. కానీ జాన్…..

డాలీకి దుఃఖం వుబికి వచ్చేసింది. ఎన్ని కబుర్లు చెప్పాడు? ఎలిఫెంటాకేర్స్‌కి కరుణకి తెలియకుండా వెళినప్పుడు ఐ లౌయూ అంటూ ఎన్నెన్ని ముద్దులు పెట్టు కున్నాడు ఆ లౌ… ఆ సిన్సియారిటీ ఏమై పోయాయి?

గవర్నెస్ కరుణ

జాన్ వుత్తరం అందింది డాలీ ఆల్ చిస్తూండగానే పోస్ట్‌మన్ వుత్తరం యిచ్చాడు డాలీ ఆ వుత్తరం చప్పున అందుకుంది. కరుణ క్రీగంట గమనిస్తూనే వుంది: వుత్తరం ఎవ్వరాశారు కరుణా?' కాళి అడిగింది

'నాన్నగారు' అని సమాధానం యిచ్చింది.

డాలీ ఆ వుత్తరం చదవడం పూర్తి చేస్తూనే సొమ్మ వచ్చినట్లు పడిపోయింది అక్కడే వున్న కరుణ చటుక్కున పట్టుకో పోతే అయితే స్తంభానికి తగిలి పెద్ద దెబ్బ ఏర్పడేది. పిల్ల పడిపోవడం కరుణ పట్టు కోవడం కాళి చూసి పరుగున వచ్చింది. కంగారు పడిపోతూ 'ఏమైంది?' అని అడిగింది

'బలం లేదు. అప్పుడప్పుడు యిలాగే పడిపోతుంది'. కరుణ సరి చెప్పింది.

కాంతి పోరాటం

ఆనందం అందుకోలేని
అంచుల మాటున
ఆహర్నిశలు ఉహాప్రహేళికల్లో
మంచు బిందువుల్లా రాలేక్షణాలు.
కోట్లాది అనుభూతుల
అంతరంగాల్లో విషాదఛాయలు
లక్షలాది చేతుల వెలుగు హారాల్లో
వేలాది ముఖాల విరిసే చిరు నవ్వులే
ఎగిరి పోయాయి వెలుగై ఆకాశానికి!
అనంతంగా ఇంకా వ్యాపించింది అంధకారం
కళ్ళు మూసుకోగనే
దారి వెతుక్కొంటున్న కనుగుడ్లు.

స్వార్థం చీకటి కమ్మినా
ఎక్కడో మంచితనపు కాంతిరేఖలు,
దట్టమైన నైరాశ్యంలో కూడా
వడక మనని చూపుల కాళు,
ఆకాశంపై నిరంతరం మండే –
"అలగాజనం" మనుగడ
చుట్టూ కబళించే చేతులు
చేతులు చీల్చుకుంటూ
సాగుతున్న కాంతి పోరాటం.

– నిఖిల్

మంచినీళ్ళు మొహంమీద చల్లి కొద్ది సేపు పోసరాక డాలీ లేచింది కరుణని చూడగానే బావురుమని ఏడవాలనిపించింది చుట్టూ వున్నవాళ్ళని గమనించి కరుణ కప్పుకొనే 'నో' అంది డాలీ ఆ వుత్తరం కరుణచేతికి అందించింది

డియర్ డాలీ,

క్షమించు నేను ఎప్పుడోనిన్ను మరిచి పోయాను తిరిగి జ్ఞాపకం చేసేందుకు ప్రయత్నం చేయకు ప్లీజ్.

— జాన్.

కరుణ వదిలి పక్కకు పెట్టేసింది. ఇటువంటివి ఎన్నో కథలు వింది ఇలా జరుగుతుందని కూడా ఆమెకు తెలుసు. డాలీకి యిది పెద షాక్ ఈ షాక్‌నుంచి ఆ పిల్ల కోలుకోవాలంటే కనీసం రెండు నెలలు పట్టొచ్చును కరుణ ఆలోచిస్తోంది.

'మిస్, మిస్…' కళ్ళల్లో నీళ్ళు కదులు తూంటే బెంగగా చూసింది

కరుణ జవాబు చెప్పకుండా దగ్గరకి తీసుకుని వుత్తరంచింపి దగ్గర వుంచుకుంది.

కరుణని ఎప్పుడో చిన్నప్పుడు చూసి నట్లే యిప్పుడుడాలీనికూడా చూస్తున్నారు.

'నువ్వు ఈత నేర్చుకో డాలీ' కరుణ వాతావరణం తేలిక చేయాలని అంది.

డాలి చిత్రంగా చూసింది.

'చిన్నప్పుడు యీ దుర్గ అంటే ఎంత బాగా ఈత కొట్టేదో తెలుసా?'

డాలీకి వయస్సైతే వచ్చింది కానీ మొహంలో, చేష్టల్లో అమాయకత్వం పోలేదు ఆశ్చర్యంగా చూడసాగింది

కాళి చిన్నకూతురు డాలీ యీడు పిల్ల డాలీ చేయి అందుకుని 'రా' అంది.

'నాకు సిగ్గు మిస్' అంది డాలీ

'ఏంఫరవాలేదు వాళ్ళునీకుచూపిస్తారు' డాలి ఆ పిల్ల వెనుక వెళ్ళింది.

చిన్నప్పుడు తన చూసిన కౌశికే డాలీ యివాళ తోటంతా చూస్తోంది. ఆకాశాన్నంటుకునే మేడలతో రద్దీగా వుండే రోడ్లతో. ఎప్పుడూ కారుహారన్లతో, ఎరోప్లేన్ల శబ్దాలతో రణగొణ ధ్వనిలా వుండే బొంబాయి నగర వాతావరణానికీ యిక్కడి ఈ వాతావరణానికీ పోల్చి చూసుకుంటోంది

తెల్లవారకముందే మావి చిగుళ్ళు తిని కోయిల 'కూ' అంటే అదే సుప్రభాతంగా లేచి కూర్చుంటారు కనుచీకట్లు తెల పడక

ముందే సందడి మొదలు అవుతుంది. బయటికి రాగానే మంచు పరదాలు కట్టి నట్లూ, భూమికీ ఆకాశానికీ సఖ్యం కలవు తున్నట్లూ కనిపిస్తుంది గడ్డి పువ్వులు మంచు బిందువులా విచ్చుడగానే పక్కున నవ్వుతున్నట్లు అనిపిస్తుంది.

చెంపలకి చేతులు ఆన్చుకుని విచిత్రంగా చూస్తుంది డాలీ. మరలో పిండి పట్టించి గణేశ్ తీసుకురావడం ఆమెకు తెలుసు. కానీ రెక్కలు ముక్కలయ్యేట్లు అటుకులు దంపుతున్న తన యీడు పిల్లల్ని చూస్తుంటే గమ్మత్తుగా అనిపిస్తూ వుంది

తేగలూ, దుంపలూ, పూతరేకులూ, యీ తిండి పదార్థాలే విచిత్రంగా వున్నాయి. గంగలా మాట్లాడేస్తూ నిమిషం తల్లి తండ్రులు పిల్లల్ని వదిలి వుండరు ఆ పిల్లలూ అంతే అంత పెద్ద తండ్రికి సలహాలనిస్తుంటారు తను తండ్రి మొహంలోకి నిర్భయంగా చూసిన క్షణం ఒక్కటి కూడా జ్ఞాపకం రావడంలేదు.

మగపిల్లాడు రాగానే తుర్రున పారిపోయి తలుపు వెనుక నుంచి సమాధానంయిస్తారు అదేమో ? రోడ్డుమీదికి వెడితే ప్రసాద్ పిలిచి 'తప్పమ్మా పెంట్లోంచి వెళ్ళాలి' అన్నాడు.

రోడ్డుమీద ఒక్క ఆడమనిషి కనిపించదు. ఎవరో ఒకళ్ళిద్దరు కనిపించినా వాళ్ళు ఏ ఎరుకల వాళ్ళో తప్ప మామూలు పెద్దింటి వాళ్ళు కాదు.

రోజులు గడుస్తున్నాయి. జాన్ జ్ఞాపకం వస్తున్నాడు అతన్ని తాకి పరవశం పొందిన ఈ శరీరం అప్పుడప్పుడు తిరిగి అతను కావాలని మొరా యిస్తోంది మనసు మాత్రం ఎంత అన్యాయం అంటోంది.

గ్లాసులో పోసి చేతికి అందించి 'ముందు తాగుతూంటే ఏం బాగుండదు. తాగాక చూడు థ్రిల్' అన్నాడు

డాలీ ఆ రోజు భయం భయంగా రెండు మూడు సార్లు సిప్ చేసింది. ఎదురుగా వున్న అద్దంలో చూసుకుంటే ఎంత అసహ్యం వేసింది ? ఆ తరువాత ఎక్కడెక్కడో శరీరం తేలికగా దూదిపింజ కంటే పలచగా గాలిలో ఎగిరి పోతున్నట్లు అనిపిస్తే నిజంగానే థ్రిల్ అనిపించింది.

ఆ తరువాత తండ్రి దగ్గర్నుంచి నెమ్మదిగా కొట్టేసి రాత్రుళ్ళు తనగదిలో నిశ్శబ్దంగా వున్నప్పుడు తాగేసి పడుకునేది యిప్పుడు ఒక చుక్క కనిపించడంలేదు నీళ్ళకువచ్చినా సరే చలాకీ తనం తనకు లేదేం వాళ్ళమొహాల్లో కనిపించే తేటదనం తనకు లేదేం ? అన్నీ ప్రశ్నలే

యిక్కడ వుండాలన్నా బోర్‌గానేవుంది. ఆ మాటే అంది కరుణతో.

కరుణ నవ్వి 'గోదావరిమీద షికార్ తీసుకెడతాడట అంకుల్' అంది

రవి కళ్ళతోనే నవ్వి 'యస్ వస్తావా' అని అడిగాడు డాలీ తల వూపింది

అతను డాలీని రాజమండ్రి తీసుకు వెళ్ళాడు. అతని చేతికి వందరూపాయల నోటు యిస్తూంటే కాళి వింతగా చూసింది. అంతటితో వూరుకోక 'కరుణా డబ్బుని నువ్వు నిర్లక్ష్యం చేస్తున్నావు' అంది.

కరుణ ఒకసారి ఆమె మొహంలోకి చూసి 'యిప్పుడు సమయం వచ్చిందికాబట్టి ఖర్చుచేయాలి రేపు కూడబెట్టే సమయం వస్తుంది అప్పుడెలాగా బ్యాంక్‌లో వేయక తప్పదు కదా అంది

దుర్గకి మగపిల్లవాడు పుట్టాడు బారసాలకి, డబ్బు చాలదని భార్యాభర్తలు అనుకుంటూంటె విని కరుణ 'నేను యిస్తానత్తయ్యా' అంది

కాళి కళ్ళు తుడుచుకుంది. 'నీకు మేము ఏ విధంగానూ సహాయం చేయలేకపోయాం యిప్పుడు నీ దగ్గర ఋణం తీర్చుకునేందుకు వీలులేకుండా ఎంతో డబ్బు తీసుకుంటున్నాం'

ఆ మాటకి చిన్నగా నవ్వింది కరుణ : 'డబ్బు ఎవరిదైతేనేం అత్తయ్యా అనుభవించే యోగం కావాలి అంతే'


డాలీ ఆమె మనసులో మెదిలింది. అపరిచిత అయిన డాలీని ఎవరూ యిన్ని రోజులు యింత ప్రశాంతంగా వుండనీయరు. తన ద్వారా బంధుత్వాన్ని కలుపుకుని ఆ పిల్లని తనకంటే బాగానే చూస్తున్నారు. యింతకంటే తనకేం కావాలి ? ఆ పిల్ల తప్పుదారిన పడకుండా యిక్కడ యీ మనుష్యుల మధ్య మసిలేందుకు ఏర్పాటు చేసింది

కొన్ని సార్లు పాఠాలు నేర్పించేపనిలేదు. వాళ్ళంతట వాళ్ళు చూసి నేర్చుకోవడం యిటువంటి సందర్భాల్లోనే జరుగుతూ వుంటుంది.

డాలీకి రవి అన్ని ప్రదేశాలూ చూపించాడు అతనికి గతం జ్ఞాపకం వచ్చింది వెంటనే నవ్వూ వచ్చింది. గుప్పిట్లోంచి జారిపోయిన నీళ్ళలా వుంది ఆ గతం యిప్పుడు అతనికి ఒక కొడుకు, ఒక కూతురు భార్య పురిటికి వెళ్ళింది. పిల్లకి ఐదోనెల వచ్చాక గానీ పంపం అని చెప్పారు అత్తగారు వాళ్ళు.

తనకేం బాగానే వున్నాడు మొదట్లో కరుణ దూరం అయిందని వారం పది

వచ్చిన వాళ్ళందరికీ మావారు ఈమాట చెప్తున్నారు
చెప్పి చెప్పి నానోరు నొప్పి పట్టింది నాయనా!
అందుచేత ఈ బోర్డు రాయించి పెట్టాను!!



గవర్నెస్ కరుణ

రోజులు మనసు ఏడ్చింది నెల్లాళ్ళకి కరుణ రావడం వెళ్ళడం కలలో ఘట్టం అయింది. ఆ తరువాత కాల ప్రవాహంలో మరుగున పడిపోయింది. యిప్పుడామెను చూడగానే తన ప్రవర్తనకి, ఆనాటి బలహీనతకీ నవ్వు వస్తోంది అంతకు మించి మరే భావం కలగడం లేదు.

రోజుకో ప్రదేశం చూపిస్తూ అన్నీ పూళ్ళూ దగ్గరో వున్నవి చూపించాడు పళ్ళాంమ్మకి చలిమిడి పానకాలు పోసేందుకు కరుణ కూడా వెళ్ళింది.

డాలీ కాలువ గట్టున కూర్చుని ఆలోచిస్తోంది. నెలా రెండు నెలలు గడిచిపోయాయి. యింతవరకూ బంధువులూ, బంధుప్రీతి ఆ పిల్లకి తెలియదు. వీళ్ళందరి మధ్యా వుంటూంటే జాన్ గుర్తు రావడం లేదు. అప్పుడప్పుడు తన మీద తనకే అసహ్యం వేస్తుంది. జాన్ ముట్టుకున్న ఈ శరీరం ఎంతో అపవిత్రం అయినట్టు బాధపడుతోంది. అంతలోనే 'థాంక్ గాడ్' అనుకుంటుంది.

ఆ రాత్రి వెళ్ళిపోయివుంటే... వొళ్ళంతా జలదరింప జేసే ఆ ఆలోచన డాలీ మనసు మీద దెబ్బతీస్తుంది. ఆ దేవుడే 'మిస్' రూపంలో కాపాడి వుండాలి అనుకుంటుంది. కాలిరెండు సార్లు అంది. 'మిస్ కాదు మమ్మీ' అని.

ఆ మాటకి నవ్వి వూరుకుంది.

పిల్లలందరూ చుట్టూ చేరగానే ప్రసాద్ కూర్చుండి పోతాడు అతన్ని అనుకుని కూర్చుంటారు పిల్లలందరూ. అటు వైపు ఆశగా చూస్తుంది డాలీ కరుణ అక్కడికి ఎప్పుడు వస్తుందో డాలీని రెండు చేతుల్లో బంధించి దగ్గరకు తీసుకుంటుంది. యింక యింటికి వెళ్ళిపోవాలి. తండ్రిని చూడాలి. కనీసం చూడాలి.

ఆ రాత్రి డాలీ భోజనం చేయలేదు. పిల్లలందరూ కారణం అడిగి ప్రాణం తీశారు. 'మా డాడీని చూడాలి' అంది డాలీ కరుణ నవ్వుకుంది.

డాలీని గురించి భర్తకి రాసిన వుత్తరాలు తూకం వేస్తే ఓ కిలో తూగుతాయి. ప్రతి వుత్తరంలో డాలీని ఎలా చూడాలో రాస్తోంది. ప్రతి వుత్తరానికీ అతను జవాబుగా 'ప్లీజ్

త్వరగా రా డాలీని బాగా చూస్తాను' అంటూ రాస్తున్నాడు.

మర్నాడే ప్రయాణం. కాళి ఏవేవో చేసి మూటలు కట్టింది. డాలీని దగ్గరకు తీసుకుని అప్పుడప్పుడు వస్తూ వుండు అంది. డాలీ బుర్ర వూపి నవ్వింది. డాలీకి అప్పుడు కరుణకి కుట్టించినట్టే పరికిణీ కుట్టించింది. కాళితో అంది కరుణ: 'అప్పుడు నువ్వు పరికిణీ కుట్టించావు. నా జీవితం బాగానే వుంది. మా డాలీకి కూడా మంచి సంబంధం దొరుకుతే అంతేచాలు' కరుణతో డాలీ బస్సు ఎక్కింది.

*　　*　　*

బొంబాయి రైల్వేస్టేషన్‌లో డూప్లే వొళ్ళంతా కళ్ళు చేసుకుని నిరీక్షిస్తున్నాడు. రైలు ఆగింది. అసలే బొద్దుగా వుండే డాలీ మరింత బొద్దుగా ఆరోగ్యంగా తయారైంది.

మొహంలో పెనుతుఫానుల తరువాత ఏర్పడే ప్రశాంతత ఏర్పడింది. పరికిణీ కట్టుకున్న తెలుగుదనం మరింత నిండుతనాన్ని తీసుకువచ్చింది. డూప్లే రెండు క్షణాలు ఆలోచించాడు. ఆ తరువాత రెండు చేతులూ చాపాడు.

డాలీ రెండు అడుగులు వేసి ఆగి చటుక్కున అతని గుండెల్లో దూరి పోయింది. అతను ఆ పిల్ల నుదుటి మీద ఆబగా, ఆశగా ముద్దు పెట్టుకుంటూండి పోయాడు. కరుణ కళ్ళల్లో నీళ్ళు నిండాయి. వింత తపస్సు చేయాల్సి వచ్చింది. కొట్టకుండా, తిట్టకుండా, తప్పుని ఎత్తి చూపించకుండా దారిలోకి తీసుకు రావాలంటే 'భగవాన్' అనుకుంది.

అప్పుడు డూప్లే తలెత్తాడు. ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుని 'థాంక్యూ' అన్నాడు. ఆమె ఆ చేతిని వదల్లేదు. ఒక వైపు భార్యని మరో వైపు కూతుర్నీ నిమిషం సేపు చూసుకుని దీర్ఘంగా నిట్టూర్చాడు. జీవితంతో పోట్లాడి అలసి పోయిన అతనికి ఈ క్షణం 'రిలీఫ్'గా వుంది.

'మమ్మీ త్వరగా రా' డాలీ కరుణని కేకేస్తోంది.

'ఐయామ్ సారీ కరుణా నీ పెంపకాన్ని నేను శంకించాను' డూప్లే నొచ్చుకున్నాడు.

'నెవర్ మైండ్ యిది నాకు ఛాలెంజ్. తల్లితండ్రులే పిల్లలకి సోపానాలు' కరుణ అంటోంది.

గేటు బయట టాక్సీలో సామాను ఎక్కించి కూర్చుంది డాలీ నిద్ర ముంచుకు వస్తోంది. తండ్రి కూర్చున్నాక అతని తొడ మీద తల పెట్టుకుంది డాలీ. అంతలోనే నిద్ర పట్టేసింది.

కరుణ అతని భుజం మీద వాలి 'థాంక్యూ సర్. గవర్నెస్‌గా యీ స్టేషన్‌లో దిగాను. యిప్పుడు గృహిణిగా తీసుకువెడుతున్నారు. థాంక్యూ ... థాంక్యూ వెరీమచ్' అని కృతజ్ఞతగా చూసింది.

'నా కన్నా ఎక్కువగా నీ కోసం ఎదురు చూస్తోంది మీ దర్శన్' అతను ఆమెని రెండు చేతుల్తో దగ్గరికి తీసుకున్నాడు. కరుణ అతని మొహంలోకి చూసింది.

రోడ్డుని టాక్సీ మింగేస్తోంది. యిప్పుడెంత రిలీఫ్‌గా ఉంది ఎవరికి వాళ్ళే అలసి సేద దీరినట్టున్నారు. డూప్లే తృప్తిగా చూస్తున్నాడు. అతనికి ఈ ప్రపంచం హరివిల్లులా కనిపిస్తోంది

(అయిపోయింది) ●

అంకితం


నా ఆరాధ్య దైవం శ్రీ వేంకటేశ్వర స్వామికి — భక్తితో

గంటి వెంకటరమణ

కృతజ్ఞత

'యిప్పుడే వస్తాను' అన్నట్టుంది. కానీ యిప్పటికీ ఎప్పటికీ మళ్ళీ కనిపించలేదే? అలా వెళ్ళిపోయిన మా మేనల్లుడు ఆవుమూర్ అశోక్‌కుమార్‌కి.







వారఫలం

9-2-1979 శుక్రవారం మొదలు 15-2-1979 గురువారం వరకు

మేషం : మీ కార్యక్రమాలు అడావుడిగా ఉంటాయి. స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. వృత్తిలో ఆదాయం పెరుగుతుంది. సాహసిక వ్యవహారాలు లాభిస్తాయి. ముమ్ముందు లాభించగల వ్యవహారాల్లో అభివృద్ధిని సాధిస్తారు. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. దైవకార్యాలు నెరవేరతాయి.

వృషభం : వ్యాపార విస్తరణ ప్రయత్నాలు బాగుంటాయి. సంతోషకరమైన వార్తలను వింటారు. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. మీ మంచితనమే మీకు ఇబ్బందిని కలిగిస్తుంది. ప్రయాణాలు వాయిదా పడతాయి. స్త్రీలకు—బంధు మిత్రులను కల్సుకొంటారు. వినోద కాలక్షేపాల్లోపాల్గొంటారు.

మిధునం : వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. రావలసిన డబ్బు అందుతుంది. రాజకీయ వ్యవహారాలు బాగుంటాయి. మిత్రులకు సహాయం చేస్తారు. సాహసిక వ్యవహారాలు లాభిస్తాయి. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. సాహిత్య కళారంగాల్లో మీ కృషి రాణిస్తుంది.

కర్కాటకం : ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. ప్రయోజనం గల పరిచయాలు ఏర్పడతాయి. భాగస్వాములతో కలిసి చేసే వ్యాపారాలు లాభిస్తాయి. నూతన విషయాలను తెల్సుకొంటారు. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. అలంకార వస్తువులు కొంటారు.

సింహం : మీ తాలూకు మనుష్యులే మిమ్మల్ని వ్యతిరేకిస్తారు. ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది. వారం మధ్యలో మీ కార్యక్రమాలు బాగుంటాయి. వృత్తిలో ఆదాయం పెరుగుతుంది. సాటివారిలో గౌరవం లభించగలదు. స్త్రీలకు—ఆరోగ్యం బాగుండదు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

కన్య : వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. మిత్రుల సహాయం లభిస్తుంది. వారం మధ్యలో చికాకులు ఏర్పడతాయి. వ్యతిరేకమైన వార్తలను వింటారు. చేజిక్కిన అవకాశాలు కూడా జారిపోవచ్చును. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి.

తుల : అన్ని వ్యవహారాల్లోను గౌరవం బాగుంటుంది. ప్రయోజనం గల పరిచయాలు ఏర్పడతాయి. సాహసిక వ్యవహారాలు లాభిస్తాయి. వ్యాపారంలో ఆదాయం బాగుంటుంది. నూతన వ్యవహారాలు లాభించగలవు. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. బంధువులకు సహాయం చేస్తారు.

వృశ్చికం : అనుకూలమైన వార్తలను వింటారు. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. ప్రయాణాలు ఫలించగలవు. స్త్రీలకు దైవకార్యాలు నెరవేరతాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

ధనుస్సు : సాహసిక వ్యవహారాల్లో నష్టం వస్తుంది. అనవసరమైన వ్యయం జరుగుతుంది. వారం మధ్యలో వృత్తి వ్యాపారాలు బాగుంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. ప్రయాణాలు ఫలిస్తాయి. స్త్రీలకు—ఆరోగ్యం బాగుండదు. శుభ కార్యాల విషయంలో అనుకూలత లభిస్తుంది.

మకరం : మీ ఆలోచనలు ఫలిస్తాయి. వ్యాపారంలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. వారం మధ్యలో శ్రమ కలుగుతుంది. లాభం రావలసిన వ్యవహారాల్లోనే నష్టం రావచ్చును. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. బంధువులకు చికాకులు ఏర్పడతాయి.

కుంభం : రాజకీయ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. సాటివారితో వాదప్రతివాదాలు తగవు. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. నూతన వ్యవహారాలు లాభించగలవు. స్త్రీలకు ఆరోగ్యం బాగుంటుంది. ఆడంబరం కోసం వ్యయం జరుగుతుంది.

మీనం : వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. సాహసిక వ్యవహారాలు బాగుంటాయి. అనవసరమైన సందేహాలు కలుగుతాయి. మీ కార్యక్రమాలకు మార్పులు వస్తాయి. ఇతరుల నిమిత్తం శ్రమ పొందవలసివస్తుంది. స్త్రీలకు—పుణ్యకార్యాలు చేస్తారు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

—మహేష్



విరుచుకు పడిన కెరటం

నిఖిలేశ్వర్

భగ్గున మండిపోతున్నట్టున్న ఎర్రని రంగులో మంచి నెత్తుటి రక్తాన్ని పులుము కొన్న పోలీస్ స్టేషన్. వెయ్యి వాట్స్ బల్బు వెలుగులో మండిపోతున్న గోడలు. లోపల వెలుపల ఎటు చూసినా గోడలనిండా ఎర్రని రంగు.

పోలీస్ స్టేషన్ లోపల దూరంగా మూల ఒక గది.

గది లోపల రమేష్ కాళ్ళు చేతులను విరిచి కట్టివేశారు. ఎదురుగా కుర్చీలో డి. యస్. పి. కూచున్నాడు. కుర్చీలనే నమ్ముకున్న రాజకీయవేత్తల దేశంలో ఒక పోలీసు అధికారిగా కుర్చీప్రాణాన్ని తోడేస్తూ బరువుగా – నిండుగా!

డి. యస్. పి "చెప్పరా రాస్కెల్! మహా విప్లవకారుడిలా ఊరిమీద పడ్డావా? ఇంకెవ్వడెవడు వున్నాడు మీ దళంలో?"

రమేష్– "నాకేం తెలవదు!"

"ఏం తెలవదు? ప్రాణాలు తోడేస్తాం చెప్పు!" రమేష్ బాధగా మూలుగుతూ– "నిజంగ నాకేం తెలవదు." డి యస్ పి.– 'మర్యాదగా చెప్పవ్! జాన్సన్ నీ పని కానియ్!'

జాన్సన్‌కు పోలీసు డిపార్టుమెంటులో 'టార్చరింగ్–మాన్‌స్టర్' అని పేరు. క్రాంది పట్టించిన జంతువు. కీ ఇచ్చి వదలివేయబడ్డ మర మనిషి.

రమేష్ మోకాళ్లపై గాయాలు–రక్తం కారిపోతోంది.

రమేష్ కాలివేళ్లు చిట్లిపోయాయి నెత్తురు చిమ్ముతూ ... మొగం నెత్తురు గంట్లతో వాచిపోయింది.

రమేష్ నరాలు జివ్వున లాగుతూ మెలిపెడుతున్నాయి...శరీరం సాంతం పచ్చి పుండులా నమిలి వేస్తోంది.

అంత శారీరకమైన బాధలో కూడా రమేష్ కోపం పరవళ్లు తొక్కుతోంది – "దళారీ పాలకుల క్రింద అల్లుళ్లలాగా మేస్తున్న అధికారుల బంట్లు. అధికారం ఎవడిదైతే వాళ్ల కాళ్ళు నాకే కుక్కలు– రన్నింగ్ డాగ్స్!"

రమేష్ నోట్లోంచి ఒక్క రహస్యం బైటపడలేదు. ఎదురుగా అసంతృప్తితో డి. యస్. పి చెమటలు కక్కుతున్నాడు. –

"ఏరేయ్ మీరంతా బుద్ధిగా చదువుకొని ఏదో ఉద్యోగం చేసుకోక– కుట్రపన్నుతున్నారా! హింసకుదిగి అసంతృప్తిగా వున్న జనాన్ని రెచ్చగొడుతున్నారా లంజకొడుకుల్లారా! ఈ దేశంలో విప్లవం వస్తుందా? మీలాంటి వాళ్ళు ఎంత మంది చస్తే వస్తుందిరా విప్లవం? మీకొక రహస్య పార్టీ – కుట్రలు – ఖతం కార్యక్రమం ... ఎందుకురా ఇదంతా ... బుద్ధిగా చెప్పు– రహస్యాలన్ని చెప్పేయ్ – బాగుపడతావు – ఉద్యోగం ఇప్పిస్తా – కేసులన్నీకొట్టేయిస్తా!"

డి. యస్. పి కోపాన్ని – ఆశల్ని రమేష్ పట్టించుకునే స్థితిలో లేడు. లోపల జీర్ణించుకు పోయిన యాథార్థ్యం మండుతోంది – "దాచుకొన్నా దాగని రహస్యం ఏముందని? కోట్లాది మంది పేలికల్లా వేలాడుతున్న దేశంలో రోజూ కాగితాల్లా ఎగిరి రాలిపోతున్న ఖండంలో బాధకు అర్థం ఏనాడో మరచి పోయిన ఈ భూభాగం మీద జనశేషం ... తమ ఉనికి కోసం కుట్ర పన్నుతున్నారు రోజూ బహిరంగంగానే రాజద్రోహానికి తలపడుతున్నారు. ప్రతి ఒకడు రహస్యంగా బతుకుతున్నాడు. నాజగ్గా – చలాకీగా పేదల బతుకుల్ని నంజుకుని తింటున్న దళారీ యజమానుల దేశంలో కొనసాగిపోతుంది కుట్ర. ఆ కుట్రను బద్దలు చేయాలనే పేద జనానికి ఎక్కడిది

విరుచుకుపడిన కెరటం

రహస్యం? ఎదురు తిరిగే ప్రతి మనిషి ఈ కిరాయి ప్రభువులకు రహస్యమే!"

రమేష్ భావాల్లో మార్పులేదు. ఆలోచనల పరంపర తలను దిమ్మెక్కించింది.

2

ఈ సమాజాన్ని ఏ విధంగా నైనా మార్చాలనే తపన రమేష్‌ను ఉద్యమంలోకి నడిపించింది. కాలేజీ నుంచి బయటికి వచ్చి రోడ్డు మీది ఖాళీ జీవితాలని కళ్లారా చూశాడు. ఈ వ్యవస్థలో వీళ్లు ఇలాగే బతుకవలసిందేనా? ఫుట్‌పాత్‌ల పైన— చెట్లకింద నసుగుపోవలసిందేనా? రాజకీయ పరిష్కారం కావాలి— దీనికి యువకులే నడుం కట్టాలి.

కొందరికి త్యాగం తప్పునే ఆదర్శంతో దళంలో కలిసిపోయాడు. అసలు ప్రజలను వాళ్ల సమస్యల పరంగా సమాయత్తం చేయకపోతే తమ త్యాగం నిరర్థక మవుతుందనే అంశాన్ని ఆ వేడిలో గ్రహించలేకపోయాడు. అందువల్లనే రమేష్ తన కామ్రేడ్స్‌తో ఒకనాడు గుళ్లపల్లి గ్రామంలోకి ప్రవేశించాడు. అక్కడ పెద్ద భూస్వామి రంగయ్య ఇంటిమీద దాడిచేసి ఆ భూస్వామినే ఖతం చేయాలనుకున్నారు. ఈ దాడి గురించి రంగయ్యకు ముందే రహస్యం తెలిసిపోయింది.

రమేష్ దళం గ్రామంలోకి ప్రవేశించింది చీకట్లో. అంతకు ముందే దొంగలు రాబోతున్నారనే ప్రచారం జరిగింది. దళం గురించి సానుభూతి వున్న రైతుల సంఖ్య అల్పం! చీకట్లో ఆదుర్దాకొద్దీ తొందరలో దళం సభ్యులు గతుకుల్లో పడి కాళ్లకు దెబ్బలు తగిలించుకున్నారు. ఈ లోగ రంగయ్య మనుషులు మాటుగాచి పట్టుకున్నారు. దొంగలకింద జమకట్టి- కొట్టి పోలీసులకు అప్పగించారు.

3

జాన్సన్ రమేష్ మొగంపై నీళ్లు కొట్టాడు— కళ్లు తెరచి చూస్తున్న రమేష్‌ను ఉద్దేశించి డి యస్. పి- "ఈ నక్సలైట్ నాకొడుకులు ప్రాణం పోతున్నా రహస్యాలు చెప్పరు" అంటూ దగ్గరగా వచ్చి, రమేష్ వెంట్రుకలని పట్టి ముఖాన్ని పైకి లేపి- "చచ్చి ఏం సాధిస్తావురా... బాస్టర్డ్!" అని ముఖం మీద బలంగా గుద్దాడు.

రమేష్ మూలుగుతూనే పగిలిన పెదాలు రక్తం చిమ్మగా - వెంట్రుకల్లోంచి కారుతున్న నీళ్ల గొంతులోని రక్తాన్ని కలిపి కసిగా డి యస్. పి ముఖం పైకి ఉమ్మాడు.

డి యస్ పి కోపంతో తోడేలులా గంతేసి రమేష్ కడుపులో బలంగా తన్నాడు. రమేష్ తల్లడిల్లాడు — ఆరిపోతున్న దీపంలా భగ్గుమన్నాడు. శక్తినంతా పుంజుకొని అరిచాడు — "విప్లవం వర్ధిల్లాలి!"

మూతలు పడుతున్న రమేష్ కనురెప్పల కింద దృశ్యాలు... కదలిపోతున్న జన సముద్రంలో తానొక దీపంలా ... ఆరిపోతున్న దీపాన్ని జనం అంతగా గమనించడంలేదు... దీపం వెలుగంతా కెరటంలా పైకెగసింది. తాను కెరటంలా దోపిడి తీరాన్ని తన్ని విరిగి చెల్లాచెదరై జనసముద్రపు ఘోషలో కలిసిపోతున్నాడు. లెక్కలేనన్ని అలలు .. రోజువారి కనీసావసరాల సమస్యలకు కొట్టుకుంటున్న అలలు. ఆ అలల్లోంచి అల్లూరి- భగత్‌సింగ్‌ నుంచి ఈనాటి దాకా ఉవ్వెత్తున లేచిన కెరటాలు. రాజ్యాధికారమనే కొండను కాస్తేపు చిందర వందర చేసి- ఉక్కిరి బిక్కిరి చేసి కూలిపోయాయి.

జన సముద్రంలోని సామాన్యుల అలలు. రైతులు- కార్మికుల పోరాటపు అలలు వెనకాలే బలాన్ని ఇవ్వలేదు. అయినా అలలన్నీ కెరటం సాహసానికి ఉత్తేజం పొంది వెనకాలే వస్తాయని పైకెగసింది... కెరటం ఆవేశం కొద్దీ మొండిగా త్యాగ బలంతో అలల బలాన్ని చూసుకోకుండా విరుచుకుపడింది.

బలై విప్లవ అమరత్వాన్ని పొందింది.

జనసముద్రంలో అలలు అల్లకల్లోలంగా కదులుతూనే వున్నాయి.

వడిసముద్రంలో శక్తిని పుంజుకుంటున్న అలలు ...అలలతో బాటు లేస్తున్న కెరటాలు.

రమేష్ కళ్లు మూత పడుతున్నాయి— ప్రజలతో సన్నిహిత సంబంధం కుదుర్చుకోలేక పోయినందుకు బాధ! తన త్యాగం ఇలా వృధా కావలసిందేనా అనే ఆవేదన- శరీరంలోని గాయాలు భరించే శక్తిని అంతిమ దశకు నెట్టింది.

మరుసటిరోజు పత్రికల్లో వార్త—

"ఎదురు కాల్పుల్లో విప్లవకారుడు రమేష్ మరణం."

బొమ్మల మహాభారతం — నల దమయంతుల కథ — మండపాక సీతారామాంజనేయులు



[ఇంకా వుంది]

సమాన వాక్కు



దుగ్గరాజు నాగేశ్వరరావు

సాయంకాలం ఐదు గంటలకు ఇంటికి వచ్చిన సుబ్బారావ్‌ని వాకిటికి వేసి ఉన్న తాళం కప్ప వెక్కిరించింది. ఎంత ఆనందంగా వచ్చాడో అంత నీరసించాడు. మొహం మూడు రంగులుగా మారింది. ముందు కోపం తరువాత నవ్వు ఒకసారిగా వచ్చాయి.

ఇంతలో పనిమనిషి పిలిచిన పిలుపుకు వెనక్కి తిరిగాడు.

''అయ్యగారు. అమ్మగారు ఏడో పనుందని వెళ్ళారు. ఇంద తాళం చెయి. నేను వెళుతుండానయ్యా.''

''సరేలే''. తాళం చేతులు తీసికొని అన్నాడు.

ఎక్కడికి వెళ్ళి వుంటుంది శ్రీమతి. అయినా నాకు చెప్పకుండా రోజు సాయంకాలం ఎదురువచ్చి స్వాగతం ఇచ్చే శ్రీమతి ఇవాళ ఎక్కడికి వెళ్ళుంటుందబ్బా! మనసు రైలు లాగా పరిగెడుతుంది. కాని స్టేషన్ను తగలటం లేదు. అంటే ఎక్కడికి వెళ్ళిందో మనసుకి తగలటం లేదు. ఆలోచిస్తూనే తలుపు తాళం తీసాడు సుబ్బారావ్.

గబగబా వంటయింట్లోకి వెళ్ళాడు. ఫ్లాస్కో కనిపించింది. ఫ్లాస్కోలో కాఫీ గ్లాసులోకి వంపుకొని వచ్చి బల్లముందు కూర్చున్నాడు సుబ్బారావ్. కాని మనసు మనసులో లేదు. చేతులూరు కోక సొరుగు లాగాడు. అందులో ఎప్పుడో వంచిపెట్టగా మిగిలిన కాయితాల కట్ట కనిపించింది. అందులోంచి ఒక కాయితం తీసి చదవటం మొదలుపెట్టాడు.

'మహిళా మండలి' (పెద్ద అక్షరాలతో) క్రింద — భర్తలు, భార్యలకు చేస్తున్న అన్యాయాలను, అక్రమాలను అరికట్టటానికి నిరసనగా ఈరోజు (17.12.77) పెద్ద ఊరేగింపుతో సాయంకాలం ఐదు గంటలకి మహిళా మండలి నుండి బయలుదేరి మెయిన్ రోడ్డులు తిరిగి మరలా మహిళా మండలిని చేరాలి. ఈ ఊరేగింపులో మహిళలందరూ పాల్గొన వలసినదిగా ప్రార్థన.

ఇట్లు, కార్యదర్శిని.

అనుమానంవేసింది. ఇవాళ తారీకు ఎంత. ఎదురుగా గోడకి ఉన్న కాలెండర్‌ని చూశాడు. అవును ఈరోజు 17 వ తారీకు. అక్కడికే వెళ్ళి ఉంటుంది అనుకున్నాడు సుబ్బారావ్.

''మహిళా మండలి నుండి బయలుదేరి మెయిన్ రోడ్లు తిరిగి...ఆఁ ఇహ వీళ్ళు కొంపకి చేరినట్లే. మెయిన్ రోడ్డంటే ఎంతో రెష్. అందులో సాయంకాలం పూట ఇంకా ఎక్కువ. తెల్లవారే సరికి చేరినా చేరినట్లే ఇళ్ళకి.'' ముందు కోపం వచ్చింది శ్రీమతి మీద సుబ్బారావ్‌కి.

''ఎన్నిసార్లు చెప్పినా ఇదే పంతం. దాన్ని వదిలిపెట్టదే. ఏమిటో పంతాలు. కొంచెం కూడ బుర్ర ఉపయోగం ఉండదు'' అనుకున్నాడు బాధగా.

తరువాత స్నానం చేసి నవల చేతబూని మంచం మీదికి వరిగాడు సుబ్బారావ్. నవల పూర్తయ్యే సరికి ఎనిమిది కావస్తుంది. తరువాత భోంచేసి నిద్రలోకి జారుకున్నాడు.

నిద్రలో సుబ్బారావ్‌కి పిలుపు, చప్పుడు వినిపించాయి కలలో అనుకున్నాడు. భయంగా నిద్రలోంచి లేచి కళ్ళు నలుపుకుంటూ, ''అబ్బబ్బా వస్తున్నా ...'' అంటూ వెళ్ళి తలుపు తీసాడు. ఎదురుగా శ్రీమతి ప్రత్యక్షం.

''అబ్బబ్బా ఈ రోజు నా కాళ్ళు విపరీతంగా నొప్పి పుడుతున్నాయి బాబు'' అంటూ వెళ్ళి మంచం మీద వ్రాలింది శ్రీమతి.

గడియారం చూశాడు సుబ్బారావ్. పదకొండు గంటలైంది.

''పదకొండు గంటలదాకా తిరిగితే కాళ్ళు నొప్పులు పుట్టవూ. అయినా నేను చెబితే వింటావా ?''

''ఏమిటండీ వినేది ! ? స్త్రీలంటే నీచంగా చూసే పురుషుల కూపం నుంచి స్త్రీలను రక్షించాలనే మా తాపత్రయం.''

''పురుషుడంటే కూడ స్త్రీలు అలానే చూస్తున్నారు కొంతమంది. మరి వారినేమంటావ్'' అడిగాడు గట్టిగా.

''ఎవరండీ అలాంటివాళ్ళను ఎక్కడన్నా చూపించండి ?''

''ఎక్కడో ఎందుకు నువ్వే !''

''నేనా... ?''

''ఆఁ కాదా ! ? అర్ధరాత్రి దాకా నువ్వు తిరిగి రావచ్చు కాని, మగవాడు తిరిగితే తప్పవడతావా ?''

''నేనేం తిరగటానికి వెళ్ళలేదు. ఊరేగింపుకు వెళ్ళాను. తెలుసా ?''

''తెలుసు. కాని మగవాడికి మాత్రం అర్ధరాత్రిదాక తిరగటానికి అవసరాలే ఉండవు పాపం...''

''ఉండొచ్చు. కాని కొంతమంది చెడు తిరుగుళ్ళకు అలవాటు పడి, ఇంట్లో స్త్రీలను బాధిస్తున్నారు. అలాంటివాళ్ళ చేతులనుండి స్త్రీలను విముక్తి చేయాలి. అదే మా సంకల్పం'' అంది గర్వంగా.

''సరే నీ ఏడుపు నువ్వే ఏడువ్'' అన్నాడు సుబ్బారావ్ కోపంగా.

''అలాగేలేండి పెద్ద చెప్పొచ్చారు'' అంది ముసుకు తంతూ.

''అదేమిటి అన్నం తినవా ?''

''తినే వచ్చానండీ'' అన్నది శ్రీమతి ముసుకు తీయకుండానే.

"అదా సంగతి!" అంటూ లైటార్పి, "అవతలికి జరుగు" అంటూ శ్రీమతి ప్రక్కన చోటు చేసుకున్నాడు సుబ్బారావ్.

*　　　*　　　*

అది ఒక నగరం. ఆ నగరంలో సుబ్బారావ్‌కి సొంత ఇల్లుంది. అది మూడు పోర్షన్ల. వాళ్ళ నాన్నగారు చనిపోతూ ఒక్కగానొక్క కొడుకు ఐన సుబ్బారావ్‌కి ఆ ఇల్లు యిచ్చిపోయాడు. పోయేముందు శ్రీమతికి సుబ్బారావ్‌కి పెళ్ళి చేసిపోయాడు. ఇప్పుడు శ్రీమతి, సుబ్బారావ్ భార్యాభర్తలు. అన్ని విషయాలు ఏకీభావంతో వెళ్ళిపోతాయి కాని ఒక విషయంలో మాత్రం బద్ధ విరుద్ధంగా ఉంటారు. ఒకళ్ళు అది తూర్పు అంటే ఇంకొకళ్ళు కాదు అది పడమర అంటారు.

ఆ విషయం చర్చలోకి వస్తేనే విరుద్ధంగా మాట్లాడుకుంటారు. ఆ టాపిక్కు ఐపోగానే మళ్ళీ కలిసిపోతారు. పెళ్ళై నాలుగేళ్ళయినా ఆ విషయంలో మాత్రం ఏకం కాలేకపోయారు.

శ్రీమతిది మొండి పట్టుదల. తను అన్నది నిజం అంటుంది. సుబ్బారావ్ మాత్రం కొంచెం సేపు ఆలోచించిగాని ఏ విషయం మాట్లాడడు.

మగవాళ్ళు స్త్రీలంటే అసహ్యంగా చూస్తారని అదీ కట్టుకున్న పెళ్ళాన్ని, కుక్క కన్నా హీనంగా ఉంటుందని, తమకు సేవలు చేయించుకోటానికే

పెళ్ళి చేసుకుంటారని, స్త్రీ జాతికే ఇది ఎంతో అవమానకరమని శ్రీమతి అభిప్రాయం. ఈ అభిప్రాయంతో సుబ్బారావ్ **కూడ** ఏకీభవించాడు. కానీ పురుషులంటే కూడ విలువ ఇవ్వని స్త్రీలు కూడ ఉన్నారు. వాళ్ళకి వచ్చిన జీతం మొత్తం ఇవ్వాలి. కానీ పైసా కూడ తిరిగి భర్తకి ఇవ్వరు. భర్తను కుక్కిన పేనులాగ చూసే భార్యలు ఉన్నారు. అంటాడు సుబ్బారావ్.

ఇద్దరివైపూ రెండు రకాలవాళ్ళు ఉన్నారు కాబట్టి వాళ్ళకోసం మనం పోట్లాడుకోనక్కర లేదు. సమాన హక్కులని ఎగబడనక్కరలేదని సుబ్బారావ్ శ్రీమతితో చాలసార్లు చెప్పాడు. కానీ ఈ విషయంపై ఇంకా ఏకీభావం రాలేదు. ఎప్పటికి వస్తుందో...

* * *

"ఏమేవ్ మన రెండు పోర్షన్లు ఖాళీగా ఉన్నాయని గొడవ చేస్తుంటివిగా. ఈ రోజు రాత్రికి రెండు వాటాల్లోకీ వస్తున్నారు. ఒక వాటాలోకి మా ఆఫీసులోనే హాతో పనిచేస్తున్న గోపాలం వస్తున్నాడు. రెండో వాటాలోకి ఎవరో క్రొత్తగా కాకినాడ నుండి వస్తాడట ఎల్. ఐ. సిలో పనట. ఇద్దరూ క్రొత్తగా పెళ్ళైనవారే. అంటే సంవత్సరమేనట పెళ్ళై, ఇంత మంచి విషయం చెప్పినందుకు నాకు ఏమిస్తావ్?" మధ్యలో ఆపకుండా చెప్పేశాడు శ్రీమతికి ఆఫీసు నుంచి వస్తూనే.

వంట యింట్లోంచి స్వీట్, హాట్ ప్లేటుతో శ్రీమతి ముందుగదిలోకి వచ్చింది.

"అబ్బో నాకిష్టమైన స్వీట్ తయారు చేశావే. నీకేం కావాలో కోరుకో..." అన్నాడు తనేదో వరాల వరద స్వామి నైనట్లు ఫోజుపెట్టి.

"మహిళా మండలిలో మీటింగ్ ఉంది దానికి వెళ్ళనిస్తే చాలు" అని అంది శ్రీమతి నిదానంగా.

"వామ్మో! మీటింగే!" తింటున్నవాడల్లా ఆగిపోయాడు సుబ్బారావ్.

"ఇప్పుడే కదండీ నన్ను ఏమైనా కోరుకో మన్నారు. మళ్ళీ ఎందుకు అంత భయపడతారు."

"అహఁ అదికాదు నువ్వు ఈరోజే ఇల్లు చేరతావా!? అని అనుమానం వస్తేను."

"అదా మీ అనుమానం. మీటింగు 6 గంటల నుండి 8 గంటలదాకే. తరువాత వెంటనే వస్తాను."

"సరే నీ ఇష్టం. కాదంటే మాత్రం ఊరు కుంటావా...?"

"ఊరుకోక ఎగిరి గంతులేశానా. అయినా మీరు మాత్రం ఎప్పుడు ఊరుకొమ్మన్నారు. వెళతా నంటే గొణిగే వారేగాని ఎన్నడన్నా గట్టిగా వద్దని చెప్పారా?" అంది కోపంతో రుసరుస లాడుతూ.

"అసలే తలకాయ నొప్పిగా ఉంది" అన్నాడు సుబ్బారావ్ తలకాయ పట్టుకొని.

"అయ్యో. కాఫీ స్టౌమీద పెట్టి మరిచి పోయాను. తీసుకొస్తాను" అంటూ వంటింట్లోకి పరిగెత్తింది శ్రీమతి.

* * *

"ఏమండోయ్ ఈరోజు మన ఇంట్లో అద్దెకు ఉన్న ఎల్. ఐ. సి. ఆయనలేడూ, ఆయన ఇంటికి తాళం వేసి ఆఫీసుకి వెళ్ళాడు నిన్న సాయింకాలం ఆయన పెళ్ళాం కనిపించింది. ఇప్పుడు ఇంట్లో లేదా!? అని ఆశ్చర్యం వేసింది. తరువాత కాసేపటికి ఇంట్లో గిన్నెల చప్పుడయింది. ఏమిటా అని చూస్తే ఆయన పెళ్ళాం ఇంట్లోనే ఉంది."

"మా మహిళా మండలిలోకి క్రొత్తగా కాకినాడ నుంచి సుబ్బలక్ష్మి గారని ఒక ఆమె వచ్చింది. ఆమెకు మన ఇంట్లో వాళ్ళు తెలుసట కాకినాడలో ప్రక్క ప్రక్క ఇళ్ళలోనే ఉన్నారట. ఆయనకి పెళ్ళాం మీద నమ్మకం లేదట. అందుకని ఇలా రోజు ఆమెను ఇంట్లోనే ఉంచి తాళం వేసి ఆఫీసుకెళతాడట. ఆమె చెప్పటం నేను చూడటం నిజమేననిపించింది." అన్నది సుబ్బారావ్‌కి కాఫీ ఇస్తూ.

"ఆమె మంచిది కాదేమో ...?" కాఫీ త్రాగుతూ అన్నాడు సుబ్బారావ్.

"ఆమె చాల మంచిదటండీ. నేను ఆ విషయం కూడ అడిగాను. అయినా పెళ్ళాన్ని నమ్మలేనివాడు పెళ్ళి ఎందుకు చేసుకోవాలి? ఆడదంటే అంత చులకనా మీ మగవాళ్ళకి. ఇలాంటి మగవాళ్ళ చేతుల్లో కీలుబొమ్మలైన ఆడవాళ్ళని రక్షించు

కోవాలనే మా తాపత్రయం" అంది శ్రీమతి ఆవేశంతో.

"తాళంవేసి వెళతాడని చెప్పినంత మాత్రాన్నే నేను నమ్మను" అన్నాడు గట్టిగా తనకు శ్రీమతికి ఉన్న వాదనకు కట్టుకథ చెబుతుందనే అనుమానంతో.

"అయితే రేపు మీరు, ఆయన వెళ్ళేవరకూ ఉండి చూసి మరీ వెళ్ళండి ఆఫీసుకు" అంది కోపంగా.

"సరే అలాగే" అన్నాడు సుబ్బారావ్ శూన్యం లోకి చూస్తూ.

* * *

తొమ్మిది గంటల నుండే సుబ్బారావ్, శ్రీమతి కిటికీ ముందు కుర్చీలు వేసుకుని కూర్చున్నారు గదిలో. అక్కడ కూర్చుంటే ప్రక్కవాటా పంచ కనిపిస్తుంది.

తొమ్మిదిన్నరకల్లా అద్దెకున్నాయన తాళం వేయటం కనిపించింది వాకిలికి. శ్రీమతి నాకు చూపిస్తూ

"చూశారా ఆయన చేసేపని. నామాట మీద నమ్మకం లేకపోయింది మీకు"

నిజంగ అతను ఇంతపని చేస్తాడని ఊహించ లేదు. అలాంటి వాడని తెలిస్తే ఇల్లు ఇచ్చేవాడినే కాదు. మరి మనిషిని చూస్తే అలా లేడే. కానీ చూసిన తరువాత చాల బాధని పించింది సుబ్బారావ్‌కి.

శ్రీమతి ఏమేమిటో అడుగుతుంది. వాటికేమీ జవాబు ఇవ్వకుండా బయట పడ్డాడు సుబ్బారావ్. ఆఫీసులో పనిచేస్తున్నా సుబ్బారావ్ మనసు మాత్రం బాధతో కుమిలి పోతుంది. ఛీ ఛీ ఇలాంటి మనుషులను చూడకూడదు. వెధవ...భార్య మీదే అంత అనుమానమా? మనసు మనసులో లేదు సుబ్బారావ్‌కి.

తలకాయ నొప్పి వచ్చింది సుబ్బారావ్‌కి — మధ్యాహ్నం ఆఫీసుకి శలవు పెట్టి ఇంటికి వచ్చాడు.

"ఏమిటండీ అప్పుడే వచ్చారు" శ్రీమతి ప్రశ్న.

"తలకాయ నొప్పిగా ఉంటేను శలవు పెట్టి వచ్చాను." బట్టలు విప్పి స్టాండ్‌పై వేసి లుంగీ కట్టుకొని మంచంమీద పడుకుంటూ సుబ్బారావ్ యిచ్చిన సమాధానం.

అమృతాంజనంతో వచ్చింది శ్రీమతి.

కళ్ళు మూసుకున్న సుబ్బారావ్‌కి అవే ఆలోచనలు.

అమృతాంజనం చేయి తగిలేసరికి కళ్ళు తెరిచాడు సుబ్బారావ్.

"శ్రీమతిగారు కష్టపడుతున్నారు."

"కష్టమేముందండీ? మొగుడికి సేవ చేస్తున్నాను."

"అయినా అమృతాంజనంతో పోయే తలనొప్పి కాదు నాది."

"ఓహో అదా సంగతి! అయితే నిమిషంలో వచ్చేస్తాను" అంటూ వంటింట్లోకి పరుగుతీసింది శ్రీమతి.

కాలం ఎలాంటిది. మనిషిని మనిషి నమ్మనంతగా మారిపోయిందా!? పాపం ఆ అమ్మాయి జీవితం రాతిజీవితం అనుభవిస్తుంది. ఛీ ఇతను ఇలాంటివాడనుకోలేదు. ఇంటికొచ్చిన క్రొత్తలో బాగానే ఉన్నాడు. మంచివాడనుకున్నాను. కానీ... ఛీ...

ఆలోచించినకొద్దీ తలనొప్పి ఎక్కువౌతుంది.

కళ్ళు మూసుకోబోతున్న సుబ్బారావుకి కాఫీతో శ్రీమతి ప్రత్యక్షం ఐంది.

కాఫీ ఇచ్చి మళ్ళీ వంటింట్లోకి వెళ్ళింది శ్రీమతి.

కాఫీ త్రాగి గ్లాసు ప్రక్కన పెడుతున్న సుబ్బారావ్‌కి రెండోవ వాటాలోంచి ఏవో మాటలు వినబడుతున్నాయి. గొడవగొడవగా ఉంది. ఇంట్లో ఆడ గొంతు గొంతు చించుకుంటోంది.

ఆ మాటలనే ఆలకిస్తూ పడుకున్నాడు సుబ్బారావ్.

"పది రూపాయిలు తగ్గాయి ఏం చేశారు."

"ఏదో ఫ్రెండ్స్ పార్టీ అడిగితే ఇచ్చాను" నసిగింది మగగొంతు.

"ఇలా పార్టీలిస్తే ఇంట్లో గడ్డి తినాల్సి వస్తుంది" గట్టిగా అంది ఆడగొంతు.

"ఈ ఒక్కసారే గదే" నసిగింది మగగొంతు.

"ఒక్కసారే గదా అని ఊరుకుంటే అమ్మో! ఇంకేమన్నా ఉందా! మీరు తెగించరూ!?"

"అయినా మీరు పది రూపాయలు ఖర్చు చేశారు కాబట్టి మీకు పది రోజులు టిఫిన్ లేదు. అర్థమైందా? గుర్తుపెట్టుకోండి. ఈ రోజు నుంచి పది రోజులు."

"........"

అరె ఇటు ప్రక్క అద్దెకున్న గోపాలం వాళ్ళ వ్యవహారం ఎల్. ఐ. సి. రామారావ్ వాళ్ళకి విరుద్ధంగా ఉందే

"ఈ ఉదాహరణే తను ఎప్పుడూ శ్రీమతికి చెబుతుంటాడు. శ్రీమతి ఈ మాటలు విని ఉండదు..."

"శ్రీమతీ...శ్రీమతీ..."

"ఆఁ వస్తున్నా"

"త్వరగా రావాలి"

"ఏమిటండీ, ఏమైంది" అడిగింది ఆదుర్దాతో శ్రీమతి.

"ముందు కూర్చో" అంటూ శ్రీమతి చెయ్యి పట్టి లాగాడు సుబ్బారావ్. శ్రీమతి మంచం మీద కూలబడ్డది.

"మౌనంగా ఉండి గోపాలంగారి వాటాలోంచి వచ్చే మాటలు విను" అన్నాడు చిన్నగా.

"ఏమేవ్. నా ఖర్చులకి డబ్బు ఇవ్వవే. జీతం అంతా నీకే ఇచ్చాను గదే!"

"ఇస్తే!? ఏమిటి మీ ఖర్చు. అన్నం ఇంట్లోనే తింటున్నారు గదా! టిఫిన్ ఇంట్లోనే గదా! కాఫీలు ఇంట్లోనే! సినిమాలు ఇద్దరం కలిసే వెళతాము. ఇహ మీకు ప్రత్యేక ఖర్చు ఏముంది!?" అన్నది గట్టిగా ఆడగొంతు.

"ఏమేవ్ అన్యాయమే..."

"అరవకండీ గట్టిగా. ఇంకోసారి ఇలా చేసారంటే ఏమీలేదు ఇదిగో 10 పైసలు. తీసికొని పోండి గొడవ చేయక."

"విన్నావా ఆ మాటలు."

"విన్నాను" అంది తలకాయ వంచుకొని.

"అమ్మయ్య నేనిచ్చే ఉదాహరణ ఎక్కడైనా చూపిచ్చమన్నావుగా. చాలా ఇంకా కావాలా?"

"అక్కర్లేదండీ. వాళ్ళ సంగతి, వాళ్ళు మన వాటాలోకి వచ్చినప్పటి నుంచీ తెలుసు."

"అమ్మ దొంగా! నాకే అన్యాయం చేద్దామనుకున్నావా?"

"లేదండీ. ఇన్నాళ్ళూ మగవాళ్ళే అలాంటి వారని అనుకొని మీతో వాదించాను. కాని ఆడవాళ్ళలో కూడా ఘనులు ఉంటారని మీరు చెప్పినా గ్రహించలేక పోయాను. కాని వీళ్ళు మన వాటాలోకి వచ్చిన దగ్గరి నుంచి మీ మాట నమ్మాను. కాని ఆ విషయం మీతో చెప్పాలంటే భయం వేసింది. మొండిగా మీతో వాదించిన నేనే వీళ్ళ విషయాన్ని మీకు చెబితే నన్ను హేళన చేస్తారని చెప్పలేదు" అంది ఏడుపు ముఖంతో సుబ్బారావ్ గుండెల మీదికి వాలుతూ.

"పిచ్చిదానా! అంతమాత్రానికేనా" అన్నాడు శ్రీమతిని దగ్గరకు తీసుకుంటూ సుబ్బారావ్. ●

ఇది విన్నారా?

★ "అంగడి బొమ్మ" చిత్రాన్ని మళయాళంలో డైరెక్టు చేసిన ఐ. వి. శశి తొలుదొల్త పదవీ స్వీకారం చేసిన చిత్రం పేరు "సీమ". కాని ఆ చిత్రం శ్రీకారంతో నిల్చిపోయింది. "అవళోడరావుగల్" (అంగడి బొమ్మ మళయాళం) చిత్రంలో తను పరిచయం చేసిన "శాంతి" అనే డాన్సర్‌కు "సీమ" అని పేరుపెట్టి, ఆ చిత్రాన్ని పూర్తిచేశారు ఐ. వి. శశి. నేడు "సీమ" బిజీస్టార్. "సీమ" చిత్రమైతే ఆగిపోయింది కానీ, "సీమ" పేరుతో పరిశ్రమకు పరిచయమైన ఫీమేల్ ఫేస్ మాత్రం పాప్యులర్ అయింది. ఒక సినిమాకు అచ్చిరాని పేరు ఒక సినీస్టార్‌కు కలిసివచ్చిందంటే, అది రాశిఫలమా లేక రాతఫలమా?

★ హిందీ నటుడు జితేంద్ర కొన్ని సంవత్సరాలుగా ఒక పాత ఇంపాలా కార్నే వాడుతున్నాడట. కారణం ఏమిటని విచారిస్తే "అచ్చొచ్చిన కారు" అంటాడట జితేంద్ర. పెళ్లి శకునం చూడడంకూడా జితేంద్ర సెంటిమెంట్స్‌లో ఒకటట దైవభక్తి కూడా ఎక్కువే జితేంద్రకు.

★ రజనీకాంత్ ఇంతవరకు పర్సనల్ మేకప్‌మాన్‌ను పెట్టుకోలేదట. ఎలాంటి వేషమైనా తానే మేకప్ చేసుకుంటాడట. ఎందుకనడిగితే నేను ఫిలింఛేంబర్ ఇన్‌స్టిట్యూట్‌లో చదివాను అక్కడ మేకప్‌కు సంబంధించిన విషయాలుకూడా నేర్చుకున్నాను అంటాడట. ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో యాక్టింగ్ మాత్రమే నేర్పుతారని అక్కడ చదివిన చాలామంది చెప్తుంటారు. మరి రజనీకాంత్ మేకప్ గూర్చి కూడా నేర్చుకున్నాను అంటున్నాడే. ఇదోరకమైన పబ్లిసిటీ స్టంటా?

★ గాయని యల్. ఆర్. ఈశ్వరి జెమినీలో పాట పాడాల్సివస్తే కూడా ఒక ఫ్లాస్కులో వేన్నీళ్ళు తెచ్చుకుంటుంది. ఎందుకనడిగితే జెమినీ ఏర్‌కండిషన్డ్ థియేటర్ కావడంతో పాట పాడేపుడు గొంతు ఆరిపోతూంటుంది. మధ్య మధ్యలో గొంతును వెచ్చచేయడానికి ఆ వేన్నీళ్ళు అంటుంది. మరి మిగతా సింగర్స్ కూడా ఈ ఆచారాన్ని పాటిస్తారా?

— శ్రీనివాస్

జీవిత  మాధుర్యం

సీరియల్

యర్రగుంట్ల వరలక్ష్మీదేవి

భూషణం రాత్రి ఎనిమిదిగంటలకు ఇంటికి చేరేడు. బజారునుండి బట్టల్ని తీసుకుని వచ్చేడు. విశాలాక్షికి, లావణ్యకు చెరో చీర, వనజకు పరికిణీ, రవిక — సుకుమార్‌కి, గోపీకి చెరో జత రడీమేడ్ దుస్తులు తెచ్చేడు. ఆ బట్టలు వాళ్ళకు ఎంత అవసరమో భూషణంకు తెల్సు. ఇంట్లో గౌరవనీయమైన అతిథి వున్నాడు. చిరుగులులేని దుస్తులు ఎవ్వరికీ లేవని భూషణంకు బాగా తెల్సు. అందుకే ముందు వాటిని కొనితెచ్చేడు.

భూషణం కల నిన్ననే మొదలవలేదు. చాలాకాలంగా ఆ దుస్స్వప్నం అతడ్ని వెంటాడుతునే వుంది. ఇప్పటికీ అతడి కల పూర్తిగా చెరిగిపోలేదు. ఇదంతా కలలోని భాగంగానే భూషణానికి తోస్తూంది. వినోదమూర్తి ఊహ పూర్తిగా స్వరూపాన్ని దాల్చలేదు. అంతా ఛాయామాత్రంగానే స్ఫురణకు వస్తూంది. ఏదీ వాస్తవంగా తోచడంలేదు. అది కాళరాత్రే — విషాన్ని గ్రక్కిన రాత్రే. కాని ఇప్పటికైనా పూర్తిగా తెల్లవారిందంటే భూషణం నమ్మలేకపోతున్నాడు. అందుకే నేటి సంఘటనను అతను తన స్వప్నంలోని అంతర్భాగంగానే పరిగణిస్తున్నాడు. ఏ క్షణాన్నైనా వినోదమూర్తి తన వెయ్యిరూపాయలు అడగవచ్చు. లేకుంటే కిరాణాకొట్టు నర్సయ్య, పాల రంగయ్య తిరిగివచ్చి నిజంగా తమకు డబ్బు అందలేదని మళ్ళీ గొడవచేయడానికి పూనుకోవచ్చు. తామంతా చనిపోలేదని భూషణంకు ఇంకా పూర్తిగా విశ్వాసం కలుగలేదు. అతడి మేధస్సు ఆ పొగమంచును ఇంకా ఛేధించుకుని వెలుగులోనికి రాలేదు. నిజాన్ని పూర్తిగా గ్రహించడానికి మరికొంతకాలం పడ్తుంది. ఇప్పటికి అతనికి జీవితమార్గం నిర్దిష్టంగా గోచరించడంలేదు. అతను ఆ ప్రయత్నం చేయడంలేదు. ఇంతకుముందు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యేయి గనుక ఇప్పుడు ఏది సఫలమవుతుందో భూషణంకు తెలియదు. తెల్సుకునేందుకు యత్నంచేసే స్థితిలో అతడు లేడు.

ఆ బట్టల్ని క్రిందభాగంలోని తన గదిలో మంచంమీద పెట్టి భార్యను పిలిచేడు. విశాలాక్షి వచ్చి అవన్నీ చూసి విభ్రాంతపోయింది.

"ఏమండీ! ఇప్పుడెందుకండి ఇవన్నీ తెచ్చేరు?"

"మనం మళ్ళీ బ్రతికినందుకు. నువ్వా చిరుగుల చీర విప్పి ఈ కొత్త చీర కట్టుకో, ఇంట్లో అతిథి వున్నాడు. అతడేమైనా అనుకుంటాడు. మన బట్టలే మన హీన స్థితిని చాటుతున్నాయి. మన పరిస్థితి ఎలా వున్నా

(గత సంచిక తరువాయి)

ఆ అబ్బాయికి మన నిర్భాగ్యం అంతా తెల్సిపోవడం కన్నా తల దించుకునే విషయం మరోటుందా! అందుకే అందరికి మారుబట్టల్ని తెచ్చేను. రేపటి నుండి వనజను, గోపీని స్కూలుకు పంపిస్తాను. వాళ్ళకు పుస్తకాలు తెచ్చేను," అని భూషణం చెప్పుకుపోతుంటే విశాలాక్షి ఏదో సంశయంతో అతడివైపు చూసింది.

"ఏమండి — మీరు తొందరపడుతున్నట్టుంది. మరికొన్నాళ్ళు మనం వేచిచూడడం మంచిదేమో. ఇంకా రెక్కలు బాగా విచ్చుకోకపూర్వమే ఎగరడానికి ప్రయత్నిస్తే క్రింద పడి మళ్ళీ దెబ్బలు తగిలించుకుంటామేమో ఆలోచించారా? నాకింకా భయం పూర్తిగా పోలేదండి!" భార్య విశాలాక్షి మాటల్లోని భీతి భూషణంకు కాస్త తెలియవచ్చింది. అవును తను తొందరపడుతున్నాడేమో! అనిపించిందాయనకు.

ఆ పరిస్థితులలో స్త్రీ అందునా ఇంటి ఇల్లాలు ఆలోచించగలిగినంతగా పురుషుడు ఆలోచించలేడు. విశాలాక్షి పెద్దగ చదువుకోకపోయినా, చాలా తెలివైంది. సహజంగా వచ్చిన నిశిత విమర్శనాజ్ఞానం, ఆలోచనాదృష్టి, విషయ అవగాహన ఆమె ఆభరణాలు. విశాలాక్షి గౌరవనీయమైన ఇల్లాలు. ఆలోచనారహితంగా ఏ పని చేయదు. ఆమెకు తనపైనకన్నా భర్తమీద, పిల్లలమీద మమకారం యెక్కువ. అందుచేత భర్తను సేవించడంలోను, పిల్లలను పెంచడంలోను ఎంతో మమతను రంగరించి, ఆరోగ్యకరమైన విధానంలో నడుపుకునివస్తూంది.

ఆమెకు తెల్సు ఈనాటి కటికదరిద్రానికి, దుర్భర స్థితికి హేతువు భర్త తెలివితక్కువతనం కాదని విధి వక్రించడంవల్లను, దేవతలు సరిగా అనుగ్రహించకపోవడంవల్లను, తోటి మానవులు మానవులుగా ప్రవర్తించకపోవడంవల్ల ఏర్పడిన దుస్థితి అని. ఆ అతీతశక్తులను ఎదుర్కొనలేక భర్తతోపాటు తనూ విధికి తల వంచి అట్లాంటి హేయమైన నిర్ణయం తీసుకోనవలసిన పరిస్థితి ఏర్పడింది. గత రాత్రి నిజంగా కాళరాత్రే.

జరిగిన కథ - 2: బ్రతికి చెడ్డ భూషణం కుటుంబం చేసుకోబోయిన ఆత్మహత్యా ప్రయత్నం వినోదమూర్తి రాకవల్ల విఫలమవుతుంది. వాళ్లను ఆదుకొనటానికి తోటను కౌలుకు తీసుకొని కొన్నాళ్ళు అక్కడే వుండాలనుకుంటాడు వినోదమూర్తి.

అట్లాంటి రాత్రిని ఊపిరితీస్తూనే గడిపి ఉషోదయాన్ని చూడగలిగిన తామంతా యెంత అదృష్టవంతులో ఆమెకు తెల్సినంతగా ఇంకెవ్వరికీ తెలియదు.

ఆ కారణంచేత వినోదమూర్తి ఆమె మనస్సులో అయిదవ బిడ్డగా స్థానం పొంది, ఆమె పరిపూర్ణ వాత్సల్యాన్ని సంపాదించగల్గేడు. ఆమె మాతృప్రేమ అనంతమైనది. అందులో స్వార్థానికి, సంకుచిత భావాలకూ స్థానంలేదు. అందరు సంతోషంగావుంటే ఆమె సంతోషంగా వుండగలదు. పురుషుడు పరిస్థితులకు యెంతగా భయపడ్తాడో ఆమెకు బాగా తెల్సు. తొందరపాటు ఆమెకు లేదు. ఎవ్వరికి యింకా కల్గని విశ్వాసం వినోదమూర్తియందు ఆమెకు కల్గింది. అందుకే తమ బాట ఇకముందైనా సాఫీగా ఉండాలంటే వినోదమూర్తితో బాటు తమ కృషి, అచంచలదీక్ష యెంతో అవసరమని ఆమె గ్రహించింది. అందుకే ఆమె భర్తను హెచ్చరించింది.

ఇంతలో వనజ, గోపీ ఆ గదిలోకి వచ్చి ఆ బట్టల్ని ఆ పుస్తకాల్ని చూసి ఎంతో సంబరపడిపోయేరు. ఆ వయస్సులో వాళ్ళకు బ్రతుకు భయం లేదు. మరణభీతి లేదు. అమాయకులు వాళ్ళు. వాళ్ళకు తెల్సిందల్లా ఒక్కటే. ఆకలివేస్తే తినడం, ఉత్సాహం కల్గితే ఆడుకోడం, అందరి పిల్లలకుమల్లే చదువుకోడం, ఒంటినిండా బట్టలు వేసుకోడం, నలుగురు పిల్లలమధ్యన గౌరవంగా తిరగగల్గడం. సవ్యంగా జీవితం గడపడానికి 'డబ్బు' అన్న పదార్థం యెంత అవసరమో ఒకరు చెప్పినా బోధపరచుకోలేని వయస్సు వారిది. చక్కని అందమైన వయస్సు వారిది. వాళ్ళకు ఒక్కటే తెల్సు వాళ్ళు హాయిగా ఉండాలంటే, దేవతలాంటి తల్లి, దేముడులాంటి తండ్రి వాళ్ళతో వుండాలి. ఆ తల్లిదండ్రులు తమపై అనవరతము వాత్సల్యం కురిపించాలి. ఆ ప్రేమలోనే, ఆ అనురాగంలోనే ఆ పిల్లలు పెరగగలరు. అందుకే వనజ, గోపీ ఉల్లాసంగా వున్నారు. వాళ్ళు ఆ బట్టల్ని తీసుకుని ముచ్చటపడిపోయేరు. ముఖ్యంగా ఆ పుస్తకాలు వాళ్ళ కళ్ళను వెలిగించేయి. వారి కళ్ళలోని ఆ ఆనందాన్ని చూడగానే ఆ తల్లిదండ్రుల కళ్ళు చెమర్చేయి.

4

భూషణం పూర్తి పేరు విడమర్తి రాజభూషణం. అతడి తండ్రి రామరాజుగారు ఆనాటి వర్తకులకు రాజుగా వుండేవాడు. లక్షలమీద వ్యాపారం చేసేవాడు. రెండు బియ్యం మిల్లులుండేవి. ఒక సినీమాహాలుండేది. పప్పుదినుసులు,

ధాన్యం వ్యాపారం టోకుగా చేస్తుండేవాడు. అతని కాలంలో ఆ భవనం 'ఆనందనిలయం', చుట్టూ వున్న తోట సకలసంపదలతో కనులకు విందుగా ఉండేవి రామరాజుగారు దానధర్మాలు ఒక చేతికి తెలియకుండా మరో చేత్తో చేసి, ఒక్కొక్కప్పుడు రెండు చేతులతోను చేసి కీర్తికాంతను వరించేరు. రామరాజుగారు ధర్మరాజుగా పేరుగాంచేరు వర్తక సంఘం వారు అతనికి 'వాణిజ్య శిరోమణి' అన్న బిరుదును ప్రసాదించేరు.

రామరాజుగారు చనిపోయేసరికి ఆ గద్దె ఎక్కిన రాజభూషణంకు ఇరవై వసంతాలు గడిచేయి. అంతవరకు బాధ్యతారహితంగా జల్సాగా గడపిన రాజభూషణంకు బాధ్యతలన్నీ నెత్తిన పడేసరికి ఏం చెయ్యాలో తోచలేదు. ఆ ముందటి సంవత్సరమే తనకన్న నాలుగేళ్ళు చిన్నదైన విశాలాక్షితో ఘనంగా వివాహమైంది. ఆమె కాపురంకు వచ్చింది తమ్ముడు చక్రవర్తికి పదిహేడేళ్ళు. రాజభూషణంలానే స్కూలుఫైనల్ పాసయి మరి చదువుమీద ఆసక్తి లేక మానుకున్నాడు. ఉన్న కాస్త భూమిని తండ్రి రామరాజు ఒక్కగానొక్క కూతురు పసుపు కుంకుమలకు రాసిచ్చేసేడు ఆ కూతురు అయిదేళ్ళు కాపురం చేసి ఆయుష్షుచెల్లి వెళ్ళిపోయింది.

రామరాజుగారి కాలంలో వ్యాపారం దిగ్విజయంగా సాగిపోయింది. ఎంత ఆస్తి, ఎంత డబ్బు పరువుప్రతిష్ఠలమీద తిరుగుతున్నదో అతనికే తెలియనంత పెద్ద వ్యాపారమైపోయింది. కావాలంటే లక్షరూపాయలు గంటలమీద బజారులో అప్పుపుట్టేవి. అతని పరపతి అట్లాంటిది. రాజభూషణం గద్దె ఎక్కేసరికి అతనికి కనుపించిన ఆస్తి — ఆ భవనం, తోట, రెండు రైసుమిల్లులు, ఒక సినిమాహాలు, భారీగా సాగే వ్యాపారం. తండ్రి దినవారాలకు ఎంత డబ్బు ఖర్చయిందో తనకే తెలియదు. పెద్దగుమస్తా సన్యాసయ్యే అంతా చూసుకునేవాడు, తన తల్లితో అప్పుడప్పుడు సంప్రదిస్తూ.

వచ్చిన ఆహూతులంతా ఓహో అంటే ఓహో అని తెగ ప్రస్తుతించి, తెగ ఖర్చుచేయించి వెళ్ళిపోయేరు. ఒచ్చిన బంధువర్గం సుమారుగా ఎనభై మందివరకు పిల్లా పాపా కలసి వున్నారు. రాజభూషణాన్ని, చక్రవర్తిని ఓదారుస్తూ ఓ నెల్లాళ్ళుండి మరీ వెళ్ళేరు. తల్లి, పాపం తన భర్త తిన్నగా స్వర్గానికే పోవాలన్న కాంక్షతో దానధర్మాలు విరివిగా చేయించి, బ్రాహ్మణుల సంతృప్తి మేరకు డబ్బు ముట్టచెప్పించి, బంధువులకు, కుటుంబ స్నేహితుల పొట్టలు బ్రద్దలయేంతవరకు భోజనాలను పెట్టించింది. పెద్దగుమస్తా సన్యాసయ్య ధర్మమా అని డబ్బు సరఫరాలోను, వస్తుసామగ్రి అందజేయడంలోను ఎట్టి ఇబ్బంది కలుగలేదు.

బంధువులంతా కన్నీరుకారుస్తూనే వెళ్ళలేక వెళ్ళింతరువాత, ఇంట్లో మిగిలినవాళ్ళ పరిస్థితి కళ్ళనీళ్ళపర్యంతమయింది. లెక్కలన్నీ చూసుకున్నాక డబ్బు మంచినీళ్ళప్రాయంగా ఖర్చు అయిందని, సుమారుగా డెబ్బై వేల వరకు ఆహుతి అయిందని తేలింది. గిట్టనివాళ్ళు పెద్దగుమస్తా ఇరవై వేల వరకు తన తంటాలు ఏవో తను పడ్డాడని అన్నారు. కాని అందులోని నిజానిజాలు ఆ పరంధాముడికి, పెద్దగుమస్తా సన్యాసయ్యకు మాత్రమే తెలియాలి.

ఏమయితేనేం తండ్రిని స్వర్గానికి ఏ అవాంతరము లేకుండా పంపించేసి రాజభూషణం వ్యాపారంలోకి దిగాడు. వ్యాపారంలోని కిటుకులన్నీ మెల్లమెల్లగా నేర్చుకోడం మొదలెట్టేడు. ఓ అయిదేండ్లు గడిచేసరికి వ్యాపారంలోని మెలకువలన్నీ తెల్సుకున్నాడు — కాని ఆసరికే కొంత మోసం జరిగిపోయింది. పెద్ద యజమాని రామరాజుతోపాటు వున్న భయభక్తులు, వివిధ సంస్థలలో మేనేజర్లుగా వ్యవహరిస్తున్న వ్యక్తులకు పోయేయి. ఎవరికి చిక్కిన మోసం వాళ్ళు చేయనారంభించేరు. సినీమాహాలు కలక్షన్సు పడిపోయేయన్నారు. రైసుమిల్లుల ఆదాయం బాగులేదన్నారు. మిల్లుల్లోని యంత్రాల మరమ్మత్తుల ఖర్చు లెక్కువయ్యేయన్నారు. ఆ పెద్ద టోకువ్యాపారంలో ఆదాయంకన్నా అరువులు ఎక్కువకాజొచ్చేయి.

రాజభూషణానికి పాతిక సంవత్సరాల వయస్సు వచ్చింతరువాత వ్యాపారదక్షత కల్గింది. మోసంచేసిన మేనేజర్లను తొలగించేడు. కొత్తవాళ్ళను కొంతమందిని, పాతవాళ్ళలో తనకు నమ్మకస్తులైన కొందరి ఉద్యోగులను ఆయా స్థానాలలో నియమించేడు. వ్యవహారాలన్నిటినీ ఒక కొలిక్కి తేవడానికి ప్రయత్నించేడు.

కాని అదే సమయంలో పరిస్థితులు ఇంకోవిధంగా మారజొచ్చేయి. రాజభూషణం తమ్ముడు చక్రవర్తి చక్రవర్తిలా ప్రవర్తించ నారంభించేడు. చక్రవర్తి ఇరవై రెండేళ్ళ వయస్సు వాడయ్యేడు. తల్లి ఆరోగ్యం క్షీణించింది. తను బ్రతికుండగా చిన్నకొడుకు వివాహం చూడాలన్న కోరికను వెలిబుచ్చింది. రాజమండ్రిలో ఓ పెద్దింటి సంబంధాన్ని చూసి పెండ్లి చేసేడు రాజభూషణం. ఆ మామగారు మహాయోధుడు. శకునికి తెల్సినన్ని కుటిలోపాయాలు అతడికి తెల్సు. తల్లి ప్రార్థనను రాజభూషణం వెంటనే మన్నించడానికి కారణముంది. చక్రవర్తి ఆసరికే చాలా వక్రమార్గాలను తెల్సుకున్నాడు. అతడికి అన్ని చెడు అలవాట్లను మప్పింది, ఆ సినీమాహాలు మేనేజరు రామలింగయ్యే.

[28వ పేజీ చూడండి]





'ఇంటింటి రామాయణం'లో రంగనాథ్, ప్రభ

అక్కినేనికి అభిమానుల సూచన

జనాభిప్రాయం సేకరించి... దానిని పరిశ్రమ పెద్దలకు తెలపవలసిన బాధ్యత పత్రికేయులకు వుంది.

సహేతుకమైన విమర్శలను, స్పోర్టివ్‌గా స్వీకరించే సద్గుణం శ్రీ అక్కినేనికి వుంది.

ఇటీవల ఆయన చిత్రాల పట్ల ప్రేక్షకులకు అసంతృప్తి కలగడానికి కారణం... అక్కినేనిగారి చిత్రంపై ఎన్నెన్నో ఆశలను... వూహలను పెంచుకోవడమే.

ఇకపై ఆయన ''స్టెప్స్'' వెయ్యడం మానేసి... ప్రేక్షకులు కలకాలం గుర్తుంచుకునే ముత్యాల్లాంటి పాత్రలను పోషించాలి.

ఫలానా పాత్రను అక్కినేనిగారు మాత్రమే పోషించగలరు అన్నది మళ్ళీ రావాలంటే... పాత్రల ఎంపికలో ఆయన జాగర్త వహించాలి.



'రామూ గెలుపు నీదే'లో రజనీకాంత్

అన్ని పాత్రలు వేసిన నటుడికి... వెరైటీ ఎక్కడ లభిస్తుంది అని ఎవరయినా ప్రశ్నిస్తే... అది సరి అని యీ కలం అంగీకరించదు.

ఇప్పుడు నాగేశ్వరరావుగారు చెయ్యాల్సిన పాత్రలు ఎన్నో వున్నాయి. ఆయన మాత్రమే చెయ్యగల పాత్రలు మరెన్నో వున్నాయి.

''ట్రాజెడీ కింగ్ ఆఫ్ ఇండియా'' అని బిరుదు వహించిన శ్రీ అక్కినేని మళ్ళీ అలాంటి పాత్రల పోషణకు పూనుకోవాలి.

శ్రీ అక్కినేని చెయ్యదగినవి... ఆయన మాత్రమే పోషించదగినవి కొన్ని సూచించనా? ''శ్రీ 420'' ... అవారా ... సంగమ్ ... మధుమతి ...త్యాగయ్య... వేమన...అన్నమాచారి... భాగ్యనగర్...రోమన్ హాలీడే...కమ్ సెప్టెంబర్... టు సర్ విత్ లవ్ ... అగ్నిపరీక్ష ... ది గైడ్... త్రిష్నా వంటి చిత్రాలు.

శ్రీ అక్కినేని సంవత్సరానికి అయిదు చిత్రాలు చేస్తే చాలు. ఆయనకు మాణిక్యాల్లాంటి నిర్మాతలు వున్నారు.

జగపతి శ్రీ రాజేంద్రప్రసాద్ ప్రసాద్ ఆర్ట్స్ పిక్చర్స్ శ్రీ ఏ. వి. సుబ్బారావు సురేష్ శ్రీ డి. రామానాయుడు లక్ష్మీ ఫిలింస్ కంబైన్స్ శ్రీమతి అనురాధాదేవి చిత్రకల్పన శ్రీ బాపు ... శ్రీ రమణ. అన్నపూర్ణా పిక్చర్స్ శ్రీ డి. మధుసూదనరావు పద్మశ్రీ పిక్చర్స్ శ్రీ పి. పుల్లయ్య. నేను పేర్కొన్న సంస్థలు ... వ్యక్తులు శ్రీ నాగేశ్వరరావు కీర్తికి ఎంతో దోహదం చేసినవారే.

అక్కినేనిగా రాజేష్ అగ్రనటిగా హేమ

తెలుగులో అనూహ్య విజయాన్ని సాధించిన సురేష్ ప్రొడక్షన్స్ వారి ''చిలిపికృష్ణుడు'' చిత్రానికి, యిప్పుడు హిందీ యోగం పట్టింది.

శ్రీ రామానాయుడు ఏప్రిల్ నుంచి ప్రారంభించనున్న హిందీ చిత్రానికి శ్రీ బాపయ్యను దర్శకుడుగా ఎంపికచేశారు.

శ్రీ అక్కినేని పోషించిన పాత్రను రాజేష్‌ఖన్నా అగ్రనటి నిర్వహించిన భూమికను హేమమాలినీ ధరించగలరని, సురేష్ అధినేత తెలిపారు.

ఉపకారం చెయ్యడం తన జీవితాశయంగా పెట్టుకున్న మంచి మనిషి గా బట్టే శ్రీ రామానాయుడు విజయంపై విజయాన్ని సాధించడం జరుగుతూంది.

బిజీగాలేనివాళ్ళను మళ్ళీ యాక్టివ్ చెయ్యగల మహాత్మ్యం శ్రీ నాయుడుకు వుందని ఎన్నోసార్లు ఋజువైంది.


ముగ్గురికి సరితూగే పాత్రలతో రామానాయుడు కొత్త చిత్రం

సురేష్ ప్రొడక్షన్స్ జనవరి 21న ప్రారంభించే భారీ వర్ణ చిత్రానికి ముగ్గురు కథానాయకులు ... ముగ్గురు నాయికలు.

కృష్ణ ... శోభన్ ... చంద్రమోహన్ జయప్రద ... జయసుధ ... శ్రీదేవిగార్లు నటించే చిత్రానికి జంధ్యాల రచనను, మహదేవన్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు.

ఈ భారీ రంగుల చిత్రానికి శ్రీ బాపయ్య దర్శకుడు. ఏప్రిల్‌లో ఈ చిత్రం పూర్తి అవుతుంది.

ప్రజలు మేలుచేస్తే ... ఇదే కథను, హిందీలో కూడా సురేష్ అధినేత నిర్మిస్తారు.



పండుగ తరువాత రెండు చిత్రాలు

అభ్యుదయభావాలు గల్గిన యువదర్శకులలో శ్రీ కె. ఎస్. రామిరెడ్డి ఒకరు. ఆయన దర్శకత్వం వహించిన తొలి చిత్రము [illegible] విజయాన్ని సాధించింది. తరువాత రెండు చిత్రాలు [illegible] ఆయనేమిటో తెలిపింది. [illegible] "కాలాలు గడిచింది" చిత్రాన్ని అందరూ మెచ్చుకున్నా... [illegible]

[illegible] ... బి. ఎస్. రెడ్డి, ఆదుర్తి వంటి దిగ్గజ వ్యక్తుల వద్ద శిక్షణ పొందిన శ్రీ రామిరెడ్డి ... కొత్త సంవత్సరంలో విజయాలను అనుభవించగలరని [illegible] కలుగుతుంది.

పండుగ అంటే సంక్రాంతి అనుకునేరు. ఢిల్లీలో జరిగే [illegible] చిత్రాల పండుగలో శ్రీ రామిరెడ్డి పాల్గొని వచ్చిన తరువాత రెండు చిత్రాలను ప్రారంభించడానికి నిర్ణయించారు.

జనప్రియ ఫిలింస్ !

శ్రీ కె. ఎస్. రామిరెడ్డి చిత్రీకరణలో ప్రారంభంకానున్న రెండు చిత్రాలను నిర్మించే సంస్థ పేరు యిది. జనప్రీతిని పొందే రెండు కథలను ఆయన కొన్నారు. ఒక కథను బీనాదేవి... రా. వి. శాస్త్రి, మరో కథను మాదిరెడ్డి సులోచన వ్రాశారు.



'శివ కేశవులు'లో చంద్రమోహన్, ప్రభ

అగ్నిపరీక్ష ఎప్పుడు ?

బహుళ ప్రచారాన్ని పొందిన మాదిరెడ్డి సులోచనగారి "అగ్నిపరీక్ష" నవలను శ్రీ రామిరెడ్డి, శ్రీనివాస్ కలిసి నిర్మించాలని నిర్ణయించిన విజం పాఠకులకు తెలుసు.

మూడు వారాల క్రితం "అగ్నిపరీక్ష" నవలకు సరితూగే నాయకుడు ఎవరని, ప్రేక్షకుల అభిప్రాయాన్ని నెంబర్ వన్, డేనియల్ వీధికి తెలుపమన్న విషయం పాఠకులకు తెలుసు.

ప్రేక్షకుల తీర్పు

అధిక సంఖ్యలో ఉత్తరాలు వచ్చాయి. "అగ్నిపరీక్ష" నవలకు శ్రీ కృష్ణంరాజును సూచిస్తూ వచ్చిన లేఖలను, శ్రీ రామిరెడ్డి చూపించారు.

మహిళల ఓటు కృష్ణంరాజుగారికే వచ్చాయి. నవలలో వున్న రెండు స్త్రీ పాత్రలకు శ్రీదేవి ... శారదగార్ల పేర్లు సూచింపబడ్డాయి. ప్రేక్షకుల తీర్పుకు దర్శకుడు శ్రీ రామిరెడ్డి గ్రీన్ సిగ్నల్ యిచ్చారు.

తెలుగు అమితాబ్

"అగ్నిపరీక్ష" నవలకు శ్రీ కృష్ణంరాజు పూర్తి న్యాయం చెయ్యగలరన్న ప్రేక్షకుల అభిప్రాయాన్ని, ఆయన నెరవేర్చగల సమర్థుడు గనుక... జనప్రియ ఫిలింస్ తలపెట్టే తొలి నవలా చిత్రానికి జనామోదం లభించడం తథ్యమే, మరి.

హిందీలో అమితాబ్ నవరస పోషణలో అద్వితీయుడు అని ప్రశంసలు పొందుతున్నట్టే... తెలుగులో కృష్ణంరాజుగారు "అగ్నిపరీక్ష" నాయక విజయంతో తెలుగు అమితాబ్ అనిపించుకోవడం నిశ్చయంగా సంభవిస్తుంది.

"కన్నప్ప ... రుద్రయ్య ... మన వూరి పాండవులు" చిత్రాలలో శ్రీ కృష్ణంరాజు ప్రదర్శించిన నటన "ఏవన్" అని ప్రజలు అన్నారు. "అగ్నిపరీక్ష" నవలకు ఆయన నాయకుడు గావడం... మరో కిరీటం లభించినట్టే అవుతుంది.

బంధిత

ఈ మకుటాన్ని వింటుంటే... శరత్ సృష్టివలె అనిపిస్తుంది కదూ! జరిగిన నిజం ఏమిటంటే!

"విజయ" మాస పత్రికలో శ్రీధర [illegible] "ఛాయ" (నవలానుబంధం)ను ఆధారంగా తీసుకుని, కొన్ని సృజనాత్మకమైన మార్పులతో సరికొత్త కథను రూపొందించారు, రచయిత, ఎస్. ఆర్. వేజళ్ళ.

వి. కె. ఫిలింస్ అనేది చిత్ర నిర్మాణ సంస్థ. అభ్యుదయ భావుకత వున్న హనుమాన్‌ప్రసాద్‌గారిని దర్శకుడుగా ఎంపిక చేసి, ఆయన సూచన ప్రకారంగా చిత్రానికి "బంధిత" అని పేరిడినట్టు, నిర్మాత శ్రీ వి. వి. అప్పారావు మాటగా నిర్మాణత శ్రీ వేజళ్ళ తెలిపారు.

సంక్రాంతి పర్వదినాన ఖమ్మంలో "బంధిత" చిత్ర నిర్మాణం ప్రారంభమై... ఫిబ్రవరి 10కి పూర్తిచేసే వుద్దేశ్యం నిర్మాతకు వున్నట్టు తెలిసింది.

సాంస్కృతిక విప్లవాన్ని, సమాజ విప్లవాన్ని కోరే నవనాగరిక ప్రేక్షకులకు "బంధిత" చిత్రం తప్పక నచ్చుతుందని అని ఆశా కలుగుతుంది.

ఈ చిత్రానికి సత్యం సంగీతాన్ని, [illegible] రచనను, లక్ష్మణగోరే ఛాయాగ్రహణాన్ని నిర్వహిస్తున్నారు.

ప్రధాన పాత్రలను సత్యేంద్రకుమార్, నూతన్‌ప్రసాద్, పి. ఎల్. నారాయణ, రూపు పోషిస్తున్నారు.

నోరు లేని అమ్మాయి అంటే మూగపిల్ల పాత్రకు ఓ కొత్తమ్మాయిని, విలన్ పాత్రకు ఓ కొత్త కళాకారుడ్ని ఎంపిక చేస్తారట, నిర్మాత.

— శ్రీనివాస్



'ఇద్దరూ అసాధ్యులే'లో ఒక దృశ్యం



'అంతులేని వింత కథ'లో సత్యనారాయణ, కృష్ణమూర్తి

జి. ఏ. జి. పేజీ

దేవుడే దుర్మార్గుడా ?

పీస్ ఏంజిల్స్‌వారు పై పేరున నిర్మించే చిత్రానికి జనవరి 5 న జెమినీలో సి. నారాయణరెడ్డి గీతం, చక్రవర్తి సంగీతం, బాబూ బెనర్జీ గానంతో ప్రారంభోత్సవం జరిగింది. పలు చిత్రాలలో పాత్రధారిగా, అసోసియేట్ డైరెక్టర్‌గా అనుభవం గడించిన ప్రేమ్‌కుమార్ బి. ఎస్. సి., తొలిసారిగా దర్శకత్వం నెఱపే చిత్రమిది. తను నేడింత వాడవడానికి కారకులైన వారందరికీ ఆనాడు కృతజ్ఞతలర్పించి, వారి ఆశీస్సులు అందుకున్నారు: "నా జన్మప్రదాతలు పి. డి. ఇస్రాయిల్ దంపతులు. నా చిత్ర జీవితానికి చేయూత నిచ్చినవారు డాక్టర్ సి. నారాయణరెడ్డి. తొలి జీ(వి)త మిచ్చినవారు కీ॥ శే॥ మిద్దె జగన్నాథరావు. దర్శకత్వం తొలి పాఠాలు నేర్పినవారు శ్రీ కె. విశ్వనాథ్. కష్టసుఖాలలో ఆదుకున్నవారు శ్రీ క్రాంతికుమార్. శ్రేయోభిలాషులు, గురుతుల్యులు శ్రీ కె. రాఘవేంద్రరావు. నన్ను నటునిగా రూపుదిద్దినవారు యు. విశ్వేశ్వరరావుగారు," అన్నారు ప్రేమ్‌కుమార్. ఈ చిత్రంలో మురళీమోహన్, సత్యనారాయణ, గిరిబాబు, నాగభూషణం, అల్లురామలింగయ్య, గోకిన రామారావు, బాబూబెనర్జీ, రామ్మోహన్, కె. వి. చలం, ప్రసన్నరాణి, జయమాలిని, నాగేష్ వగైరా నటవర్గం. ఛాయ : రామారావు. కూర్పు : సీనుకుమార్.

"కుక్కకాటుకు చెప్పుదెబ్బ" టైటిల్ గురించి

రాజలక్ష్మి ఎడిటింగ్ రూమ్‌లో మూవియోలా ముందు కూర్చొనున్న డైరెక్టర్ ఈరంకి శర్మను గోపీకృష్ణా ఇంటర్నేషనల్ వారి తాజా చిత్రానికి పై పేరు ఎందుకు ఎన్నుకున్నారని అడిగాను. "ఇదొక సరికొత్త సబ్జెక్టు," అంటూ కొన్ని సన్నివేశాలు వివరించాక "ఇంతకుమించిన అనువైన

మకుటమేదీ ఈ చిత్రానికి అతకదు ... అన్నట్లు—ఆత్రేయ రాసిన ఓ పాటను ఈమధ్య పిక్చరైజ్ చేశాం. చూస్తారా ?" అంటూ మూవియోలా మీటను కాలితో నొక్కారు.

"కన్నువంటిది ఆడది. కన్నీరామెకు తప్పనిది.
తనువున ఎక్కడ దెబ్బతగిలినా — కన్నే ఏడ్చేది.
మనలో ఎవ్వరు తప్పుచేసినా —
స్త్రీకే శిక్షపడేది ॥కన్ను॥
తప్పటడుగులు మాన్పించీ —
తప్పూ ఒప్పులు నేర్పించారు
తల్లిచాటూ, తలుపుచాటూ దాటకుండా పెంచారు
కనురెప్పలుగా కాపాడారు.
కంటిని ముల్లు కాటేస్తే,
ఆ ముల్లుకె కంటిని అర్పిస్తారా ?
ఇదేమి న్యాయం ? ఇదేమి న్యాయం ? ॥కన్ను॥
సీతా అహల్యలున్నారూ ఈ కలికాలంలోనూ
తాము చేయని నేరములకు శిక్షలింకా పడుతున్నారు
రాముడె లేడీ అహల్యకు — భూదేవేదీ సీతమ్మకు ?
కన్నతల్లి వున్నా మరలా —
కడుపులోకి వెళ్ళేదెలా ? ॥కన్ను॥

చేగొండి హరిబాబు సమర్పించే ఈ చిత్రాన్ని లోగడ "కృష్ణవేణి, చిలకమ్మ చెప్పింది" చిత్రాలను నిర్మించిన చలసాని గోపి నవరసభరితంగా నిర్మించారు. నారాయణరావు, చిరంజీవి, లక్ష్మీకాంత్, వంకాయల, హేమసుందర్, పి. ఎల్. నారాయణరావు, రాళ్ళపల్లి, మాధవి, పల్లవి, మల్లాది విజయలక్ష్మి, జానకి పాల్గొన్నారు. సి. ఎస్. రావు సంభాషణలకర్త. విశ్వనాథన్ సంగీత దర్శకుడు.

భూమి గుండ్రంగా ఉంది

ఇటాలియన్ తార సోఫియాలోరెన్ విమానంలో తారసపడి ఉండకపోతే నటి ఫర్యాల్ 'గగనసఖి' (ఏర్ హోస్టెస్) గానే ఉండిపోయేదేమో ! ఫర్యాల్ వంకే కొన్ని క్షణాలపాటు రెప్పలార్పకుండా చూస్తూండిపోయిన సోఫియా "నువ్వు చక్కని హీరోయిన్‌వి అవుతావు. సినిమాలలో ఎందుకు ప్రయత్నించకూడదు ?" అని సలహా ఇచ్చింది. వెంటనే ఉద్యోగానికి తిలోదకాలిచ్చేసి ప్రయత్నించింది ఫర్యాల్. కాని, ఫలితం... నడుము, తొడలు ఊపుతూ నాట్యం చేసే పాత్రలే రాసాగాయి. చివరికి విసుగెత్తి మళ్ళీ పాత ఉద్యోగానికే తిరిగి వెళ్ళింది. ఇప్పుడొక విదేశీ విమాన సంస్థలో గగనసఖిగా పని చేస్తూందామె.

'ఏడడుగుల అనుబంధం'లో జయసుధ, నారాయణరావు




బ్రూ-కమ్మని రుచికి, సువాసనకి మొదటి రకము

దక్షిణ భారత దేశంలోని కాఫీ అభిమానులను అడగండి. మీ పొరుగు వారిని అడగండి.



సుశీలా రవీంద్రనాద్, ఇల్లాలు. మా కుటుంబం బ్రూ కు అలవాటుపడింది. అందుకే గాక నా బడ్జెట్ కు కూడా సహకరిస్తుంది.



విజయ కుమార్ రావు, క్రికెట్ ఆటగాడు. గ్రౌండు కాఫీ సువాసనను మరేదీ ఎదిరించ లేదు, అందుకే బ్రూను కోరుకుంటాను.



శ్రీ మరియు శ్రీమతి హరిశంకర్, నూతన దంపతులు. మేము ఇష్టపడేది సారమైన కాఫీ అయితేనే — బ్రూ అనుకూలమైనది కూడా.



శ్రీ. కృష్ణమూర్తి, ప్రిన్సిపాల్. దబరాలో పొగలుకక్కే రుచికరమైన, సారవంతమైన కాఫీనే ఇష్టపడతాను.



బ్రూ—దాని వెల ఎంతో ఆకర్షణీయమైనది
ఏ కాఫీ అభిమానిని అయినా అడగండి

OBM-5708A/1 TEL



'కుక్కకాటుకి చెప్పు దెబ్బ'లో మాధవి

చిత్రం గురించి ప్రభుత్వం చే అభిప్రాయాల సేకరణ

రాజ్‌కపూర్ చిత్రం "సత్యం శివం సుందరం" గురించి కేంద్ర సెన్సార్ బోర్డు ఇటీవల మద్రాసు, కలకత్తా, బొంబాయి థియేటర్ల వద్ద ప్రేక్షకులకు ప్రశ్నావళి గల పోస్టు కార్డులను అందజేసి, వివిధాభిప్రాయాలను సేకరించింది. బొంబాయిలో 50 శాతం, కలకత్తాలో 53 శాతం, మద్రాసులో 28 శాతం ఆ చిత్రానికి 'ఏ' సర్టిఫికేట్ ఇవ్వడం సబబుగా వుందని పేర్కొన్నారు. బొంబాయిలో 11 శాతం, కలకత్తాలో 13 శాతం, మద్రాసులో 12 శాతం 'ఏ' సర్టిఫికేట్ యిచ్చినా కొన్ని మోతాదు మించిన దృశ్యాలు తొలగించివుంటే బాగుండేదని తెలియజేశారు. బొంబాయిలో 8 శాతం, కలకత్తాలో 9 శాతం, మద్రాసులో 17 శాతం కొన్ని కత్తిరింపులతో 'యు' సర్టిఫికేట్ యిచ్చినా ఫరవాలేదని అభిప్రాయపడ్డారు. బొంబాయిలో 8 శాతం, కలకత్తాలో 16 శాతం, మద్రాసులో 12 శాతం అసలు ఈ చిత్రానికి సర్టిఫికేట్ నిరాకరించి వుండవలసిందని సూచించారు.

"సినిమా గోల" దర్శకునికి మరో రెండు చిత్రాలు

"గుడ్ న్యూస్, సార్! నేను దర్శకత్వం వహించిన 'సినిమాగోల' విడుదలకు ముందే రెండు కొత్త చిత్రాలు వచ్చాయి," అన్నారు సి. గంగాధర్. సూర్యం రాజేశ్వరీ ప్రొడక్షన్స్ పతాకంలో వడ్లమూడి సీతారామారావు రచన "శ్రీరంగనీతులు"ను ఎం. సూర్యం నిర్మిస్తారు. రమణ నిర్మించే మైత్రి చిత్రా వారి "మోహిని" వర్ణ చిత్రానికి ఆదివిష్ణు రచయిత. రెండు చిత్రాలకూ ఎస్ ఆర్. కె. మూర్తి ఛాయాగ్రాహకుడు.

జి. వి. జి. పేజీ

మద్రాసులో నే ఒక చల్లని రాత్రి

"మద్రాసులోనే జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు ఒకే షెడ్యూల్‌తో చిత్రం పూర్తవుతుంది. మార్చి 29న విడుదల చేయాలనుకుంటున్నాం," అన్నారు వెంకటలక్ష్మి ప్రొడక్షన్స్ "ఒక చల్లని రాత్రి" వర్ణ చిత్రాన్ని సమర్పించే డి. రామానాయుడు. ఆయన సోదరుడు డి. రామమోహనరావు నిర్మాత. కె. వాసు దర్శకుడు. చంద్రమోహన్, రామకృష్ణ, మాధవి, అల్లు రామలింగయ్య, రాజ్‌బాబు, గిరిజ మున్నగు నటవర్గం. కొమ్మూరి సాంబశివరావు కథకు ఆత్రేయ మాటలు, పాటలు సమకూర్చారు. మహదేవన్ సంగీత దర్శకుడు. కె. ఎస్. ప్రకాష్ ఛాయాగ్రాహకుడు నిర్వహణ: జి. రాజేంద్ర ప్రసాద్.

ఒకే చిత్రానికి ఇద్దరు సంగీత దర్శకులు

పి. ఎస్. రావ్. బి. ఏ. (లిట్) దర్శకత్వంలో వై. విశ్వేశ్వరరావు, పి. కృష్ణమూర్తి, పి. ఆర్. గుప్త, టి. నరసింహారెడ్డి నిర్మించే ప్రగతి పిక్చర్స్ "చుక్కల్లో చంద్రుడు" చిత్రానికి ఎస్. రాజేశ్వర రావు, కె. వి. మహదేవన్ సంగీత దర్శకులు. శ్రీధర్, చంద్రమోహన్, ప్రభాకరరెడ్డి, కాంతారావు, రాజనాల, త్యాగరాజు, ధూళిపాళ, జయంతి, జయ, వెన్నిరాడై నిర్మల పాల్గొనే ఈ చిత్రం ఫిబ్రవరి విడుదల. దర్శకుడు రాసిన కథకు సముద్రాల సంభాషణలు రాశారు. కూర్పు, ఛాయలను అంకిరెడ్డి, సుఖదేవ్ నిర్వహించారు.

పోలీసు శాఖవారి నిరసన


బొంబాయి సెన్సార్ బోర్డు కార్యాలయంలో ఇటీవల కొందరు పోలీసు ఉన్నతాధికారుల, చిత్ర నిర్మాతల సమావేశం ఏర్పాటు చేయబడింది. కొన్ని చిత్రాలలో పోలీసువారిని కించపరిచే విధానంగా చూపడంపట్ల కొందరు పోలీసు అధికారులు తమ నిరసనను తెలియజేశారు. "హీరాలాల్ పన్నాలాల్" చిత్రంలో పోలీసుశాఖను మరీ వెకిలిగా చూపడం జరిగిందని నొచ్చుకున్నారు గ్రేట్ బొంబాయి పోలీసు కమీషనర్. ఇటుపైన ఇలాంటివి జరగవని హామీ ఇచ్చారు చిత్ర నిర్మాతలు.

సత్కారాలు, గౌరవాలు

లతామంగేష్కర్‌కు కొల్హాపూర్ శివాజీ విద్యాపీఠ్‌లో డాక్టర్ ఆఫ్ లెటర్స్ డిగ్రీ ఇవ్వబడింది. సత్యజిత్‌రాయ్‌ను శాంతినికేతన్‌లో విశ్వభారతి విశ్వవిద్యాలయం "దేశికోత్తమ" అనే మహోన్నతమైన బిరుదుతో సత్కరించింది. సలీమ్—జావేద్‌లను సినిమా స్క్రిప్ట్ రైటింగ్ మీద ఉపన్యసించడానికి న్యూఢిల్లీ జవహర్‌లాల్ యూనివర్సిటీ ఆహ్వానించింది.

'మరో సీత కథ'లో ప్రభ, మురళీమోహన్




మిరమిట్లు గొల్పే తెలుపు
చూడగానే
అందరి నోట ఒకే మాట...
ఇది తప్పక
డెట్
డిటర్జెంట్
బిళ్ల వుతుకే
Supreme
det
detergent washing cake
Shilpi DM 35A/78 Tel



'కమలమ్మ కమతం' లో జయంతి, కృష్ణంరాజు

జీవిత మాధుర్యం

[21వ పేజీ తరువాయి]

ఆ చుట్టుపక్కల పట్టణాల్లోని విలాసినుల యౌవ్వన శోభలను చక్రవర్తి ఆనందంగా ఆస్వాదిస్తుండేవాడు. కాస్త 'మందు' పుచ్చుకోడం మొదలెట్టేడు. వీలుచిక్కినప్పుడల్లా స్నేహితులతో పేకాట ఆడేవాడు. అప్పుడప్పుడు హైద్రాబాదు, మద్రాసు వెళ్లి గుర్రాలు ఎంత త్వరగా పరుగెడ్తున్నాయో చూసివచ్చేవాడు

ఆ తల్లికి చూచాయగా కొన్ని విషయాలు తెల్సేయి. అందుకే వివాహం చేస్తే సద్బుద్ధి కల్గుతుందని ఆమె ఆశించింది. కాని కొరివితో తల గోక్కోడమైంది. ఆ వియ్యంకుడు ఏణ్ణాళ్ళకు అల్లుడు రాజమండ్రి వచ్చినది లగాయతు, అల్లుడికి మంత్రాంగం చేసి, అల్లుడ్ని తన చెప్పుచేతలలోకి తెచ్చుకున్నాడు. ఆ అమ్మాయి జయలక్ష్మి వయస్సులో చిన్నదైనా తండ్రి కున్న డబ్బు కాంక్ష ఆమెకు వుంది. ఎప్పుడూ నగలని, బట్టలని ఏవో వస్తువులని తెగ డబ్బు ఖర్చుచేసేది. మావఃగారు పాండురంగారావు అల్లుడికి బోధించేడు.

''అల్లుడూ! నువ్వు వట్టి అమాయకుడి వయ్యా. నీ అన్న రాజభూషణం బహు గడుసువాడు. వ్యాపారంలో ఎంత డబ్బు సంపాదిస్తున్నదీ నీకెప్పుడైనా చెప్పేడా? మనలో మాట, నే విన్నదేమంటే వెలుతురున్నప్పుడే చక్కబెట్టు కోవాలని. మీ వదినగారి పేర రహస్యంగా విజయవాడలో ఏదో బ్యాంకులో ఎకౌంటుపెట్టి అడపాతడపా కొంత డబ్బును ఆమె పేర వేస్తున్నాడట. నా భయమేమిటంటే మీ అన్న ఆఖరికి వ్యాపారంలో నష్టమొచ్చిందని నీకు మొండిచెయ్యి చూపెడ్తాడని — జాగ్రత్త! నువ్వేదో అడిగినప్పుడల్లా చెయ్యిదులిపి నాలుగు మెతుకులు రాల్చగానే మీ అన్న మంచివాడని తృప్తిపడి పోతున్నావు ఇలాగయితే పూర్తిగా మోసపోతా వన్నాయి — జాగ్రత్త!''

''అయితే నన్నేం చెయ్యమంటారు చెప్పండి?''

''మరేమీలేదు — వ్యవహారాలన్నీ పూర్తిగా పాడవకముందే నీ వాటా నీకు పంచియ్యమను. నీ వాటా తీసుకుని నువ్విక్కడకు వచ్చెయ్యి. నీచేత బ్రహ్మాండమైన వ్యాపారాన్ని చేయిస్తాను. లక్షలకు లక్షలు గడిద్దాం. నాకు వ్యాపారంలో తెల్సిన మెలకువలన్నీ నీకు నేర్పుతా. యిక్కడకు వచ్చెయ్యి.''

చక్రవర్తి మామగార్కి అల్లుడి కున్నన్ని వ్యసనాలూ వున్నాయి. వ్యాపారం సాగుతుంది రాజమండ్రిలో పెద్ద పేరుతోగాని లోపలంతా గుల్లే. అందుచేత ఆ స్థితిలో అల్లుడు తనతో కలియకపోతే అప్పులవాళ్ళు తనని వీధిలోకి నెట్టుతారని తెల్సు. అందుకే అల్లుడికి అడపాతడపా మంత్రోపదేశం చేస్తుండేవాడు. ఆఖరికి బాగా తలకెక్కి, పెండ్లయి సంవత్సరం తిరగగానే ఆస్తి పంపకంచెయ్యమని అన్నతో తగవు మొదలెట్టేడు. తల్లికి తెల్సు, పెద్దకొడుకు ప్రయోజకుడు, బుద్ధిమంతుడు, సౌమ్యుడు సత్ప్రవర్తనుడని — చిన్నకొడుకు వ్యసనపరుడని, ఆస్తి చేతికి రాగానే తగలెడ్తాడని, లేకుంటే మామగారి వంచనచేరి ఆస్తిని ఆ దుశ్శాసనుడి పరం చేస్తాడని. ఎంతో చెప్పిచూసిందిగాని చిన్నకొడుకు వినలేదు. ఆమెకు రక్తపుపోటురోగం భర్తపోయిననాటి నుండి ఎక్కువయింది. భర్త పోయినతరువాత రెండుసార్లు రక్తపుపోటు ఎక్కువై తెలివితప్పి పడిపోయింది. రెండు సంవత్సరాల్నై మందులమీద ఆధారపడి బ్రతుకుతూంది.

తమ్ముడి పోరుపడలేక, తమ్ముడివెనుకనుండి నాటకం ఆడిస్తున్నది తమ్ముడి మామగారని తెల్సి ఆ మామగారితోనే ఈ వ్యవహారం మాట్లాడేడు రాజభూషణం. కాని ఆ పాండురంగారావు ససేమిరా వీలులేదు, తన అల్లుడి క్షేమం దృష్ట్యా ఈ పంపకాలు జరుగవల్సిందే అన్నాడు, మొదట్లో అల్లుడికి నచ్చచెప్తానన్నవాడు.

''మామగారూ! మా తమ్ముడికి వ్యాపార దక్షత తెలీదు. ఇప్పటికే మా మేనేజర్లు కొంత మోసం చేసేరు. ముఖ్యంగా ఆ సినీమాహాలు మేనేజరు రామలింగయ్య చాలా డబ్బు కాజేసేడు. అందుకే వాడ్ని తీసేసి కొత్తవాడిని మేనేజరుగా వేసేను. ఆ రామలింగయ్య ఇప్పటికి తమ్ముడికి విశ్వాసపాత్రుడు. వాడు మళ్ళీ మేనేజరుగా వస్తే సినీమాహాలునే తినేస్తాడు. మీకు నేను చెప్పలేను గాని మా తమ్ముడు అమాయకుడు, తన వాటా పంచిస్తే ఆ ఆస్తిని అతడు నిలబెట్టుకోగలడా అని నా సందేహం. ఏ వక్రమార్గాలలో పడి తగలెడ్తాడోనని నా భయం. మీ అల్లుడి శ్రేయస్సు కోరి మీరు ఈ విభజనను అరికట్టాలి. మాది సమిష్టి కుటుంబంగానే ఉండనియ్యండి. మీరు పెద్దవారు మీరు చెప్తే మా తమ్ముడు వింటాడని నాకు నమ్మకముంది. ఏమంటారు మామగారూ?''

''నువ్వు చెప్పింది బాగానే ఉందిగాని మీ తమ్ముడు నే చెప్తే వింటాడని నాకు నమ్మకం లేదు. మీ తమ్ముడిది బహు మొండి పట్టుదల. పోనీ అతడు కోరినట్లు ఆస్తి పంపకం చెయ్యరాదూ? నువ్వు హెచ్చరించిన దుష్టులనుండి అతడిని నేను కాపాడుతా. ఆ రామలింగయ్య దరిదాపుల్లోకి రాకుండా నే చూసుకుంటా. మీ తమ్ముడు పెద్దవాడయేడు గనుక అతడి బ్రతుకు అతడు బ్రతకడం మంచిదని నా ఉద్దేశం. ఏం కాని నా అల్లుడు దుష్ప్రవర్తనుడు కాకుండా చూసుకునే బాధ్యతను నేను తీసుకుంటా. పోనీ మీరంతా ఇంతగా చెప్తున్నారు గనుక నేను మా అల్లుడికి ఓసారి చెప్పి చూస్తాను.'' అన్నాడు.

''అల్లుడూ! మీ అన్నగారి ఉద్దేశం మరోలా గుందోయి. ఆ రాజ్యాధిపత్యాన్ని ఒదులుకుందుకు మహా గింజాకుంటున్నాడు. నిన్ను యువరాజుగానే ఉంచుదామనుకుంటున్నాడు. అందుకే నేనుండగానే నువ్వు తాడో పేడో తేల్చుకోవాలి, లేకపోతే మీ వాళ్ళంతా కుమ్మక్కయి నీమాట నెరవేరకుండా చేసేస్తారు. ఇంకా ఆలస్యమైతే నీకు చేతికి చిప్పే రాగలదు-జాగ్రత్త!'' అని అల్లుడ్ని హెచ్చరించాడు.

ఆ మరునాడు చక్రవర్తి పెట్టుకోవల్సిన తగాదా అంతా పెట్టుకున్నాడు. తన వాటా ఒక్క రోజు కూడా ఆలస్యం చెయ్యకుండా పెద్దల సమక్షంలో పంచిపెట్టమని గొడవ చేసేడు. లేకుంటే కోర్టులకు ఎక్కుతానన్నాడు. తోటి కోడళ్ళ మధ్యన పెద్ద గొడవ జరిగింది. చిన్న కోడలు పెద్దకోడల్ని అనవల్సిన మాటలన్నీ అంది. ఆస్తినంతా తెగమేయడం అలవాటయి, ఇప్పుడు భాగాన్ని పంచిపెట్టమంటే యేడ్చి చస్తున్నారని నింద వేసింది. అత్తగార్ని దుర్భాషలాడింది, ఆవిడకు తనంటే ఇష్టంలేదని పెద్దకోడలు పక్షమైపోయి చిన్నకొడుకుని సర్వనాశనం చేస్తూందని.

ఈ గొడవలన్నీ రాజభూషణం మరి భరించ లేకపోయేడు.

''తమ్ముడూ సరే నీ ఇష్టమే కానియ్యి.

ఇవాళ శనివారం కదా, సోమవారం ప్రొద్దున్న పెద్దలు నలుగుర్ని పిలిచి మన వ్యాపార వ్యవహారాలన్నీ సమగ్రంగా పరిశీలించి భాగాల్ని పంచుకుందాం.'' అని చెప్పాడు.

ఆ రాత్రే రాజభూషణం తల్లి రక్తపుపోటు ఎక్కువై తెలివితప్పి కుప్పలా కూలిపోయింది. అంతే మరి లేవలేదు. మరునాడు పదిగంటలకు తన భర్తను పై లోకాల్లో కలుసుకునేందుకు ఈ లోకాన్ని వదిలింది.

అనుకోకుండా జరిగిన ఈ విఘాతానికి చక్రవర్తి చలించిపోయేడు. రాజభూషణంకు మళ్ళీ కథ మొదలైంది. దిన వారాలు ఘనంగా చేయాలని వచ్చిన బంధువర్గమంతా ఎన్నో ఉచిత సలహాలను ఇచ్చేరు బ్రాహ్మణులు అంతకన్నా యెక్కువగా తలమొత్తుకున్నారు — అంతటి మహా ఇల్లాలు అన్నగా స్వర్గంలోనికి పోయి భర్తను కలుసుకోవాలంటే ఎన్నో దానాలు చెయ్యాలని, బంధువులను ముఖ్యంగా బ్రాహ్మణులను సంతుష్టిపరచాలని. ఓ ఇరవైవేల ఖర్చుతో ఉత్తర క్రియలు జరిపి తల్లిని ఊర్ధ్వ లోకాలకు పంపించేడు రాజభూషణం.

పాపం తల్లిదండ్రులు లేని పిల్లలయ్యేరని, బంధువర్గమంతా దినవారాలయేక మరో పదిహేను రోజులుండి రాజభూషణాన్ని, చక్రవర్తికి సానుభూతిని తెల్పి మరీ వెళ్ళేరు. వాళ్ళంతా వెళ్ళిపోయేక రాజభూషణం ఊపిరి పీల్చుకున్నాడు. చక్రవర్తి మరో రెండు నెలలాగి మామగారి ఒత్తిడి యెక్కువ కాగానే మళ్ళీ వేర్పాటు గురించి అన్నను అడిగేడు ఆ సరికి రాజభూషణం ఎలా జరగవల్సింది అలా జరగనీ అనే సాధుతత్వానికి వచ్చేడు.

పెద్దలందర్నీ పిలిచి ఓ వారం రోజులలో వ్యవహారాలన్నిటినీ ఓ క్రమంలో పెట్టి అందరి ముందర ఆ ఆస్తిపాస్తుల వివరాలన్నీ ఉంచేడు. తమ్ముడికి కావల్సిన భాగాన్ని తీసుకోమన్నాడు. తమ్ముడి తరపున తమ్ముడి మామగారు వక్తగా వ్యవహరించేడు.

నివాస భవనము, తోట రాజభూషణం ఉంచుకుని సినీమాహాలుని తమ్ముడికి ఇచ్చేటట్లు, రెండు బియ్యపు మిల్లులను అన్నదమ్ములు చెరొకటీ తీసుకుందుకు ఒప్పందం అయింది. వ్యాపారం లెక్కలన్నీ తిరగవేసి చూస్తే వ్యాపారంలో తిరుగుతోంది అయిదు లక్షలు. అందులో మూడు లక్షలు పరపతిమీద పుట్టిన అరువులు. అందుకే ఆ మూడు లక్షలు పోను మిగిలిన నగదు రెండు లక్షలు అన్నదమ్ములిద్దరు చెరో లక్ష రూపాయలు తీసుకుని వేరేగా కావల్సిన వ్యాపారం చేసుకుందుకు ఒప్పందమయ్యింది.

భాగస్థులు విడిపోయేరు గనుక రామరాజు అండ్ సన్స్ వ్యవస్థను రద్దు చేసేరు. వ్యాపారంలోని లావాదేవీలన్నీ చూసుకుని, భాగస్వామి వ్యవస్థను రద్దుచేసి ఆస్తులను పంచుకుని అన్నదమ్ముల పేర విడివిడిగా వాటి రిజిస్ట్రేషను జరిగే సరికి ఓ రెండు నెలలు పట్టింది.

రిజిస్ట్రేషను అయిన మరునాడే చక్రవర్తి భార్యను తీసుకుని రాజమండ్రి మామగారింటికి చేరేడు. మామగారిది చక్కని మేడ. మేడ భాగంలో మూడు గదులు పెద్దవి ఉన్నాయి. మేడ భాగం కూతురు అల్లుడు కాపురముండడానికిచ్చి, పాండురంగారావు క్రింది భాగంలో ఉండేవాడు. మామగారి టోకు బట్టల వ్యాపారంలో భార్య జయలక్ష్మి పేర ఏభైవేలు మదుపుపెట్టి, మిగతా ఏభైవేలు తన పేర బ్యాంకులో వేసుకున్నాడు. తరువాత మెయిన్‌రోడ్డులో మంచి కొట్టును అద్దెకు తీసుకుని అందులో స్టెయిన్‌లెస్‌స్టీలు సామాన్ల దుకాణం పెట్టడానికి సలహా యిచ్చేడు మామగారు. ఈవిధంగా చక్రవర్తికి, భార్య జయలక్ష్మికి వేర్వేరు వ్యాపారాలు వుండడంవల్ల ఇన్‌కంటాక్సు తగ్గుతుందని పాండురంగారావు బోధించేడు.

తన ఊరిలోని సినీమాహాలుకు తిరిగి రామలింగయ్యను మేనేజరుగా పెట్టుకున్నాడు చక్రవర్తి. చక్రవర్తి నెలకోసారైనా తన ఊరు వచ్చి సినీమాహాలు ప్రక్కనున్న తమ గెస్టుహౌసులో దిగేవాడు. రామలింగయ్య చక్రవర్తి వచ్చినప్పుడల్లా మధువును, మదవతిని ఏర్పాటు చేసేవాడు. దాంతో సంతుష్టిచెంది, రామలింగయ్య చూపిన ఎకౌంట్లను ఒప్పుకుని సంతకంచేసి వచ్చేవాడు. ఆ నెలకు ఇంత లాభం వచ్చిందని, ఎంత డబ్బిస్తే మారుమాటాడకుండా జేబులో వేసుకుని వచ్చేవాడు. పాండురంగారావు ఆ మేనేజరును గురించి హెచ్చరిస్తే —

''మీకు తెలియదు మామగారూ రామలింగయ్య చాలా మంచివాడు, నమ్మకస్తుడు, నేనంటే మంచి గౌరవం. మా అన్నయ్య మీకు రామలింగయ్య గూర్చి ఏదో చెడుగా చెప్పంటాడు. అందుకే మీరు అతడి గురించి వేరేగా భావిస్తున్నారు. అదేమోగాని మా అన్నకు రామలింగయ్యకు మొదటి నుండి పడలేదు. అసలు రామలింగయ్య లేకపోతే మన సినీమాహాలుకు మంచి పిక్చర్లే రావు. రామలింగయ్యకి విజయవాడలో డిస్ట్రిబ్యూటర్ల వద్ద మంచి పలుకుబడి వుంది. అతడు పెద్దమనిషికాడు, రౌడీ అంటారు. అది నిజమే, కాని చూసేరూ మామగారూ, సినీమాహాల్నుని, లాడ్జింగు హోటల్నుని, కల్లు దుకాణాల్ని, కాబెరా డాన్సు హాళ్ళను పెద్దమనిషి అయినవాడు నడపగలడా? కాస్త రౌడీతనం, కరకు స్వభావం యెంతో అవుసరం. నలుగురు సరసంగా, స్వేచ్ఛగా వచ్చిపోయే కొంపలాయె. అందుచేత రామలింగయ్య గురించి మీరేమీ అనుమానాలు పెట్టుకోకండి,'' అని చక్రవర్తి మామగారికి బోధపరచి వెళ్ళిపోయేడు.

బియ్యంమిల్లు పైన వచ్చే ఆదాయం, సినీమాహాలు కలక్షన్సు చక్రవర్తి దర్జాలకు విలాసాలకు సరిపోయేవికావు. బెంగళూరు, హైదరాబాదు, మద్రాసు రేసులకు వెళ్ళి బ్యాంకులో వుంచిన ఏభైవేల రూపాయలలో కొంత తీసి పందాలు కాసేవాడు. వచ్చిన డబ్బుకన్న పోయిన డబ్బు ఎక్కువగా ఉండేది. మెల్లమెల్లగా అల్లుడు తన చేతి నుండి జారిపోతున్నట్లు క్రమేపి పాండురంగారావుకి తెలియవచ్చింది

ఒకసారి చక్రవర్తి మద్రాసు వెళ్ళినప్పుడు 'స్వర్గం' అనే పెద్ద హోటల్లో దిగేడు. ఆ వారాంతం రేసుల్లో జాక్‌పాట్ తగిలి చక్రవర్తి వంతుకు ఓ పదిహేను వేలు వచ్చింది. చక్రవర్తి మంచి హుషారులో ఉన్నాడు. ఆ హోటల్లో చెంగయ్య అనే బేరర్ ఉన్నాడు. చాలా ఘటికుడు, రసికుడు. హోటలు కొచ్చే ఆసామీల షోకుల్ని ఇట్టే పసిగట్టేవాడు. చక్రవర్తి రేసులనుంచి వచ్చిన రాత్రి చక్రవర్తి ఉల్లాసాన్ని కనిపెట్టి మెల్లగా గదిలోకి చేరేడు. అసరికి చక్రవర్తి మందు పుచ్చుకుంటున్నాడు.

''ఏమిటి సార్! మరీ ఒంటరిగా ఉండిపోయేరు.''

''అదే చెంగయ్యా! వెల్తిగా ఉంది. ఈ దేశవాళీ సరకు అంత ఉషారు కల్గించడంలేదు. ఏదైన విదేశీ సరకుంటే తెచ్చిపెట్టు''.

''వైట్ హార్స్ స్కాచ్ విస్కీ ఉంది, తెమ్మంటారా సార్! బాటిల్ నూట ఎనభై అవుతుంది.''

''అలాగైతే — దాంతో ఓ ప్లేటు పొటాటో చిప్స్, అర కేజీ ప్లవ్స్, పావుకేజీ జీడిపప్పు ఫ్రయిడ్ అండ్ సాల్టెడ్ తీసుకురా.''

''మరి త్రాగడానికి, తిండానికేనా సార్ — మరి వెచ్చగా మెత్తగా ఒళ్ళో కూర్చోడానికి వద్దా సార్!''

''నువ్వు సిగ్గుపడతావేమోనని చెప్పలేదు. ఏం చెంగయ్యా! ఎవరైనా మంచి కాల్‌గర్ల్స్ దొరుకుతారా?''

''డబ్బుండాలి, సరదా ఉండాలిగాని గర్ల్స్‌కి కొదువేమిటి సార్. చెప్పండి సార్ బజారు మనుష్యులు కావాలా, సంసారులు కావాలా, కాలేజి అమ్మాయిలు కావాలా, సినిమా స్టార్సు కావాలా చెప్పండి! రాత్రి తొమ్మిది కొట్టేసరికి మీ గదిలో హాజరు పరుస్తాను. మరి ప్రొద్దున్న ఆరుకి వాళ్ళను విడిచిపెట్టెయ్యాలి. వాళ్ళ రేట్లు నేను చెప్పిన క్రమంలో ఉంటాయి — కాని మంచి సరకు, నేను గ్యారంటీ ఇస్తాను సార్!''

చక్రవర్తి గలగల నవ్వేసేడు.

''ఏమిటి చెంగయ్యా నన్నే బోల్తా కొట్టించేస్తున్నావు! నిండుగా పైట కప్పుకుని వస్తే సంసారులైపోతారా, లేక చేతిలో రెండు పుస్తకాలు పట్టుకుని రెండు జడలు వేసుకుంటే కాలేజీ అమ్మాయిలైపోతారా! అంతా ఆ బజారు సరుకే. రంగురంగుల సీసాలలో పోసి తెస్తానంటావు. అవేవి వద్దుగాని ఓ మాంచి సినిమా స్టారుని తీసుకుని రా.''

''సినిమాస్టారంటే చాల రకాలున్నాయి సార్. సినీమాలలో వీధి తుడిచింది మొదలుకుని కథానాయిక వరకు సినీస్టారే. అసలు కథానాయికలు ఈ బిజినెస్ చేయరు. మిగతా వర్గాలలోని కొందరు మాత్రమే ఇందులో ఉన్నారు. మేము ఈ బిజినెస్‌లో ఈ స్టార్స్‌ని అయిదు రకాలుగా లెక్కకడ్తాం సార్. ఉపనాయిక అయితే రాత్రికి అయిదువేలు పుచ్చుకుంటుంది. అంతకన్న చిన్ననాయిక అయితే రెండువేలు పుచ్చుకుంటుంది సార్! ఏ నాయిక కాకుండా ముఖ్యమైన పాత్రలకోసం తాపత్రయ పడుతున్నదైతే వెయ్యిరూపాయలకు వస్తుంది.



'ముత్తయిదువ'లో కృష్ణ, జయచిత్ర

జీవిత మాధుర్యం

మిగతావాళ్ళ సంగతి మనకొద్దు సార్. వాళ్ళు మన స్టేటస్‌కి తగరు. ఇప్పుడు చెప్పండి సార్ ఎవర్ని తెమ్మంటారో."

చక్రవర్తి కాస్త ఆలోచించి — "రెండువేల రూపాయలకు వచ్చే ఆ చిన్న నాయిక నెవర్నైనా అందమైనదాన్ని చూసి తేవయ్యా," అని ఆదేశించేడు.

"ఈపూట ఖాళీగావున్న వారెవరో ఫోనుచేసి కనుక్కునివస్తా సార్. వాళ్ళకో ఏజెంటు వున్నాడు సార్. వాడు ఫోనుమీద ఈ వ్యాపారమే చేస్తాడు, తెల్పన హోటలువాళ్ళతోనే సుమండి," అని చెంగయ్య క్రిందకు వెళ్ళి ఫోనుచేసి కనుక్కుని పది నిముషాలలో వచ్చేడు.

"సార్! తిలోత్తమగారు వస్తామన్నారు. ఆవిడ ప్రొద్దున్నే "కుంభకోణం పరమేశ్వరన్" అనే తమిళ సినిమా షూటింగు పూర్తిచేసుకుని వచ్చేరుట. ఈ రాత్రి వేరే పనేమి లేదుట. ఆవిడ సినిమాలలోకన్నా చాలా అందంగా వుంటుంది సార్. ఆవిడ్ని చూస్తేనే నాకు మతిపోతుంది. ఆవిడ్ని నేను బ్రతిమాలగా, బ్రతిమాలగా ఓనాడు ఆమె చేతిని ముద్దులాడనిచ్చేరు సార్. ఆహా! ఎంత మెత్తగ, తియ్యగావుందో చెప్పలేను! నేనెప్పటికి ఆమె సుండని చేతిని మరచిపోలేను — అట్లాంటిది మీరామెను రాత్రంతా పొందుతుంటే నాకు అసూయగావుంది సార్," అని నవ్వుకుంటూ బేరరు చెంగయ్య వెళ్ళిపోయేడు.

తిలోత్తమ తొమ్మిదిగంటలయేసరికి బాగా ముస్తాబై టాక్సీలో హోటల్ స్వర్గంకి వచ్చింది. లాబీలో ఆమెకు ఎదురై చెంగయ్య ఆమెను చక్రవర్తి రూముకు తీసుకొనివెళ్ళేడు. లోనికి తీసుకునివెళ్ళి ఇరువురికి పరిచయంచేసి చెంగయ్య వెళ్ళిపోయేడు.

తిలోత్తమ ప్రవేశించేసరికి వైట్‌హార్స్ స్కాచ్‌ని చక్రవర్తి అప్పుడే సేవించబోతున్నాడు. తిలోత్తమ గదిలోకి అడుగు పెడ్తూనే చక్రవర్తి కండ్లనిచెదరగొట్టింది. తిలోత్తమ సినిమాలలోకన్నా స్వతహాగా చాలా అందమైన యువతి. చాలా ఖరీదైన మనిషి. ఆవిడ వేసుకున్న దుస్తులన్నీ లోన బయట అన్నీ గులాబిరంగు సిల్కువే. ఆమె ఒళ్ళు ఆ రంగులోనే వుంది. ఆప్యాయంగా డార్లింగ్ అని పలకరించి చక్రవర్తి ప్రక్కన కూర్చుంది. చక్రవర్తితోబాటు ఆమె ఫలహారాల్ని జీడిపప్పుని, ప్లమ్స్‌ని మధ్య మధ్య ముద్దులతోబాటు పంచుకుంటు విస్కీని కొంచెం కొంచెం సేవించడం చేసింది.

మద్యం నరనరానికు ప్రాకి శరీరానికి వేడి బాగా కలగగానే చక్రవర్తికి మధువుమించి మనస్సు మగువమీదకు పోయింది. సీసా కూడా ఖాళీ అయింది. తిలోత్తమను కౌగిలిలోకి తీసుకోబోతుంటే ఆగమని చెప్పి, ఆమె తన బట్టలన్నిటిని నలగకుండా చక్కగా మడతలు పెట్టి బట్టల స్టాండుపైనుంచి, నగలను కూడ తీసి హేండు బాగులో పెట్టుకుని, పుట్టినప్పుడు ఎలా ఉండేదో అలాగే ఒంటిమీద నూలు పోగైన లేకుండా తన శరీర లావణ్యాన్నే ఆభరణంగా ధరించి, తన మెత్తని వెచ్చని ఒంటిని ఏ సంకోచం లేకుండా చక్రవర్తికి అర్పించింది. చక్రవర్తికి ఆ హోటలు నిజంగా స్వర్గలోకంలా, తిలోత్తమ నిజమైన అప్సరసలా తోచేయి—పరవశించిపోయేడు.

ఆ రాత్రే తిలోత్తమ మెల్లగా చక్రవర్తి ఐశ్వర్య వివరాలని అతి ప్రేమతో తెల్సుకుంది. అతడికి ఒక రైసు మిల్లు, ఒక సినిమాహాలు, రాజమండ్రిలో బట్టల వ్యాపారం పైగా బ్యాంకులో బోలెడంత డబ్బు ఉన్నాయని తెల్సుకుంది. చక్రవర్తి వ్యసనపరుడని, ముఖ్యంగా చక్కని స్త్రీ దొరికితే మతి పోగొట్టుకుంటాడని గ్రహించింది. ఆమె మెదడులో చక్కని ఆలోచన కల్గింది.

మర్నాటి ప్రొద్దున్నే లేచి స్నానం చేసి, బట్టలు కట్టుకుని వెళ్ళే సమయానికి చక్రవర్తి రెండువేల రూపాయలు ఇవ్వబోతే ఒద్దు తీసుకోనంది. చక్రవర్తి ఆశ్చర్యపోయేడు. చక్రవర్తిలాంటి చక్కని, సంస్కారవంతుడైనవాని పొందువల్ల తను పొందిన ఆనందం ఈ డబ్బు పుచ్చుకోడం వల్ల హేయమైపోతుందన్నది. చక్రవర్తి నవ్వేసి బలవంతంగా ఆమె బాగులో రెండువేల రూపాయల్ని పెట్టేసేడు.

"చక్రవర్తిగారూ! ఈ హోటలు చాలా ఖరీదైనది. మీకభ్యంతరం లేకపోతే మిమ్మల్ని మరికొన్నాళ్ళు నావాడిని చేసుకోవాలని ఉంది. అందుకే మీరు నా ఇంటికి వచ్చేయకూడదూ."

చక్రవర్తి తన అదృష్టానికి అచ్చెరువందేడు. సంతోషంతో—"ఇప్పుడే మీతో వచ్చేయమన్నారా?"

"ఇప్పుడే నాతో మీరు వస్తే, ఈ హోటలు వాళ్ళు నామీద ఏడ్చిపోతారు. ఇదిగో నా అడ్రసు కార్డు. ఈ సాయంత్రం ట్రెయినుకు పోతున్నట్లు చెప్పి ఈ హోటలు ఖాళీచేసి నేనిచ్చిన అడ్రసుకు టాక్సీమీద వచ్చేయండి. మీకోసం నేను ఎదురు చూస్తుంటాను. మరోసారి మీరిలా నాకు డబ్బివ్వ కూడదు. మీ దగ్గర పుచ్చుకుంటే నా కెందుకో బాధగా ఉంటోంది."

చక్రవర్తి ఉల్లాసంగా — "మీరెలా చెయ్యమంటే అలా చేస్తాను. ఈ సాయంత్రం ఆరు గంటలకు తప్పకుండా వస్తాను. ఐ లవ్ యూ," అని ఆఖరుసారిగా ఆమెను ఓసారి ముద్దుపెట్టుకుని సాగనంపేడు గదినుండి.

తిలోత్తమ మెట్లుదిగి క్రిందకు రాగానే మేనేజరు చిరునవ్వుతో పలుకరించేడు. తిలోత్తమ మేనేజరుకు పర్సులోంచి రెండువందల రూపాయల నోట్లనుతీసి అందించింది. మేనేజరు చాలా థాంక్సు చెప్పేడు. హోటలులాబీలోకిరాగానే బేరరు చెంగయ్య అమ్మగార్కి గుడ్‌మార్నింగ్ చెప్పేడు చిరునవ్వులు ఒలకబోస్తూ. తిలోత్తమ అతడి చేతిలో ఒక ఏభై రూపాయల నోటుని పెట్టింది. వాడు థాంక్సు చెప్పి మళ్ళీ ఓసారి సెల్యూట్‌చేసి ఉత్సాహంగా పరుగెత్తికెళ్ళి టాక్సీని పిలిచేడు. తిలోత్తమ చాలా దర్జాగా నడుస్తూ వెళ్ళి టాక్సీ ఎక్కి తనింటికి పోయింది.

ఆ సాయంత్రమే చక్రవర్తి హోటలు వదిలేసి ఆళ్వారు పేటలోని తిలోత్తమ ఇంటికి బయలుదేరేడు తన సామాన్లను తీసుకుని. తిలోత్తమ వేసిన వలలో చక్రవర్తి బాగానే చిక్కుకున్నాడు. తిలోత్తమ మోహంలోపడి చక్రవర్తి వివశుడైపోయేడు. తిలోత్తమ పథకమంతా చక్రవర్తిచేత ఓ సినిమా తీయించి ఆ సినిమాలో కథానాయికవేషం వేసి తన అదృష్టం బాగుంటే పేరుప్రఖ్యాతులు తెచ్చుకుని కథానాయికగా నిలచిపోవచ్చని. ఎన్నాళ్ళిలా చిన్న చిన్న వేషాలువేస్తూ బ్రతకడం. ఈ హోటలు వ్యాపారం ఎన్నాళ్ళు సాగగలదు. మహాతగిలితే నెలకు ఓ రెండు మంచి బేరాలు తగుల్తాయి. సినిమాలలో అందరికి ఒళ్ళు లంచంగాపెట్టి ఒంటిని హూనం చేసుకోడమేగాని పెద్దగా ప్రయోజనం కలుగలేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే వుండిపోయింది. ఒక్కడూ తనకి కథానాయిక వేషం యివ్వలేదు.

అందుకే చక్రవర్తిని అంత ప్రేమగా తనింట్లో వుంచుకుంది. తనలాగే స్టూడియోలలో చిన్న చిన్న ఉద్యోగాలు అంటే అసిస్టెంటు కెమేరామాన్, అసిస్టెంటు దర్శకుడు ఉద్యోగాలు చేస్తున్న మాధవన్‌తో తిలోత్తమకు శాశ్వత సంబంధముందిగాని వీలైనంతమట్టుకు ఎవరి బ్రతుకులు వాళ్ళు బ్రతుకుతున్నారు, వాళ్ళ వ్యవహారాలకు నిరోధకంగా వుండకూడదని. తరువాత పేరుప్రఖ్యాతులతోబాటు డబ్బు బాగా ఆర్జించేక ఈ అనుబంధాన్నే భార్యాభర్తల అనుబంధంగా మార్చుకుందామనే ఉద్దేశం వాళ్ళకుంది. అంతవరకు అది గుట్టుగానే ఉంచదలిచేరు.

[ఇంకా వుంది]

మా నిజరూపం యొక్క రెండవవైపు కూడా గమనించి చూడండి

BHEL మారుతోన్న కాలానుగుణంగా మారుతున్నది

భారతదేశ విద్యుత్‌శక్తికి ప్రధానమైన ప్రజాశక్తియే బిహెచ్ఇఎల్ అని అనేకుల అభిప్రాయం. అయితే యిది యీ చిత్ర మండలి ఒకవైపు దృశ్యం మాత్రమే. బిహెచ్ఇఎల్ "ప్రజలకు 'విద్యుత్ శక్తి" మాత్రమే యివ్వగలనని తన ప్రమాణము నకు పరిమితి కల్పించుకోలేదు. బిహెచ్ ఇఎల్ మరోరకం శక్తిని కూడా నిర్మించుటకు సహాయపడుటకై తీవ్రంగా కృషి చేయుటలో నిమగ్నమై వుంది. అదే, పటిష్టమైన పారిశ్రామికాభివృద్ధి ద్వారా పొందగల మహత్తర శక్తి. నేడు, బిహెచ్ ఇఎల్ నుండి తయారై వెలువడుచున్న ఆధునాతన, సున్నితమైన పరికరములు, విధానములు, మన భారతదేశ ఆర్థిక పురోగతికి ప్రధానమైన అనేక పరిశ్రమ లందు ప్రముఖ విభాగములుగా ఉపయో గింపబడుచున్నవి. ఇలా, వీనిని ఉపయో గించే వానిలో ఉక్కు, సిమెంటు, పెట్రో లియం, కెమికల్స్, రవాణా, మైనింగు, మరియు ఫర్టిలైజర్స్ పరిశ్రమలు చేరి వున్నవి.

భారతదేశ పరిశ్రమాభివృద్ధికి అధికంగా అధునాతన సున్నిత పరికరముల అవసరములను గమనించి అందుకు తగినట్లు సకాలంలో బిహెచ్ ఇఎల్ అనేక రకములైన భారతదేశ పరిశ్రమల ప్రత్యేకోపయోగములను ప్రధానంగా యెదుర్కొనుటకు తగిన పరికరములను, విధానములను అభివృద్ధి చేస్తున్నది. ఉక్కు, మెటల్సు, పెట్రోలియం, ఫెర్టిలైజర్లు, కెమికల్సు, కాగితము, పంచదార, రబ్బరు, మైనింగు, వస్త్రముల తయారు, రవాణా మొదలైన అనేక పరిశ్రమల అవసరములకు తయారగుచున్నవి 1977-78లో మాత్రమే బిహెచ్ఇఎల్ దాదాపు రు. 100 కోట్ల విలువకు పైబడిన పరికరములను సప్లయి చేసింది.

ప్రస్తుతంలో, ఇది 22కు పైబడిన ప్రధాన పారిశ్రామిక ప్రాజెక్టులతో సంబంధం కలిగి వుంటూన్నది.. పరికరములను సప్లయి చేయడం మాత్రమేగాదు. బిహెచ్ఇఎల్, పరిశ్రమలకు సప్లయిచేసే పరికరములలో యెలక్ట్రికల్ మోటార్లు, ట్రాన్సుఫార్మర్లు, స్విచ్‌గియర్లు, రెక్టిఫైయిర్లు, కెపాసిటేటర్లు, పారిశ్రామిక టర్బయిన్లు, టర్బోసెట్లు, సెంట్రిఫ్యూగల్ కంప్రెసర్లు, ప్రాసెస్ బాయిలర్లు, వ్యర్థమైపోవు ఉష్ణమును తిరిగి పొందు పరికరములు, హీట్ యెక్స్ఛేంజెర్లు, ఎలెక్ట్రోస్టాటిక్ ప్రిసిపిటేటర్లు, పారిశ్రామిక పంకాలు మరియు వాల్వ్‌లు చేరియున్నవి.

ఈ రంగములందు బిహెచ్ఇఎల్ తన భూమికను నిరంతరం విస్తృతం చేసికొంటూనే వుంటూన్నది.

నేడు, దీని ఇంజనీర్లు మరియు యిది సరఫరా చేయు పరికరములు, అనేక రకములైన పరిశ్రమలకు అవసరమైనట్టి వివిధ రకములైన ప్రత్యేక పరికరములను పూర్తిగా అందివ్వగలుగు చున్నారు.

బిహెచ్ఇఎల్ పరిశ్రమల సమగ్ర సేవలకు అనుగుణంగా సంపూర్ణమైన శక్తి కలిగివుంది.

పరిశ్రమలకు ఉత్తమ సేవలు అందిచ్చుటకు మరియు ఖాతాదారుల అవసరములను క్రమపర్చుటకు బిహెచ్ఇఎల్ ఇండస్ట్రియల్ డ్రైవ్ సిస్టమ్ గ్రూప్‌ను యేర్పాటు చేసింది. ఈ గ్రూపు, ఉక్కు, మెటలర్జికల్, కాగితం, మైనింగు, మరియు యితర పరిశ్రమలకు సంబంధించిన సిస్టమ్స్ ఇంజనీరింగు, కంట్రోల్ స్కీమేటిక్స్ డిజైన్‌సకు సంబంధించిన యెలక్ట్రికల్ పరికరముల యొక్కయు నిర్మాణము మరియు కమిషనింగు పనులకు సంబంధించినట్టియు కంట్రాక్టు పనులను పూర్తి చేస్తున్నది. ఇది కాకుండా, మార్కెట్ అవసరములను విస్తృతంగా పరిశీలిస్తూ, ఆనాటికానాటికి మార్పు చెందుచున్న స్థితులకు తగినట్లు ఖాతాదారుల అవసరములను అనుకూలమైన క్రొత్త పరికరములను అందించడం వంటి పనులు కూడా చేస్తూన్నది.



దేశ సౌభాగ్యానికి శక్తి

భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్

మార్కెటింగ్ & సేల్సు డివిజన్
న్యూఢిల్లీ హౌస్, బరఖాంబా రోడ్,
న్యూఢిల్లీ-110 001.
రిజిష్టర్డ్ ఆఫీసు:
18-20, కస్తూరిబాగాంధీ మార్గ్, న్యూఢిల్లీ-110

SAA/BHEL/1071A TEL

బి. ఏ. చోడవరం

మీరు ఎలా వుంటారో చూడాలని వుంది. ఫోటో పంపించరా అక్కయ్యగారూ?

అలాంటి దారుణాన్ని కోరిక కోరకు చిట్టితల్లీ. దడుసుకుంటావు. నేనెలా వుంటానని చెప్పను? తిన మరిగి బుర్రలేని ఆడది ఎలా వుంటుందో అలాగే వుంటానంటారు నా స్నేహితులు. పిల్లలకి స్నేహితురాలిలాగా పెద్దలకి కొరకంచు లాగా కనిపిస్తానంటారు. మగవాళ్ళకి చదువుకొని మూర్ఖురాలిగా, ఆడవారికి జగమొండిలాగా కనిపిస్తానంటారు. నాది భారీ శరీరమే గాని, భయాలు చాలా చిన్నవి! ఏదో ఏ

ప్రశ్నావళి!

వే. రామలక్ష్మి

బొద్దింకనో, కప్పనో చూసి భయపడతానే గాని— ఆడదంటే గౌరవం లేని మగవాళ్ళని, నకిలీ మేధావులనీ, మూడో విప్లవ వాదులనీ చూసి దడుసుకోను! ఇంకా ఫోటో కావాలా? అలాంటిది ఏ జయప్రదనో అడగాలి, ఏ కలకంలేని చైనాబొమ్మలాగా చెరగని చిరునవ్వుతో వుంటుంది కనుక గోడని వేలాడేసుకున్నా అందం చందం. ఏమంటావు?!

ఎస్. కె. ఎల్. బోధన్

అమితమైన ప్రేమ, అమితమైన పగ ఎవరి మీద అతి ఎక్కువగా వుంటుంది?

అయిన వారి మీదనే!

జె. బి. హెచ్. ఆర్. హైదరాబాదు

వాగ్దానాలు చేసే వారినేమనాలి?

అధికధాటి గాని చేస్తే స్వల్పం అని నవ్వుకొని వూరుకోవాలి.

ఎమ్ కె ఎమ్మిగనూరు

మనిషయి పుట్టాక అనుకున్నది సాధించక పోతే బ్రతుకు వ్యర్థమా?

కాదు బ్రదర్, గమ్యం కాస్త దూరంగా పెట్టుకోవాలి. అప్పుడే సాధించినది తక్కువ అయినా కాస్త ఎక్కువ దూరం వెళ్లడం జరుగుతుంది. ని ఆశల వల ఆకాశానికేస్తే— కనీసం చెట్టు కొమ్మకయినా — తగులుతుంది.

జె ఎస్. విశాఖపట్నం

మనసులో కోరిక తీరాలంటే ఏం చెయ్యాలి?

పైకి చెప్పుకోవాలి సోదరి.

జి. వి. ఎల్. బళ్ళారి

దేవుడు లేడని వాదించేవాళ్ళు దేవాలయం కనబడగానే పూజలు చేస్తారు. వారినేమనాలి?

దొంగభక్తులు.

ఎమ్. ఎస్. ఆర్. గుంటూరు

పుట్టినప్పటినుంచి 'ఇది నీ పెళ్ళాం' 'నీ మొగుడు' అనే పదాలను,' చేసుకోకపోతే వీధిన వీధి, అనే బెదిరింపులను పెద్దరికం పేరిట రంగరించి పోసి అసమర్థులుగా తయారు చేశారు కన్నవారు....

అన్యాయమే. కాని పెద్దరికపు ఆధిపత్యాన్ని కాదనగల్గాలి— యిలాంటి విషయాలలో. 'అవ్వాకావాలి, బువ్వాకావాలి' అనే ధోరణికి స్వస్తిచెప్పి పెద్దల ఆస్తిపాస్తుల కంసిడరేషనులో పడిపోకుండా వుండాలంటే— మగవాడు ఆర్థికంగా ఎవరిమీదా ఆధారపడకుండా వుండాలి. ఆడపిల్ల కనీసపు విద్యార్హతలు కల్గివుండాలి.

డి. ఆర్. ఎల్. రాయదుర్గం

మగవాడు ఎన్ని తప్పులు చేసినా క్షమించ మంటుంది. లోకం. అదే ఆడది తప్పుచేస్తే క్షమించలేదు ఎందుచేత?

ప్రకృతి ఆడదానిపైపై తరాల బాధ్యత పెట్టింది. అందుకు.

డి. డి. ఎ. ఆర్ పల్లిసారథి (?)

నేను ఒక అమ్మాయిని ప్రేమించదలచితిని. ప్రేమించడము ఎలా? వివరముగా తెలపండి.

ఈ రోజుల్లో వస్తున్న ఏ తెలుగు మళయాళీ చిత్రాన్ని చూసినా పాటలొస్తాయికదా తమ్ముడూ, మళ్లీ పోస్టల్ ట్యూషన్ దేనికి?!

ఎస్ యి. ఎస్ ఆర్ హొస్పేట

మానవాతీతమైన శక్తులను నమ్మి వారిపై అలాంటి శక్తులున్నాయని చెప్పుకొనే బాబాలు, స్వాములపై మీ అభిప్రాయం?

ప్రత్యేకించి ఏం లేదు. నేనే స్వామిని బాబాని ఎప్పుడూ కొలిచి ఎరుగను! అటు దేవుడూ, ఇటు మనిషికాని వాళ్ళ నెందుకు నమ్మడం?!

పి. వి. చంద్రపూరు

"ప్రేమకు లేదొక అర్థము. ప్రేమించని బ్రతుకే వ్యర్థము. ఇది ఎంతవరకు నిజం?

అక్షరాలా నిజం. నిజం. ఇదితమ్ములను మానం తలలెక్కలాంటిది! ప్రేమలో పడితే గాని తెలియదు. తీరా పడ్డాక— ప్రమాదమని తెలిసి ప్రయోజనం వుండదు!

శేషయ్య శిష్యరికం

గండు సుబ్రహ్మణ్య దీక్షితులు



శ్రీసూక్తమూ, పురుషసూక్తమూ పారాయణ అయిపోయి, సౌందర్యలహరి శ్లోకాలు పాడటంలో లీనమయ్యాడు కంఠాత్మకశాస్త్రి. తొడల మీదికి పంచె ఎగగట్టి, జంధ్యాల దారానికి పురి పెడుతూ అతను తన పెంకుటింటి వసారాలో పని చేస్తున్నాడు. పొద్దున్నే అభ్యంగన స్నానమూ, సంధ్యావందనమూ అయిపోయాయనే విషయాన్ని అతని నుదుటి మీద, రొమ్ముమీద మెరుస్తున్న విభూతి రేఖలే చెపుతున్నాయి. అతని పౌరోహిత్యం కింద ఉన్న పదిహేను, ఇరవై ఊళ్ళల్లోనూ ఆనాడు అతను చేయించవలసిన శుభకార్యం ఏదీ లేకపోవటంచేత అతను తీరుబాటుగా జంధ్యాలు వడకటంలో నిమగ్నమయ్యాడు.

వీధి తలుపులు తోసుకుని పదిహేను, పదహారేళ్ళ కుర్రాడొకడు లోపలికొచ్చాడు. నిక్కరు, చొక్కా, పైమీద తుండులతో ఉన్నాడతను. మొహంలో బ్రహ్మవర్చస్సు తొంగి చూస్తోంది. వసారా దగ్గరకొచ్చి కంఠాత్మకశాస్త్రి నుద్దేశించి "నమస్కారమండి" అన్నాడు.

శాస్త్రి, "ఎవరు నాయనా, ఏం కావాలి ?" అన్నాడు.

"మాది కామవరపుకోటండి. పద్మనాభ శాస్త్రిగారబ్బాయిని - నన్ను శేషయ్యంటారండి"

"ఏ పద్మనాభ శాస్త్రిగారు ? ... సరేలే. వచ్చి అట్టా చాపమీద కూర్చో."

శేషయ్య బెరుగ్గా వెళ్ళి వసారాలో తాటాకుల చాప మీద తలవంచుకుని కూర్చున్నాడు. రెండు నిముషాల తర్వాత శాస్త్రి, "ఏం కావాలో చెప్పు నాయనా" అన్నాడు.

వేళ్ళు నలుపుతున్నట్లు శేషయ్య అన్నాడు: "మాది ఏమీ లేని కుటుంబమండి. మా నాన్నగారు నా చిన్నప్పుడే పోయారు. ఊళ్ళోవాళ్ళ సహాయంతో మా పెదనాన్నగారు ఎట్లాగో నన్ను పది దాకా చదివించారు. ఇంక చదివించలేనంటున్నారు. నా కింద ఇంక ఇద్దరు తమ్ముళ్ళూ, ఒక చెల్లీ ఉన్నారండి. మేము బతకటానికి నేను పౌరోహిత్యం చెయ్యటం తప్ప ఇంకో మార్గం నాకు కనిపించడం లేదండి. మీరు గొప్ప పండితులనీ, నియమనిష్ఠలతో పౌరోహిత్యం చేసేవారనీ మా పెదనాన్నగారు చెప్పారు. ఆ మంత్రాలు మీ దగ్గర నేర్చుకోవాలని నాకు కోరికగ వుంది. అది అడగాలనే వచ్చాను."

శాస్త్రి నవ్వాడు అన్నాడు: "పౌరోహిత్యం నేర్చుకుంటావా నాయనా! అది ఎంత ప్రమాదకరమైన వృత్తో తెలుసా? మంత్రాలు ఉచ్చరించడంలోనూ, తంతు నడిపించటంలోనూ తెలిసో తెలియకో నువ్వు చేసే తప్పులకే కాక, యజమాని చేసే తప్పులకు కూడా నువ్వే బాధ్యుడవు. నువ్వు వెరసి పాపం మొత్తం నీకే సంక్రమిస్తుంది. ఎన్నో నీతి నియమాలతో జీవిస్తేనే కాని ఈ వృత్తిలో నెగ్గుకురావటం కష్టం. సాధారణంగా ఈ వృత్తిలో వున్నవాళ్ళకు వంశాల విలువ్వ నాయనా! మీ పెదనాయనగారు నిన్నెట్లా ప్రోత్సహించారో ఆయనకే తెలియాలి! ఏ చిన్నదో ఒక ఉద్యోగమే నీకు మంచిది."

"పదో క్లాసుకు వచ్చే ఉద్యోగాలన్నీ ఇతర కులాలవాళ్ళకే రిజర్వేషన్ చేస్తున్నారు కదండీ! నాకెట్లా వస్తుందండీ ఉద్యోగం?"

శాస్త్రి విస్తుపోయాడు: "దేశంలో ఏం జరగనున్నదో ఆ పరమేశ్వరుడికే తెలియాలి!.. ఆఁ, చూడబోతే తెలివిగలవాడివిలాగా కనిపిస్తున్నావు. నీకు ఈ వృత్తి మాత్రం మంచిది కాదు బాబూ!"

"మంచిదో చెడ్డదో, నాకు ఇది తప్ప వేరే గతి లేదండి. ఇదయినా ఈ ఊళ్ళో మా దూరపు బంధువులున్నారు కాబట్టి, వాళ్ళింట్లో ఉండి మీదగ్గర చదువుకోగలను

శేషయ్య శిష్యరికం

కావి. ఇంకో ఊరు, ఇంకో ఊరయితే నాకీ అవకాశం కూడా ఉండేది కాదు.''

గొంతులో వినుగు ధ్వనించగా శాస్త్రి అన్నాడు: ''ఇంత చెప్పినా నీ పట్టే పట్టుంటావేమిటి? అసలింకో ముఖ్య విషయం ఉంది. ఈ పెద్ద మంత్రాల ఉచ్చారణా అవీ సరిగ్గా రావాలంటే ముందు అమరకోశం, శబ్దమంజరీ క్షుణ్ణంగా రావాలి, తెలిసా?''

''అమరం కొంతా, శబ్దమంజరి కొంతా, రామాయణ సంగ్రహం పూర్తిగానూ మా పెదనాన్నగారు నాకు చెప్పారండి.''

శాస్త్రి శేషయ్య వైపు చురుగ్గా చూసాడు నారం పురెక్కిస్తూనే అన్నాడు: 'అసలు నువ్వు ముందర మూడు పూటలా సంధ్యావందనం చేసేవాడివి అవ్వాలి. అది కూడా స్వరంతో రావాలి.''

''మూడు పూటలా చేస్తానండి. కానీ, స్వరం చెప్పుకోలేదండి.''

''అసలు తప్పుల్లేకుండ వచ్చునవి హోవిూ ఏమిటయ్యా?... ఏదీ, మధ్యాహ్నంవేళ సూర్యుడికి అర్ఘ్యప్రదానం ఇచ్చే మంత్రం ఒక్క గుక్కలో చెప్పు!''

''కాళ్ళు కడుక్కొని రావాలి గదండీ!''

''సరే. అదిగో నీళ్ళు''

శేషయ్య కిందకి దిగి వెళ్ళి తొట్టెలో నీళ్లతో కాళ్ళూ కళ్ళూ కడుక్కొచ్చాడు తుండుతో తుడుచుకొని బాసిక పట్టు వేసుకొని కూర్చున్నాడు. మంత్రం చెప్పాడు. మెచ్చుకోలు కోసం ఆశగ శాస్త్రి వైపు చూస్తూ ''తప్పులున్నాయాండీ?'' అన్నాడు.

శాస్త్రి, తప్పుదన్నట్లు మొహం పెట్టి, ''ఊఁ, ఏదో చెప్పావులే ఎన్ని చెప్పినా నువ్వు ఇంకో వృత్తి చూసుకోవటమే మంచిది'' అన్నాడు. దారానికి పురెయ్యటం అయిపోగా, పంచె అంచులు కిందికి జార్చి కదురుతో ఇంట్లోకి వెళ్ళబోయాడు

శేషయ్య హఠాత్తుగా లేచి వెళ్ళి శాస్త్రి కాళ్ళు పట్టుకున్నాడు. ''గురువుగారూ, నాకు స్మార్తం చెప్పండి. వీరు ఎట్లా చెబితే అట్లా చదువుకుంటానండి. మా ఇంట్లో ఇప్పటికే పస్తులు పడుకుంటున్నామండీ నేను తొందరగా సంపాదించక పోతే అందరం చచ్చిపోతామండి... ఏమండి ...'' శేషయ్య గొంతు గద్గదికమయింది.

శాస్త్రి కుర్రాడి మొహంలోకి చురుగ్గా చూసాడు. నాలుగైదు క్షణాలు ఆగి అన్నాడు. ''డబ్బు గిట్టుబాటు తక్కువ. పాపం గిట్టుబాటు ఎక్కువ. వచ్చి వచ్చి ఈ రొంపిలో పడతానంటావేమిట్రా నాయనా! ... సరే, పై ఆదివారం నీ పెదనాన్నతో వచ్చి కనిపించు. పో!'' శాస్త్రి లోపలికి వెళ్ళిపోయాడు

శేషయ్య, ''అట్లాగేనండి'' అని పై తుండుతో కళ్ళు ఒత్తుకుంటూ బయటికి నడిచాడు

*   *   *

పై ఆదివారం శేషయ్య రాలేదు. ఆ తర్వాత వారానికిగ్గాని అతను కంఠార్క శాస్త్రిని కలవటం జరగలేదు ఆ కలవటం కూడా శాస్త్రి ఎక్కడెక్కడో తిరిగి తిరిగి వచ్చి, స్నానంచేసి, జపం చేసుకుని, సరిగ్గా భోజనానికి కూర్చోబోయే సమయంలో జరిగింది. ఎండనపడి వచ్చిన విసుగూ, కడుపులో ఆకలీ– ఈ రెండింటి తాలూకు బాధనీ శేషయ్య మీద ఒక్కుమ్మడిగా కుమ్మరించాడు శాస్త్రి: ''బుద్ధిహీనుడా, నీ ఇష్టంవచ్చినప్పుడు రావటానికి ఇదేమన్నా నాటకశాల అనుకున్నావా? మీ పెదనాన్నతో పోయిన ఆదివారం రమ్మంటే ఇవాళ ఒక్కడివీ ఊపుకుంటూ వచ్చావా! చెప్పిన పని చెప్పినట్టు చెయ్యటమనే చిన్న నియమాన్ని పాటించలేని వాడివి రేపు వృత్తిలో పెద్దపెద్ద నియమాల్ని ఎట్లా పాటిస్తావు? వృత్తి గౌరవాన్ని ఎట్లా కాపాడతావు? పరీక్షలో ఓడావు పో! ఇక నేను చెప్పనూ లేను నీకది రానూ రాదు'

శేషయ్య దిమ్మరపోయాడు. కొన్ని క్షణాలు అట్లా చూస్తూ ఉండిపోయి చివరకు నూతిలోంచి మాట్లాడుతున్నట్లు అన్నాడు: ''క్షమించండి – నేను వద్దామని ఎంతో ప్రయత్నం చేసానండి. కాని మా పెదనాన్నగారికి హఠాత్తుగా జ్వరం వచ్చి మంచంలో పడటంచేత అప్పట్నుంచీ ఇంత వరకూ ఇల్లు కదల్లేక పోయానండి. ఇవాళ కూడ నేను రాగలిగే పరిస్థితి కాదండి కాని మీరు నా గురించి ఇంకోవిధంగ అనుకుంటారేమోనని వచ్చానండి.'' అతని గొంతులో ఏడుపుజీర ధ్వనించింది

''ఉద్ధరించకపోయావ్! వెళ్ళు, వెళ్ళు!'' శాస్త్రి గిరుక్కున వెనక్కు తిరిగి ఇంట్లోకి వెళబోయాడు.

ఇంతలో, 'నమస్కారమండీ, పంతులు గారూ!'' అన్న మాటలు విని శాస్త్రి వెనక్కు తిరిగాడు. ''ఓహో నువ్వుటయ్యా, వెంకటరెడ్డీ!.. నేను పెట్టిన ముహూర్తానికి నీ వియ్యంకుడు ఒప్పుకున్నట్టేనా?''

ఆ వచ్చిన వెంకటరెడ్డి చేతులుజోడిస్తూ, ''చిత్తం. చిత్తం. తమరు ముహూర్తం పెట్టటమేంటి. అల్లు ఒప్పుకోకపోట మేంటి! తమరి ఆశీర్వాదంవల్ల ఇంతవరకూ అన్నీ సానుకూల పడ్డాయండి. శుభలేక వేయించటమే ఆలీసమండి. పెళ్ళిసంబారాలు కూడా ఏయేంగావాలో రాసిస్తే అన్నీ ఈ యేళే కొనుక్కెళ్ళిపోతానండి. మరి యేం గావాలన్నా ఈ ఊళ్ళోనే కొనుక్కోవాలిగాని. మా ఊళ్ళో దొరకవు గదండి''

''సరేరా, కూర్చో. విస్తరి వంపించాకనే భోంచేస్తాను,'' అంటూ శాస్త్రి ఇంట్లో నుంచి పెన్నూ, కాగితమూ తెచ్చుకొని గబ గబా వస్తువుల జాబితా రాసేసి రెడ్డి కిచ్చాడు. ''పుల్లయ్యగారి కొట్లో కెళ్ళి నేను చెప్పానని చెప్పు. అన్నీ ఒకటోరకంవి ఇస్తాడు'' అన్నాడు.

జాబితా అందుకొని రెడ్డి లేచాడు. అన్నాడు: ''అయ్యా. వచ్చేనెల రెండో శుక్రవారం రాత్రికి పెళ్లి కనక మధ్నాళకే

కాబరే

గాలి
వెస్టర్న్ మ్యూజిక్
హోరెత్తిస్తుంటే–
చెట్లు
గుడ్డలూడదీసుకొని
నాట్యం చేస్తుంటే–
సిగ్గుపడిన చంద్రుడు
మేఘాల చాటున
దాక్కుంటుంటే–
ప్రకృతి
అవహేళన చేస్తోంది
ఆకాశం
మౌనంగా నవ్వుకుంది
అచ్చం
భారతీయ సంస్కృతిలా !!!

— రామసూరం.

తవరికోసం మా ఎడ్లబండి పంపిస్తానండి. మా వూళ్లో పోస్టు పంతులుగారింట్లో తవరికి సొంత వంటకి ఏర్పాటు చేస్తానండి తవరొచ్చి, ఆ రాత్రికి మా యబ్బాయికి పెళ్ళి చేయించి, ఆ మర్నాటి కూడా అక్కడే వొండుకొని తిని, నన్నూ మా యావిడ్నీ సంతోష పెట్టాల!"

"ముహూర్తం పెట్టమన్నావు, పెట్టాను. చేయించటానికి ఇంకెవర్నయినా తీసికెళ్లగూడదుటయ్యా! నేనే కావాలా?"

"అహాహా, అట్టా అంటే కుదర్దండి పంతులుగారు తవరు సాక్షాత్తు బ్రహ్మం గారే. తవరే రావాల, నా కొడుకు పెళ్లి చేయించాల! నా వొంశం బిడ్డ బిడ్డ తరాన పచ్చగా సాగిపోవాల! అసలు మీరు మంత్రం చెబుతా ఉంటే సంగీతం విన్నట్టుగాదండి! సదూరాని నాకూడా అంతా అర్థం అయినట్టే ఉంటాది గాదండి! తవర్లో ఎంత మహత్యం లేకపోతే ఈ చుట్టుపట్ల యిరవై వూళ్ళోళ్ళందరూ పెళ్లి పనికి తవర్నే పిలుస్తారండి! తవరికిప్పుడీల్లేకపోతే, యియాల యిప్పుడే వొచ్చి పెళ్లిచేయిచ్చండి... అమ్మమ్మ. తవ్వరాకపోతే కుదర్దండోయ్!"

"ఓరి నీ అసాధ్యం గూలా, ఎంత పట్టు పట్టావయ్యా! మొత్తానికి పెద్దరెడ్డివని పించుకున్నావు. సర్లే వస్తాన్లే."

"చిత్తం, మరయితె యెళ్ళొస్తానండి"— రెడ్డి వెళ్లబోయి, పక్కనున్న శేషయ్యవైపు చూస్తూ "యీయనెవరండి పంతులుగారూ?" అన్నాడు

"అతనా, బ్రాహ్మల బ్బాయే లే. మంత్రాలు నేర్చుకోటానికి వచ్చాడు."

"మంచి గురూగార్ని పట్టావులేవయ్యా పంతులూ?.. మరయితే యెళ్ళొస్తానండి"— వెంకటరెడ్డి వేవేగంగా బయటికి నడిచాడు.

శాస్త్రి, లోపలికి వెళ్లబోయినవాడల్లా వెనక్కు తిరిగి, శేషయ్యతో, "చూశావా అబ్బాయీ, బ్రాహ్మల ఇళ్ళల్లో చేయించి నట్టుగ ఇట్లాంటి ఊరి పెద్దల ఇళ్ళల్లో పెళ్ళిళ్ళు చేయించటం కుదర్దు. పామూ చావకూడదు, కర్రా విరగకూడదన్నట్టు, మంత్రలోపం జరక్కుండా, వాళ్లకు విసుగు రాకుండా కార్యం జరిపించాలంటే కత్తిమీద సాము చెయ్యటమే! దీనికి కొంత లౌక్యం కూడా అవసరం. చూడబోతే నీకు తెలివైతే ఉందిగానీ, లౌక్యం తక్కువల్లే ఉంది. పైగా ఇంగ్లీషు ముక్కలు చదివానన్నావు, ఈ మంత్రం ముక్కలు నీకు నోరు తిరుగుతాయా? నాలుగు అమరం శ్లోకాలూ, సంధ్యా వందనమూ రాగానే సరిపోతుందా? వెళ్ళు నాయనా వెళ్ళు. నువ్వు ఈ వృత్తిలో నెగ్గుకు రాలేవు. దొరికిందేదో ఒక ఉద్యోగమే నీకు మంచిది. మళ్లీ ఎన్నడూ ఈ విషయమై నా దగ్గరకు రాకు!"— శాస్త్రి లోపలికి వెళ్ళిపోయాడు.

దిగాలు పులుముకుని వడిలిపోయిన మొహంతో శేషయ్య వీధిలోనికి నడిచాడు.

* * *

శుక్రవారం ఇంకా రెండు రోజులున్న దనగా కంతార్కశాస్త్రి భార్యకు హఠాత్తుగా పక్షవాతం వచ్చి ఆమె మంచాన పడింది. శాస్త్రి కూతుళ్ల కుటుంబాలు దూర ప్రాంతాల్లో ఉన్న కారణంగా, అతనే దగ్గరుండి ఆవిడకు సేవలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది పరామర్శకోసం వచ్చేపోయే వాళ్ళతో ఇల్లు నిండిపోసాగింది ఈ హడావుడి కంగారుల్లో శాస్త్రి, వెంకటరెడ్డి ఇంట్లో పెళ్లివిషయం మరిచేపోయాడు.

సరిగ్గా శుక్రవారంనాడు రెడ్డి పంపిన ఎడ్లబండివచ్చి వాకిట్లో నిలిచే సమయానికి, శాస్త్రి భార్య అవసాన దశకు చేరుకుంది శాస్త్రి, పుట్టెడు దుఃఖంలో భార్య మంచం పక్కన కూర్చొనున్నాడు.

ఎవరో లోపలికి వచ్చి శాస్త్రితో, "మీకోసం రెడ్డిగారు బండి పంపించాడు" అని చెప్పగా, "నేను రాలేనని, ఇంకెవర్నయినా చూసుకోమని చెప్పండి" అన్నాడు శాస్త్రి.

అదే సమయానికి వీధిలో వెళుతున్న శేషయ్య, శాస్త్రి ఇంట్లో జనం గుమిగూడి ఉండటాన్ని చూసి, లోపలికొచ్చి విషయం అర్థం చేసుకున్నాడు. బండివాడితో శాస్త్రి చెప్పమన్న కబుర్ను తాను చెబుతానని ఆ వ్యక్తితో అని, బయటికొచ్చి బండి వాడితో "చూస్తున్నావుగ మా గురువుగారికొచ్చిన కష్టం! ఆయన తన బదులు నన్ను వెళ్లి పెళ్లి చేయించమన్నారు - పదపోదాం!" అన్నాడు.

కొంతసేపటికి, వెంకటరెడ్డి కొడుకు పెళ్లి చేయించే బ్రహ్మగా శేషయ్యను ఎక్కించుకొని ఎడ్లబండి, నాటురోడ్డుమీద సాగిపోతోంది.

* * *


రెండు రోజులు గడిచాయి.

ఆదివారం నాడు "శాస్త్రిగారు అర్జంటుగా రమ్మన్నార"నే కబురందుకొని, శేషయ్య నుంచున్న పళంగావచ్చి శాస్త్రి ఎదుట వాలాడు.

అక్కడ శాస్త్రి పక్కన చాపమీద పావు మూట బియ్యమూ, బుట్టెడు కూరగాయలూ, కొత్త పంచెలచాపూ, ఆ చాపు మడతలో యాభై రూపాయల నోట్లూ ఉన్నాయి శాస్త్రి మొహంలో కోపం తాండవిస్తోంది. కళ్ళు ఎరుపెక్కిపోయి ఉన్నాయి.

శేషయ్య నమస్కారం పెట్టాడు.

శాస్త్రి: "దొంగ నమస్కారాలకేంలే,



ముందిది చెప్పు... నేను పంపించానని చెప్పి వెళ్లి మళ్ళ చేయించావటగా పెళ్ళి?''

శేషయ్య: "అవునండి."

శాస్త్రి: (కోపాన్ని అణుచుకుంటూ) "నీకు విశ్వేశ్వరపూజే రాదన్నావే, పెళ్లి ఎట్లా చేయించావు?"

శేషయ్య: "మా నాన్నగారు నాకు నేర్పిన స్తోత్రాలూ, అష్టకాలూ చదివానండి. నాకొచ్చిన అమరం శ్లోకాలు కూడా వాడానండి. నా నోటికొచ్చింది చదువుతూ, చేతికొచ్చింది చేయిస్తూ, మూడు ముళ్లూ వేయించానండి."

శాస్త్రి: (ఆవేశంగా) "అంటే నీకొచ్చిన శ్లోకాల్ని, 'అహం, ఉహుం' శబ్దాల్తో ముక్కుతో పలికి మంత్రాలుగా చెలామణీ చేసేసావన్నమాట! అక్కడున్న యావన్మంది జనానికీ ముసుగుకప్పి మోసం చేసేసావన్నమాట! ఇదంతా తప్పని తెలిసేచేసావా?'

శేషయ్య: "అవును తెలిసే చేసాను."

శేషయ్య గొంతులో మనిషి దెబ్బతిన్న ఛాయలు తొంగి చూస్తున్నాయి. శాస్త్రి కోపం కక్కాడు. అన్నాడు:

"ఒరి అప్రాచ్యుడా! నీ వంశం, దాని పచ్చదనం సంగతి అట్లా ఉంచు. నీమటుకు నువ్వు బతికి బట్ట కట్టదలుచుకోలేదా మిత్రా? నువ్వు పత్తికట్ట సవారీ ఎక్కేం తర్వాత ఏ రౌరవంలోకి వెళతావో తెలీదు కానీ, నువు చేసింది దౌర్భాగ్యపు పని అని

శేషయ్య శిష్యరికం

పదిమందికీ తెలిస్తే మాత్రం నీకు ఈ భూమ్మీదనే పుట్టగతులుండవు. నీకేకాదు భూమ్మీద పౌరోహిత్యం చేసే ఏ బ్రాహ్మడికీ ఉండవు! అనేక కారణాలవల్ల పరమ పవిత్రమైన ఈ వృత్తి ఇప్పటికే మళ్ళీ తేలిగ్గా కోలుకోలేనంతగా, తగలబడిపోయింది. దానికి ఏ కొంచెమయినా గౌరవప్రపత్తులు జనంలో ఇంకా ఉన్నాయంటే, ఆ కాస్తీ మంటగలిపి పోవటానికి నీవంటివాళ్లు కొంత దోహదం చేస్తున్నారు. ఎంతపని చేసావురా చండాలుడా!.. అసలయినా ఎవరూ పిలవకుండా నువ్వు వెళ్ళటమేమిటి? నా పేరు చెప్పటమేమిటి? నిన్ను, నిన్ను. నిన్నసలు ఏం చేసినా పాపం లేదురా భ్రష్టుడా!"

అసలే ఎర్రగా ఉండే శాస్త్రి మొహం కోపంతో ఇప్పుడు ప్రభాత కాలంలోని తూర్పుదిక్కయి పోయింది. ఆవేశంతో ఊగిపోతూ అతను వసారాలో అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు ఉండి. ఉండి మళ్లీ అన్నాడు: "అసలు, పందిట్లో పట్టుబడి ఉంటే ఏం చేసేవాడివి?"

"వదలకుండా శిక్ష అనుభవించేవాడిని. ఇతరుల దోషాలు పోగొట్టాలని నేను చేసే ప్రయత్నంలో దోషముందని ఆ ఇతరులే అనుకుంటే నేనేం చెయ్యగలనండి?"

"ఇతరుల దోషాలా, ఏమిటవి?" శాస్త్రి గొంతులో కోపం తగ్గింది.

'అవునండీ. మీరు వెళ్ళి పెళ్లి చేయిస్తానని మాట ఇచ్చారు. ఆఖరుక్షణంలో వెళ్లలేనన్నారు. ఆ విధంగా పీటలమీద పెళ్లి ఆగిపోవటమనే దోషం మిమ్మల్ని చుట్టుకుంటోందిగదా? పైగా పెళ్లి అట్లా ఆగిపోయే ఉంటే, పాపం, వెంకటరెడ్డి ఎంత తల్లడిల్లి పోయేవాడు! అంతేకాదు, మీ పట్ల అతనికి గల గౌరవం తగ్గి అతను మిమ్మల్ని నిందించటమనే దోషానికి ఒడిగట్టేవాడు కూడా గద! ఈ రెండు దోషాల్నీ నివారించగలిగితే, నేను చెయ్యబోయేది పెద్ద దోషం కాదనే నిర్ణయానికి వచ్చాను. నేను వెళ్ళి మంత్రాలే చదివానో, ఇంకేం చదివానో! కాని వెంకటరెడ్డికీ, అతని బంధువర్గానికీ తృప్తిగా మాత్రం శుభకార్యం పూర్తి చేయించినవాణ్నయ్యాను. వాళ్ళు నన్ను 'గురువుకు తగ్గ శిష్యుడవ'న్నారు. ఇప్పుడందుకున్న దక్షిణలన్నీ వాళ్ళు నా చేతికిచ్చి మీకు పంపిస్తామన్నారు. నేను పుచ్చుకోలేదు. ఆ విషయం మీకు తెలిసే ఉంటుంది... ఇప్పుడు చెప్పండి గురువుగారూ, రెండు పెద్ద దోషాల్ని నివారించటం కోసం ఒక చిన్న దోషాన్ని- అది దోషమనే విషయం మీకూ నాకూ మాత్రమే తెలుసు. వాళ్లెవ్వరికీ ఈ రకమైన ఆలోచనే అసలేదు- ఆచరించటం తప్పంటారా? తప్పే అయితే ఆ ఫలితం అనుభవించటానికి నేను సిద్ధంగా ఉన్నానండి!"

కంఠార్యశాస్త్రి నిశ్శబ్దుడై శేషయ్య మొహంలోకి తీక్షణంగా చూస్తూ ఉండిపోయాడు. క్రమంగా మొహంలో ప్రసన్నత చోటు చేసుకుంటూండగా అన్నాడు:

"చూడబోతే నా గౌరవం కాపాడబడటం కన్నా, నీకు వెంకటరెడ్డి ఇంట్లో పెళ్ళి ఆగకుండా సాగిపోవాలన్నదే ముఖ్యంగా కనిపిస్తోందే!"

శేషయ్య తల వంచుకున్నాడు. నెమ్మదిగా అన్నాడు: "అవున్నండి. దారి చూపవలసిన వాళ్లే మాట తప్పితే, వెంకటరెడ్డి వంటి అనాగరికుల పరిస్థితి ఏమికానండి?"

"సరే కష్టాల్లో ఉన్నవాళ్ళను ఆదుకోవటమనే లక్షణం నీలో ఉంది. సంతోషం. ఇప్పుడీ దక్షిణలో నీ వాటా నువ్వు తీసుకో. డబ్బు సగం, ధాన్యం సగం,..."



ధర్మపథం

సంకల్పసిద్ధి

పుణ్య స్థలాలు దర్శించినా, పవిత్ర నదీ జలాలతో స్నానం చేసినా పుణ్యం లభిస్తుందనీ, దానివల్ల ఉత్తమ గతులను పొందవచ్చుననీ పారలౌకికాసక్తి ఉన్నవారి అభిప్రాయం. అందువల్లనే అట్టివారు సంసారంలో మునుగుతూ తేలుతూ ఉన్నా, ఏదో అవకాశం కల్పించుకొని పుణ్యక్షేత్రాలు సేవించి కొంతవరకూ సంతృప్తి పడతారు. కొందరికి అట్టి అవకాశం దొరకదు. మనస్సులో దృఢమైన సంకల్పం ఉన్నప్పుడు అది సఫలం కాకపోయినా సఫలమైనట్లే భావించాలని చెప్తారు. ఉదాహరణకు ఒక శ్లోకం

''అహం కాశీం గమిష్యామి
తత్రైవ నివసామ్యహమ్,
ఇతి బ్రువాణః సతతం
కాశీవాస ఫలం లభేత్.''

''నేను కాశీకి వెళ్ళగలను. అక్కడనే నివసించగలను'' అనే కోరికతో ఎప్పుడూ అనుకునేవాడు- ''తన కోరిక నెరవేరకపోయినా కాశీవాస ఫలాన్ని పొందుతాడు'' అని దీని అభిప్రాయం. అట్టి సంకల్పం ఉన్నవారికి నిరాశనూ, నిరుత్సాహాన్నీ కల్గించకుండా ఉండడానికి దీన్ని చెప్పి ఉండవచ్చు.

ఒక గృహస్థు సంసార బాధల నుండి తప్పించుకొని తీర్థయాత్రవల్ల కొంత మనశ్శాంతిని, పుణ్యాన్ని సంపాదించ దలచి, ఎలాగో శ్రమపడి కొంత డబ్బు చేర్చుకుని ప్రయాణానికి సిద్ధమయేవాడు. మంచి ముహూర్తం కూడా నిర్ణయించుకునేవాడు. కాని ప్రతిసారీ ఏదో ఒక ఆటంకం ఇంట్లో ప్రసవమో, శుభకార్యమో, రోగమో - ఏదో ఒకటి సంభవించి ప్రయాణం ఆగిపోతూ ఉండేది. అతని మనస్సు కెంతో కష్టమనిపించేది. ఆతురత అధికమయ్యేది. ఏమయినా సరే మర్నాడు ప్రయాణమై తీరుతానని ఒకసారి దృఢంగా నిశ్చయించుకొని, సర్వసన్నాహాలూ చేసుకుని రాత్రి నిద్రపోయాడు.

ఆ రాత్రి స్వప్నంలో తాను కాశీకి వెళ్ళినట్లు, గంగలో స్నానం చేసి, విశ్వేశ్వరుని గుడికి పోయి మహాదేవుని దర్శించినట్లు కనబడింది. కలలోనే ఇది స్వప్నమేమో అనే సందేహం కలిగింది. కాని గుడి గంటల చెవుల్లో ప్రతిధ్వనిస్తుండగా స్వప్నం అనుకోవడమెలా అని తీర్మానించుకున్నాడు. ప్రయాగలో త్రివేణీ సంగమంలో మునిగాడు. గయలో విష్ణుపాదాల్ని చూశాడు. మెలకువ వచ్చేసరికి తెల్లవారుతున్నది. అంతా స్వప్నమే అని తెలిసింది.

అయినా అతనికి సంతృప్తిగాని అసంతృప్తి కల్గలేదు.

ఏదో ఆటంకంవల్ల మరి ప్రయాణం కుదరలేదు.

''ఏ ఆటంకాలూ ఏమేమి చేస్తాయి? నా సంకల్పం నెరవేరనే నెరవేరింది'' అని అనుకుని నిర్వికారంగానే ఉన్నాడు. సంకల్పమే అతనికి సంతృప్తి కల్గించినది.

—బులుసు వెంకటరమణయ్య

''క్షమించండిగురువుగారూ! మీరన్నట్లు ముఖ్యంగా వెంకటరెడ్డి కోసమే నేను వెళ్ళినా, అంతా మీ పేరుమీదనే నిర్వహించాను కనక ఇందులో నాకు చెందవలసిందేమీలేదు. అన్నట్టు... అమ్మగారి కెట్లా ఉందండి?''

''తగ్గిందిలే... మీ పెదనాన్నగారికెట్లా ఉంది?''

''ఆయన పోయారండి. ఆయనకు కొడుకులున్నారు కానీ, వాళ్ళకు ఏ చదువూ రాదండి ఆయన కుటుంబ భారం కూడా నా నెత్తినే పడిందండి.''

''అరెరె! . మరి ఇంక మీ కిప్పుడు ఆధారమేమిటి?''

''ఇదిగో ఈ రాగిచెంబు'' శేషయ్య తను కప్పుకున్న తుండు కిందనుంచి ఒక రాగి చెంబు తీసి చూపించాడు. గొంతు గద్గదికమవ్వగా అన్నాడు : ''ఊళ్ళో వాళ్ళంతా చల్లగా ఉండాలే గానీ, నాకు రోజుకో చెంబుడు బియ్యం భిక్ష దొరకదంటారా? వెళ్ళొస్తానండి బాబుగారూ ఇప్పటికే ఒక్క వీధికూడా అవ్వలేదు'' శేషయ్య వసారా మెట్లు దిగి వీధి గుమ్మంవైపు నడిచాడు.

శేషయ్య వీధి గుమ్మాన్ని చేరే అయిదారు క్షణాల్లో శాస్త్రి ముఖ కవళికలు కూడా అయిదారు రకాలుగా మారాయి.

తొందరగా ఒక నిశ్చయాని కొచ్చేశాడు కంఠాభొట్ల శాస్త్రి.

కంగారుగా. ఆత్మీయత నిండిన గొంతుతో అన్నాడు : 'వెళ్ళకు నాయనా వెళకు. పట్టుదల, త్యాగబుద్ధి, లౌక్యం, దోషాదోష విచక్షణ వగైరా, ఒక మంచి పురోహితుడి కుండవలసిన, లక్షణాలన్నింటినీ నీలో నేను చూస్తున్నాను. నువ్వు ఆయుస్సులో అల్పుడవైనా, అదర్శంలో అధికుడివి మగ సంతానంలేని నేను, నా తర్వాత వాణ్ణిగా సమాజానికి ఎవర్ని అప్పజెప్పటమా అని ఇన్నాళ్ళుగా మథన పడుతున్నాను. ఇన్నాళ్ళకు నువ్వు దొరికావు. రా నాయనా, రా నా విద్యనంతా నీకు ధారపోసి, నన్ను మించినవాణ్ణి చేస్తాను. అంతే గురుదక్షిణ ఉంది సుమా! జీవించటం కోసమే వృత్తి చెయ్యటం కాకుండా, ఎట్టి వర్ణభేదమూ పాటించకుండా సమాజంలోని అన్నివర్ణాల వారికీ సమంగా హితం కోరుతూ, నీ చేతనైనంతగా అందరిలోనూ ధర్మానురక్తిని కలిగిస్తూ, ఎంత గౌరవాన్నయితే ఈ వృత్తికి సంపాదించి పెట్టగలవో, అదంతా నాకు గురుదక్షిణే నాయనా! చూస్తాను, నా ఋణం తీర్చుకోవటానికి ఎంత చెల్లింపు చేస్తావో,...అట్లా ఆశ్చర్యపోతూ నిలబడి పోయావే? రా నాయనా, రా. కాళ్ళు కడుక్కొనికూర్చో. ఆచమించు. ఇప్పుడే ప్రారంభిద్దాం...''

* * *

''ఓం సహనా వవతు, సహ నౌ భునక్తు .. శాంతిః శాంతిః శాంతిః'' - పదినిముషాల తర్వాత, సమాజంలో అంతరిస్తున్న ధార్మిక భావనను జాగృతంచేసి పరిరక్షించటానికై ఒక యువ హృదయానికి ధర్మదీక్ష నివ్వటానికి ఉద్యుక్తుడయ్యాడు ఒక వృద్ధ ధర్మమూర్తి!

పచ్చలహారం పట్టివేత


సింహాచలం ఆలయానికి చెందిన ఒక పచ్చల హారాన్ని దొంగలు ఎత్తుకుపోతే, పోలీసులు నానా తంటాలూ పడి ఎట్టకేలకు దాన్ని పట్టుకున్నారట శ్రీకృష్ణదేవరాయలు ఈ పచ్చల పతకాన్ని ఆ దేవాలయానికి కానుకగా సమర్పించారట. అలనాడు దీని వెల సుమారు సగభై లక్షలు దాటుతుందట ఒక్కో పచ్చ ఖరీదు లక్ష రూపాయలట!

ఆకలి జబ్బు!

"పులిమియా" అనే వ్యాధి వస్తే ఆ వ్యాధి వచ్చిన వారికి ఆకలి విపరీతమై పోతుందట ఇరవై నాలుగు గంటలూ తింటూనే వుంటారట. తినితిని వారి ఒళ్ళు పొంగిన బుడగలా వుబ్బిపోతుందట దాంతో శరీరం ఉబ్బి, గుండె తట్టుకోలేక రక్తపు పోటు వస్తుందట ఆనక యింతే సంగతులట! "నిక్కోలా" అనే 18 ఏళ్ల అమ్మాయికి ఈ జబ్బువచ్చి, తత్ఫలితంగా ఆమె తినగా, తినగా యిప్పుడు 280 పౌన్ల బరువుకు పెరిగిపోయిందట

కాలాన్ని బట్టి కిరాయి

రాజకీయ అల్లరులలో పాల్గొని పోలీసులను రెచ్చగొట్టి జైలుపాలవ్వడానికి ఢిల్లీలో రోజుకు



తలకు యిరవైయ్యయిదు రూపాయలు తీసుకుంటారట ఆ తరహాకు చెందిన గుంపు జనం. వీరి పనికేవలం అల్లరులు చేసి జైలుపాలవ్వడమేనట ఎటొచ్చీ ఈ కాలం చలికాలం కనుక వారు మరి కొంచెం రేటడుగుతున్నారట — పాపం జైల్లో వసతులుండవు కదా మరి!

రేసుకోర్సులో గుండెపోటు

మద్రాసు గుర్రపు పందాలకు ప్రభుత్వానికి సంబంధించిన దుస్తులు కుట్టే చోట పనిచేస్తున్న వేణుగోపాల్ అనే అతను వెళ్ళాడట. తాను వూహించి ఆ గుర్రం మీద డబ్బుకడ్దామనుకుని, డబ్బులులేక వూరుకున్నాడట తీరా ఆ గుర్రమే గెలిచేసరికి అయ్యో, అయ్యో అని అరచి ఆ గుర్రపుపందాల ఆవరణలోనే విలవిలా తన్నుకుని చనిపోయాడట.

బాల్య వివాహాలు

బాల్య వివాహాలు ప్రభుత్వం నిషేధించి చాలా సంవత్సరాలు అయింది. అయినా, దేశంలో బాల్య వివాహాలు పెద్దపెట్టున అవుతూనే వున్నాయి. మార్వార్‌లో ఒకే పందిరిలో సుమారు పదివేల మందికి వివాహాలయ్యాయంటిటీవల. పెళ్ళికూతుళ్ళ సుమారు 14 నుంచి 17 ఏళ్ళ వయసు వాళ్ళేనట. 1965 పాకిస్తాన్ యుద్ధంలోనూ, 1971 బంగ్లాదేశ్ యుద్ధంలోనూ చనిపోయిన జవానుల భార్యలలో చాలామంది 13 నుంచి 15 సంవత్సరాల లోపువారేనట!

ఆటలో సంవత్సరానికి

9 లక్షల డాలర్ల సంపాదన!


అమెరికాలో పీటర్ ఎల్‌వర్డ్ అనే ఆయన బేస్‌బాల్ అనే ఆటలో గొప్పవాడట ఈయన ఈ ఆటలో ఒక సంవత్సరానికి సుమారు తొమ్మిది లక్షల డాలర్లు సంపాదిస్తారట. 37 సంవత్సరాల వయస్సున్న ఈ పీటర్ సంపాదనలో సగం సంపాదించినవారు కూడా లేరట.

రష్యాలో లిప్‌స్టిక్ గిరాకీ!

భారతదేశం "లిప్‌స్టిక్" రష్యాకు ఎగుమతి చేస్తోందట ఇక్కడ ఎనిమిది రూపాయల లెక్కన కొన్న ఒక్కో లిప్‌స్టిక్ అక్కడ మన లెక్కలో నూట పది రూపాయలకు అమ్ముతున్నారట —బాబురో, నూటపదిరూపాయలకా! మరొక్క రూపాయి కూడా చేర్చి అమ్మితే పోయిుండేదికదా!

మానస సరోవరంగా మారిన థేమ్స్ నది

1950వ సంవత్సరం వరకూ లండన్ నగరంలోని థేమ్స్‌నది భయంకరమైన, జుగుప్సాకరమైన వాసనతో లుకలుకలాడేదట. నగరంలోని చెడ్డ నీరంతా యీ నదిలో కలిసేవారట. ఈ నదిని ఉద్ధరించడానికి లండన్ నగరం పథకం వేసి, 1951లో నెరవేర్చిందట. తత్ఫలితంగా యీనది యిప్పుడు మానససరోవరంగా మారిందట. నది ఒడ్డున ఎంచక్కా, జంటగా, ఒంటరిగా కూర్చుని చేపల్ని కూడా పట్టుకోవచ్చునట. ఈ థేమ్స్ నదిని ఉద్ధరించిన పథకం వేసి, నెరవేర్చినాయన పేరు "హాగ్ ఫిప్స్"అట. ●



SAA/AM/1905 TEL

వంటలు

పంచదారతో అరిసెలు

కావలసిన వస్తువులు : బియ్యం శేరు, పంచదార కేజి నెయ్యి లేక డాల్డా, యాలకులు 10 కొంచెం పాలు

చేయు విధము : ఒకరోజు ముందుగా బియ్యం నానబెట్టవలెను అంటే రాత్రికి నానబెట్టవలెను మరునాటి రోజు పొద్దున్నే బియ్యం వడబెట్టి పిండి కొట్టించాలి. పిండి మెత్తని జల్లెడతో జల్లించ వలెను. పిండి ఆరిపోకూడదు కనుక వెంటనే ఆ పిండిలో పంచదార, యాలుకల పొడి వేసి బాగా కలపాలి ముందు పిండి కలిపేటప్పుడు గట్టిగా వుంటుంది కాబట్టి కొంచెం పాల తడి చేసుకోవాలి. మరీ ఎక్కువ తడిచేసుకుంటే జావగా అయిపోతుంది. తడి పిండి మీద పంచదార కలుపుతాము కాబట్టి పాలు కొంచెం తడిచేసుకుంటే చాలు.

20 నిమిషాలు పోయింతరువాత చూస్తే పంచదార కరిగి వుండకే వస్తుంది. తరువాత మూకుడు పొయ్యి మీదపెట్టి నెయ్యివేసి కాగిన తరువాత మనకు కావలసిన సైజులో వుండ చేసి దళసరి బట్ట తీసుకొని తడిచేసి గట్టిగా పిండవలెను. పీటమీద ఆ బట్ట వేసి ఈ ఉండని కావలసిన సైజులో వత్తాలి తీసి బాండీలో వేసి సన్నని సెగమీద కాల్చాలి ఎర్రగా కాలిన అరిసెను తీసి. అరిసెలు ఒత్తే గరిటలతో ఒత్తాలి నేతిలో వండుకుంటాం కాబట్టి మరీ గట్టిగా ఒత్త కూడదు!

చాలా మంది పంచదార పాకం బట్టి చేస్తారు. కాని నేను యిప్పుడు వ్రాసినది పాకం పట్టకుండా చేసేవి. ఈ అరిసెలు చాలా బాగుంటవి పాకం పట్టిన అరిసెల కంటే కూడా చాలా రుచిగా వుంటవి. ఎంత నెయ్యి వుంటే అంత బాగుంటవి.

– సి. శ్యామల

ఉత్తరాలు

సీరియల్

కవనశర్మగారి "ఆకర్షణ — వ్యామోహం" సీరియల్ తెలుగు సాహిత్యంలో ఒక వినూత్న అద్భుత ప్రయోగం. ఈ రచనకు రావలసినంత గుర్తింపు రావడం లేదేమోనని నా అనుమానం. ఇదొక ట్రావెలోగ్ రూపంలో ఉండడమే కారణం కావచ్చు. పూర్తిగా భిన్నమయిన సంస్కృతిలో సగటు భారతీయ దంపతులు ఎదుర్కొనే మానసిక చిక్కులను ఇదివరకు ఎవరూ ఇంతసూక్ష్మంగా విశ్లేషించలేదేమో.

బావా మరదళ్ళ ప్రేమా, పెళ్ళిళ్ళ స్థాయిని దాటి వెళ్ళని మన సాహిత్యం, ఈ రచనతో అస్థిత్వ స్థాయీ దాకా ఎదిగిందని నా భావన. కవనశర్మగారికి జోహార్లు. నడిమింటి ఆనందరావు (విశాఖపట్నం).

శ్రీ కవనశర్మగారి "ఆకర్షణ—వ్యామోహం" సీరియల్ అత్యంత ఉత్సాహముగా సాగింది. స్వదేశీయ మూఢాచారములను, విదేశీయ వ్యామోహములను రచయిత చాలా బాగా చిత్రించి, విమర్శించినారు. ముఖ్యంగా మన విద్యార్థులు కూడ అస్తిత్వవాదుల వలె హింసాహిత ప్రదర్శనల విరసన అలవర్చుకొంటే ఎంతో బాగుంటుంది. గుడ్డిగా విదేశీయమైనదంతా అమోఘమని తలచే వారికి ఈ సీరియల్ కనువిప్పు కాగలదు.

డాక్టరు కె. ఎస్. శివాజీ [ఖమ్మం]

కథలు

12.1.79 ఆంధ్రసచిత్రవారపత్రికలో ప్రచురింపబడిన ఎ. ఆర్ రావ్‌గారి కథ "పాపంమూర్తి" వాస్తవంగా చిత్రించారు. మూర్తిగారికి దొరికిన మంగళసూత్రం తన భార్యదిగా తెలియక ఎ.సెన్ మూర్తిని సస్పెన్స్‌లో ఉంచుంటాలని ఎంతో ఆశించాడు. అంచనాలు వేశాడు. కాని నిజంతెలిసి తన పొరపాటును తను తెలుసుకోగలిగాడు. ఎంత బాధ? ఎంత దురదృష్టం? శ్రీదేవి గారి 'సంగీతం' ద్వారా నన్ను ఆనందసాగరతీరాలకి చేరవేసింది రచయిత్రికి అభినందనలు

వి దయానంద్, [జమిస్తాన్‌పూర్]

* * *

ఆంధ్రసచిత్ర వారపత్రికను రెగ్యులర్‌గా చదివే మీ పాఠకులలో నేనొకణ్ని. వెరైటీ కథలను అందించటములో మీ [మా] అభిమాన ఆంధ్రపత్రికకు పత్రికలలో ప్రథమస్థానము అనుటలో అతిశయోక్తి లేదు. చక్కటి కథలతోపాటు ఇంకా చక్కటి సీరియల్స్‌ను ప్రచురిస్తున్నందుకు మీకు మా అభినందనలు. ఇకముందు కూడా మీ పత్రికలో చక్కటి కథలకే ప్రాధాన్యము ఉంటుందని భావిస్తాను.

అమ్మవ్రోలు వెంకటరమణ బాలసుబ్రహ్మణ్యం [విజయవాడ]

* * *

ఈవారం ఆంధ్రసచిత్రవారపత్రిక అత్యంత మనోహరంగా వుండి, మా కుటుంబమ్మంతటిని అమితానందంలో ముంచెత్తింది. మంచి సీరియల్స్, రమ్యమైన కథలు, సినిమా విశేషాలు తదితర శీర్షికలతో మాకు అందచేస్తున్న పత్రికా సంపాదకవర్గానికి మా కృతజ్ఞతలు. కార్టూన్లను ఇంకా పెంచితే బాగుంటుంది.

పి. వి. రామనాథరావు [మధిర]

అనివార్య కారణాలవలన ఈ సంచిక [9-2-1979] ముద్రణలో కొన్ని మార్పులు చెయ్యవలసి వచ్చింది. పాఠకులు సహృదయంతో గమనించగలరు.

— మేనేజరు

Printed and Published by S. NageswaraRao at the Andhra Patrika Press MallikarjunaRao Street Gandhinagar Vijayawada-3. Editor · S Radhakrishna

ప్రపంచం చాలా చిన్నదే..!

ఎవరేమన్నా 'విపుల' పాఠకులు మాత్రం ఈ విషయాన్ని ఏకగ్రీవంగా ఒప్పుకుంటారు. ఈ సంగతి ఇతరులకన్నా వారికే స్పష్టంగా తెలుసు. వారు ప్రతినెలా 'విపుల' చదువుతూ ప్రపంచాన్ని చుట్టి వస్తూనే ఉన్నారు. ఈ విశాల విశ్వానికి ఉన్న ఎల్లల్ని, భాషా పరిధుల్ని చెరిపివేసి, దూరాల్ని తగ్గించిన విశ్వకథా విపంచి 'విపుల'. రంగుల ఆఫ్ సెట్ ముద్రణలో **132** పేజీల విలువైన 'విపుల' కేవలం **125** పైసలకే మీకు అందుబాటులో ఉంది.

అనేకానేక భారతీయ భాషలనుండి, ప్రపంచ భాషలనుండి సేకరించిన అత్యుత్తమ కథలకు వేదిక విపుల. అనువాదాలు అనిపించని జాను తెలుగులో ప్రతి నెలా విందు చేస్తోంది 'విపుల' మాస పత్రిక.

ప్రతి కథకూ రెండు రంగుల్లో ఆకర్షణీయమైన, భావస్ఫోరక చిత్రాలు మరో ప్రత్యేకత.

కథలు గాక అదనంగా ఎన్నో కార్టూన్లు, జోకులు, విచిత్ర విశ్వ విజ్ఞానం... అన్నీ కలిపి కేవలం **125** పైసలకే అందిస్తోంది 'విపుల' మాస పత్రిక.

విపుల



Marketed By
Margadarsi Marketing
PRIVATE LIMITED
Eenadu Compound, Hyderabad-500 004



ఈ రోజుల్లో తలనొప్పి అంటే మాటలా!

మంచి నొప్పుల నివారిణి సాలోఫేన్‌ను గమనించండి. దీనిలో రెండు మందులు అమోఘంగా
నొప్పులను పోగొట్టేవి చేరివున్నాయి—ఆస్ప్రిన్, ఫెనాసిటిన్—అయినప్పటికీ
వెల మాత్రము 7 పైసలే ఒక మాత్ర. సాలోఫేన్ అతిశీఘ్రంగా,
తలనొప్పులకు జలుబులకు పండ్లనొప్పి, ఫ్లూ జ్వరాలకు
కండలనొప్పులకు ఉపశమనం కలిగిస్తుంది.

సాలోఫేన్ నొప్పుల నివారిణి మాత్రలు—ఏళ్లతరబడి
ఇంటింటా ప్రసిద్ధిపొందిన అమృతాంజన్
లిమిటెడ్ వారి తయారీ-

అమృతాంజన్ లిమిటెడ్ వారి నమ్మకమైన తయారీ

సాలోఫేన్